ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 04.03.2026 | సంపుటి : 12 సంచిక : 224 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## మూడు వారాల్లోగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నిక

ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో 19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియపై స్టే విధించింది. మిగతా 2లో..



## తెలంగాణ హైకోర్టుకు బాంబు బెదిరింపు

వారంలో ఇది రెండోసారి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ హైకోర్టుకు మరో సారి బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రోటోకాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ మిగతా 2లో..



## ఇరాన్ నాయకత్వ నివాసాలే లక్ష్యంగా
# ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ

### ఆయుధ నిల్వలపై దాడి

ఖమేనీ ప్రతీ కదలికను ట్రాక్ చేసి..

పక్కా సమాచారంతోనే అటాక్‌ప్లాన్

న్యూయార్క్,టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మృతి చెందడం సంచలనం సృష్టించింది. కొన్నేళ్లక్రితమే సుప్రీం లీడర్‌ను తమ టార్గెట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లో సుప్రీంలీడర్ కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలు, ఆయన భద్రతా సిబ్బంది వాహనాల పార్కింగ్ గురించి ఎప్పటికప్పుడు నెతన్యాహు ప్రభుత్వం పర్యవేక్షించేదని మీడియా కథనాలు పేర్కొన్నాయి. "ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారు..?" ఇలా ప్రతి విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ మిగతా 2లో..



## ప్రతీకారంతో రగిలిపోతున్న ఇరాన్

- అమెరికా, ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతున్న ఐఆర్‌జీసీ
- బహ్రెయిన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్ ధ్వంసం
- చమురు జీవనాడి హర్మూజ్ జలసంధి మూసివేత..
- ఏ దైశ నౌకలైనా వస్తే పేల్చేస్తామని హెచ్చరిక
- ఇరాన్ వార్నింగ్‌తో చమురు సంక్షోభం
- పశ్చిమాసియా ఘర్షణల్లో 3 భారతీయులు మృతి
- భారతీయ విద్యార్థులు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- అమెజాన్ డేటా సెంటర్‌లపై డ్రోన్ దాడి..

2లో..

## ఇరాన్‌తో చర్చలు లేవు

- ఇప్పటికే చాలా ఆలస్యమైంది
- ఇరాన్‌పై భీకర దాడులు తప్పవు
- మా వద్ద భారీ ఆయుధ నిల్వలున్నాయి వాటితో విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలం : ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు.వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత మిగతా 2లో..

## ఒమన్, కువైట్, ఖతార్‌లపై దాడులను ఖండించిన మోదీ

ఆయా దేశాధినేతలకు ప్రధాని ఫోన్

2లో..

## యుద్ధ భారం

- తడిసి మోపెడవుతున్న ఖర్చు
- ఒక్కరోజే 7వేల కోట్లు ఖర్చయినట్లు అంచనాలు

## ఖమేనీ హత్యపై మౌనమేలా?

- మోదీ తీరుపై మండిపడ్డ సోనియాగాంధీ
- ఇరాన్‌పై దాడి పట్ల మోదీ మాట్లాడరేం?
- ప్రధాని తీరుతో దిగజారుతున్న భారత్ ప్రతిష్ట
- మండిపడ్డ రాహుల్ గాంధీ





న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బ్జడెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్ఛిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి మిగతా 2లో..

## అమెరికా - ఇజ్రాయెల్ దాడులను ఖండించిన చైనా

- ఈ దాడులు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకం
- భద్రతా మండలి అత్యవసర ప్రాతిపదికన సమావేశం కావాలి

ప్రకటన విడుదల చేసిన చైనా విదేశాంగ శాఖ

2లో..



## ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు
# పనిచేయండి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి సూచన

హైదరాబాద్(జనంసాక్షి):ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలు జిల్లాల కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాల పాలన, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వారికి కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే అత్యంత కీలకమైన అవకాశం. ఈ సమయంలో ప్రజలతో నేరుగా మమేకమైతే క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ అనుభవమే మీ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో మిగతా 2లో..

## రూ.5వేల కోట్లతో రక్షణ ఒప్పందం

హెలికాప్టర్లు, క్షిపణుల కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థతో డీల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు, మిస్సైళ్ల కొనుగోలు కోసం హిం దుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ వెల్లడించింది. ఆరు అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణుల కొనుగోలు కోసం రూ. 5,083 కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు తెలిపింది. అడ్వాన్స్‌డ్ లైట్ మిలిటరీ హెలికాప్టర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ కోసం కొనుగోలు చేస్తుండగా.. క్షిపణులను భారత నౌకాదళ యుద్ధనౌకలలో మోహరిస్తామని రక్షణ శాఖ పేర్కొంది. ప్రస్తుతం పనిచేస్తున్న హెలికాప్టర్ల కంటే ఇవి అత్యాధునిక లక్షణాలు, సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపింది. మిగతా 2లో..



## ప్రజలకు పనికొస్తేనే మీ ఉద్యోగానికి
# సార్ధకత



### పదిరోజులైనా క్షేత్రస్థాయిలో పర్యటించండి

- కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలి
- ప్రజాపాలన ప్రగతిపై మార్చ్‌ఫాస్ట్
- మార్చి 6 నుంచి 12 వరకు
- ఐదు దశల్లో 99 రోజుల యాక్షన్‌ప్లాన్
- సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలి
- విద్యావ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపులు చేయాలి
- గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి
- ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే..
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి):ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఆ ఉద్యోగానికి సార్ధకత ఉంటుంది క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా పనిచేస్తేనే కలెక్టర్లుగా కొనసాగుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కలెక్టర్లుగా క్షేత్రస్థాయిలో పర్యటించకపోతే ఎప్పటికీ మీకు ప్రజల సమస్యలు అర్థం కావు కనీసం నెలకు 10 రోజులైనా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే..కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్దిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. మిగతా 2లో..



## జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో దారుణ ఘటన

- మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు
- ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న విపక్ష నాయకులు

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది.

జడ్చర్ల(జనంసాక్షి):

వివరాలు లోపలి పేజీలో

## వేసవి డిమాండ్‌కు అనుగుణంగా
# విద్యుత్ ప్రణాళిక

ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): మంగళవారం ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుంన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుందని.. అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కోతలు లేకుండా.. ఎటువంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద



రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండి పోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. మిగతా 2లో..

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి

పాలకల్తీకి ప్రభుత్వానిదే బాధ్యత

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

భద్రాచలం(జనంసాక్షి): భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణాకు ఇవ్వాలని సీపీఐ తరపున కోరుతున్నామని సిపి జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. విభజన సందర్భంగా ఎపిలు కలిపిన ఆ ఐదు గ్రామాలు తెలంగాణలో తిరిగి విలీనం చేయాలన్నరు. లేకుంటే తీవ్ర సమస్యలు వస్తాయన్నారు. మిగతా 2లో..

## ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- తెలంగాణలో అప్పు చేయకుండా పూటగడవని స్థితి
- ఖజానా ఖాళీ పేరుతో హామీలకు ఎగనామం
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ



హైదరాబాద్(జనంసాక్షి):అప్పు చేయకుండా పూటగడవని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదంటూ హామీల అమలుకు తప్పించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి లేఖలో తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని తెలిపారు.ఖజానా ఖాళీ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఇటీవల ఓ సభలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి చూస్తే.. 'రాష్ట్ర ఖజానా నిల్.. పార్టీ నాయకుల జేబులు ఫుల్'గా ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి తెలంగాణ అభివృద్ధికి దాదాపు రూ.12 లక్షల కోట్లు మేర నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి వివరించారు. ఇందులో పన్నుల వాటా మిగతా 2లో..

## రాజ్యసభ రేసులో నలుగురు బీసీ నేతలు

తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి): రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ..సమర్ధవంతమైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది బుధవారం తెలుస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04.03.2026

## అమెరికా - ఇజ్రాయెల్ దాడులను ఖండించిన చైనా

- ఈ దాడులు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకం
- భద్రతా మండలి అత్యవసర ప్రాతిపదికన సమావేశం కావాలి
- ప్రకటన విడుదల చేసిన చైనా విదేశాంగ శాఖ

**బీజింగ్ (జనంసాక్షి):**ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను చైనా ఖండించింది. తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని సూచించింది. లెబనాన్‌లో ఈ ఘర్షణలు ఇతర దేశాలకు విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ ఈ ప్రకటనను విడుదల చేసింది. అన్ని సైనిక చర్యలకూ ముగింపు చెప్పడం తక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి సూచించారు. అమెరికా నేతృత్వంలో జరుగుతున్న దాడులు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని కూడా చైనా కామెంట్ చేసింది. ఈ దాడులకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అనుమతి లేదని పేర్కొంది. ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా మండలి అత్యవసర ప్రాతిపదికన సమావేశం కావాలని చైనా సూచించింది. గల్ఫ్ దేశాల సార్వభౌమత్వం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని స్పష్టం చేసింది. రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ ఈ విషయమైన ఫోన్‌లో మాట్లాడారు. శాంతి నెలకొల్పే దిశగా ప్రయత్నాలు జరగాలని చెప్పారు. త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు నిరంతరం టచ్‌లో ఉన్నాయని కూడా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఇక ఇరాన్‌లో చిక్కుకున్న చైనీయులను స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చైనా ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే 3 వేల మంది చైనీయులను స్వదేశానికి తీసుకొచ్చామని పేర్కొంది.

## ఖమేనీ హత్యపై మౌనమెందుకు?

బహిరంగంగా ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసినట్లు అమెరికా మరియు ఇజ్రాయెల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

**ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు: రాహుల్**

అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.

## యుద్ధ భారం..

వాషింగ్టన్,మార్చి3(జనంసాక్షి): ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే.

### ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

రూ.2.5 లక్షల కోట్లు, రహదారులు రూ.1.85 లక్షల కోట్లు, రైల్వే బ్జడెట్ కేటాయింపులు రూ.36000 కోట్లకు పైగా, రైల్వే పనులకు మరో రూ. 50,000 కోట్లు, ఉపాధి హామీ రూ.40,000 కోట్లు, విద్యుత్ ప్రాజెక్టులు రూ.12,000 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.14,000 కోట్లు, ఉచిత రేషన్ రూ.50,000 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లు, విద్య.. క్రీడలకు రూ.21,000 కోట్లు, ఆరోగ్య సంరక్షణకు రూ.9,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో రైతుల నుంచి వరి సేకరణకు రూ.2.6 లక్షల కోట్లు, పత్తి సేకరణకు రూ.60,000 కోట్ల కనీస మద్దుత ధర చెల్లించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా రూ.10 లక్షల కోట్ల ఋణాలు అందించారని చెప్పారు. 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద వడ్డీ రహిత ఋణాలుగా రూ.10,000 కోట్లు పైగా ఇచ్చి మూలధన ప్రాజెక్టులకు సహకరించారని కేంద్రమంత్రి వివరించారు. ఈ నిధులతో మురుగునీటి నాళాలు, రోడ్లు, రైల్వేలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, మెడికల్-నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్లు, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి - మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్‌లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులను ఖర్చు చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేజ్ - ఎఎ కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ.114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ.315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ.200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇరాన్ నాయకత్వ నివాసాలే లక్ష్యంగా
# 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'

నిఘా వర్గాలు సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉన్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది."మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ గురించి కూడా అంతే బాగా తెలుసు" అని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందట. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి ఈ డేటానే ఉపయోగపడింది.ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున (శనివారం) తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది.

**ఏకకాలంలో సైబర్ దాడులు కూడా..**

ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి. దాంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పడిపోయిందని ఆ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఈ సైబర్ అటాక్ చేసినట్లు తెలుస్తోంది.

**ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి చేశాం: ఐడీఎఫ్**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి చేసినట్లు ప్రకటించింది. "కచ్చితమైన నిఘా సమాచారం ఆధారంగా.. టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న కీలక ప్రాంగణంపై దాడులు చేశాం. అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై అనేక బాంబులు జారవిడిచాం. అదేవిధంగా ఇరాన్ సైనికాధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థను, ఇతర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాం" అని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది.మరోవైపు.. యుద్ధంపై ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ నాదవ్ శోషాని కీలక వ్యాఖ్యలు చేశారు. దాడులు అనేక వారాల పాటు కొనసాగవచ్చనే అంచనాతో తమ సైన్యం సిద్ధమైందని చెప్పారు. అయితే, యుద్ధం ఎంత కాలం కొనసాగుతుందనేది పరిస్థితులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటివరకు యుద్ధంలో సానుకూల పురోగతి సాధించామని ఓ మీడియా సమావేశంలో తెలిపారు. ఇరాన్‌లో భూతల దాడుల కోసం బలగాలను మోహరించే అవకాశం ఉందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. అలాంటిదేమీ లేదని చెప్పారు. ఇప్పటికైతే అటువంటి ఆలోచనలు లేవన్నారు.



## ప్రతీకారంతో రగిలిపోతున్న ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**పశ్చిమాసియాలో తాజా ఘర్షణలు నాలుగో రోజుకు చేరాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ప్రాంతంలోని అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశామని మంగళవారం ఇరాన్ ప్రకటించుకుంది. డ్రోన్లు, క్షిపణులతో కమాండ్ సెంటర్, కేంద్ర కార్యాలయాన్ని దెబ్బతీశామని వెల్లడించింది. "20 డ్రోన్లు, మూడు క్షిపణులతో టార్గెట్లను ఢీకొట్టాం. దాంతో ఆ ప్రాంతంలో ఇంధనాన్ని నిల్వ చేసే ట్యాంకులకు మంటలు అంటుకొని ఆ ప్రాంతమంతా పొగ అలముకుంది" అని ఇరాన్ వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని రమాత్ డేవిడ్ ఎయిర్‌బేస్‌పై దాడి జరిగినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది. రాడార్ కేంద్రాలు, కంట్రోల్ రూమ్‌లను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. అందుకోసం డ్రోన్ల గుంపును పంపినట్లు పేర్కొంది. ఇదిలాఉంటే.. బీరుట్ దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ (ఎబితీజీవశ్రీ) హెచ్చరికలు చేసింది. "ఎరుపు రంగు మార్కింగ్‌లో ఉన్న భవనాలు, ఆ పక్కనే ఉన్న ఇళ్లను తక్షణమే ఖాళీ చేయాలి. కనీసం 300 మీటర్లు దూరంగా వెళ్లండి. ఆ భవనాలన్నీ హెజ్‌బొల్లా స్థావరాలకు దగ్గర్లో ఉన్నాయి" అని ఇజ్రాయెల్ పేర్కొంది.

**ముగ్గురు భారతీయులు మృతి**

పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు భారతదేశానికి చెందిన ముగ్గురు నావికులు మృతి చెందినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ వెల్లడించింది. ఒమన్ తీర ప్రాంతాల్లో ఉన్న పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడు ల్లో ముగ్గురు భారతీయులు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో షిప్ ఆపరేటర్లకు అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్ హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను గమనిస్తున్నామని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో క్షిపణి, డ్రోన్ కార్యకలాపాలకు సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. షిప్ ఆపరేటర్ల భద్రతను కచ్చితంగా దృష్టిలోఉంచుకోవాలని.. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే రిపోర్టు చేయాలని సూచించింది. తాజా నివేదికల ప్రకారం.. భారత జెండా ఉన్న నౌకలను బంధించినట్లు ఎటువంటి సమాచారం రాలేదని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నందున పర్షియన్ గల్ఫ్ సమీపంలో చిక్కుకొన్న భారతీయ నావికులకు తక్షణ సాయం అందించడానికి.. వారిని భారత్‌కు తరలించడానికి ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. యుద్ధం వల్ల ప్రభావితులైన భారత నావికులతో ఈ బృందంలోని అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతారన్నారు. నావికుల కుటుంబాలు, షిప్పింగ్ కంపెనీలు, ట్రేడ్ యూనియన్లు, విదేశాలలో ఉన్న భారతీయ మిషన్లు, సంబంధిత పోర్ట్ అధికారులతోనూ ఈ బృందం సమన్వయం చేసుకుంటుందన్నారు. ఇదీ చదవండి: హోర్ముజ్‌ను మూసేశాం.. నౌకలు వచ్చాయో: ఇరాన్ వార్నింగ్

సురక్షిత ప్రాంతాలకు భారతీయ విద్యార్థులు

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ పెద్దఎత్తున దాడులు చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అక్కడున్న భారతీయ విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక రాయబార కార్యాలయం కీలక చర్యలు తీసుకుంది. అనేక మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించింది. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది."టెహ్రాన్‌పై దాడులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో.. నగరంలోని అనేక మంది భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలించాం. విద్యార్థుల రవాణా, ఆహారం, వసతి ఏర్పాట్లను చూసుకున్నాం. ఎంబసీ సాయాన్ని నిరాకరించిన కొంతమంది మాత్రమే ప్రస్తుతం టెహ్రాన్‌లో ఉన్నారు.ఇంకా ఇరాన్‌లోనే ఉన్న భారతీయ విద్యార్థులు, పౌరులు.. ఇదివరకే జారీ చేసిన సలహాలు పాటించాలన్నారు.

## ఇరాన్‌తో చర్చలు లేవు

ఇరాన్‌తో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు. "అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి" అని తన పోస్టులో పేర్కొన్నారు.

**రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు..!**

ఇరాన్‌పై యుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు అమెరికా సిద్ధమైంది. రానున్న 24 గంటల్లో ఆ దేశంపై భీకర దాడులు చేయనున్నట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్‌పై తాము ఇప్పటివరకు పెద్ద దాడులే చేయలేదని వ్యాఖ్యానించారు. త్వరలోనే భీకర దాడులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. 'మేము ఇరాన్‌లోని చెత్తను తొలగిస్తాం. మా వద్ద ప్రపంచంలోనే గొప్ప సైన్యం ఉంది. మేము దాన్ని ఉపయోగిస్తున్నాం' అని ట్రంప్ అన్నారు. యుద్ధం ఎక్కువ కాలం జరగాలని తాను కోరుకోవడం లేదని అధ్యక్షుడు పేర్కొన్నారు.

## ఒమన్, కువైట్, ఖతార్‌లపై దాడులను ఖండించిన మోదీ

ఆయా దేశాధినేతలకు ప్రధాని ఫోన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు భారత్‌కు చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ పరిణామాల నడుమ ఒమన్, కువైట్, ఖతార్ పాలకులతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆయా దేశాలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు."ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్, కువైట్ యువరాజు సభా అల్-ఖాలీద్ అల్-సభా, ఖతార్ ఎమిర్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీలతో ప్రధాని మోదీ ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడారు. ఈ దేశాలపై దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. వారి భద్రత గురించి చర్చించారు. దౌత్యమార్గాలు, చర్చల ద్వారా ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని నేతలంతా ఏకాభిప్రాయానికి వచ్చారు" అని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియాలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఇప్పటికే బహ్రెయిన్, సౌదీ అరేబియా, జోర్డాన్, యూఏఈ తదితర దేశాల అధినేతలతో మాట్లాడారు. పశ్చిమాసియాలో దాదాపు 90 లక్షలమంది భారతీయులు నివసిస్తున్నారు.

### తెలంగాణ హైకోర్టుకు బాంబు బెదిరింపు

అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు ప్రారంభించారు. బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు రంగంలోకి దిగి ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండోసారి బాంబు బెదిరింపు రావడం గమనార్హం. ఇటీవల కూడా ఇలాంటి ఈ-మెయిల్ రావడంతో భద్రతా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ కోర్టులను లక్ష్యంగా చేసుకుని తమిళనాడు పేరుతో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం.ఈ-మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాంగణంలో భద్రతను మరింత పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు.

**మూడు వారాల్లోగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నిక**

మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

### రూ.5వేల కోట్లతో రక్షణ శాఖ ఒప్పందం

ద్వీపాల భద్రత, సముద్ర పర్యావరణ రక్షణ విధులను నిర్వర్తించడంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సామర్థ్యాన్ని ఇవి మరింత గణనీయంగా పెంచుతాయని డిఫెన్స్ వర్గాలు తెలిపాయి.ఉపరితలం నుంచి గగనతలానికి నిలువుగా ప్రయోగించే - ష్టిల్ క్షిపణులు, వాటి అనుబంధ క్షిపణి హోల్డింగ్ ఫ్రేమ్‌ల కోసం రష్యాకు చెందిన సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ తెలిపింది. విస్తృత శ్రేణి వైమానిక దాడులు ఎదుర్కోవడానికి ఈ హోల్డింగ్ ఫ్రేమ్‌లు ఉపయోగపడతాయంది. ాష్ట్రబితిశ్రీ క్షిపణులు భారత నౌకాదళ ప్రతిచర్యలను మరింత వేగవంతం చేస్తాయని పేర్కొంది. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ మెరుగైన మనుగడ సాగిస్తాయంది. ఈ ఒప్పందం వల్ల భారత్- రష్యా మధ్య ఉన్న రక్షణ భాగస్వామ్యం మరింత స్థిరంగా మారుతుందని తెలిపింది.

## రాజ్యసభ రేసులో నలుగురు బీసీ నేతలు

అవకాశాలు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. పినరయి విజయన్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు. పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రజలకు పనికొస్తేనే మీ ఉద్యోగానికి సార్థకత

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. . మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి

ధార్మిక సంస్థల్లో కఠినమైన పాలసీలు తీసుకురావటం ద్వారానే లడ్డూ కల్తీ లాంటి సమస్యలు ఆగుతాయని స్పష్టం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిజాయితీగా ఉంటే ఎవరూ ఏమీ చేయలేరని, శ్రీలక్ష్మి చేసిన చిన్న తప్పిదం వలన ఆమె కెరీర్ దెబ్బతిందన్నారు. బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రలోభాలకు లొంగడంతోనే వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ లో జరిగిన దుర్ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అని నారాయణ పేర్కొన్నారు. కల్తీ పాలు తాగటం వలన ప్రజలు చనిపోతున్నారని, డెయిరీలపై ప్రభుత్వ నియంత్రణ ఏమైందని ప్రశ్నించారు. నక్సలైట్లను చంపవచ్చు కానీ నక్సలిజాన్ని అంతం చేయలేరన్నారు. పేదరిక నిర్మూలన జరిగితే నక్సలిజం అవసరమే రాదన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అణగదొక్కాలని అవినీతి మరక అంటించారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఆరు వేల కోట్లు ఉన్నాయని.. రెండు వేల కోట్లు విడుదల చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ కేసును సీఎం చంద్రబాబు మధ్యవర్తిత్వానికి అప్పగించాలని నారాయణ కోరారు. అమెరికాకు ఎవరు ఎదురు తిరిగినా వారిపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడులకు దిగడం దారుణమని సీపీఐ జాతీయ నేత నారాయణ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇరాన్ తన స్వయం ప్రతిపత్తిని కాపాడుకునే ప్రయత్నంగా యుద్ధం చేస్తుందన్నారు. దురాక్రమణ చేసేందుకే పలు కారణాలు చూపి యుద్ధం ప్రారంభించిందని అమెరికాపై మండిపడ్డారు. ప్రధాని మోడీ చొరవ తీసుకుని ప్రపంచ దేశాల సమన్వయంతో ట్రంప్‌తో మాట్లాడి యుద్ధం ఆపేలా ప్రయత్నం చేయాలని కోరారు.

## వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ప్రణాళిక

వేసవి మొదలై అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. గత మూడు రోజులుగా ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ వినియోగంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. మార్చి 3వ తేదీ మంగళవారం ఉదయం 11:01 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. వేసవి కాలం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న తరుణంలో, ఇంతటి భారీ స్థాయిలో విద్యుత్ అవసరం ఏర్పడినప్పటికీ, ఎక్కడా చిన్నపాటి అంతరాయం కూడా లేకుండా సరఫరాను కొనసాగించి రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ సమర్థతను చాటుకున్నాయి. గతేడాది మార్చిలో నమోదైన 15,623 మెగావాట్ల రికార్డును, అలాగే గత నెలలో నమోదైన గణాంకాలను ఈ కొత్త రికార్డు వెనక్కి నెట్టేసింది. రాష్ట్రంలో పారిశ్రామికాభి వృద్ధి, ఐటీ రంగ విస్తరణతో పాటు ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయానికి అందిస్తున్న నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా ఈ భారీ డిమాండ్‌కు ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తు న్నారు. ముఖ్యంగా సాగునీటి అవసరాల కోసం రైతాంగం మోటార్లను పెద్ద ఎత్తున వినియోగి స్తుండటం, పట్టణ ప్రాంతాల్లో ఏసీల వాడకం పెరగడం వంటి అంశాలు విద్యుత్ వినియోగాన్ని గరిష్ట స్థాయికి చేర్చాయి. భౌగోళికంగా చిన్న రాష్ట్రమైనప్పటికీ, విద్యుత్ డిమాండ్ విషయంలో తెలంగాణ ఇప్పుడు రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలతో పోటీ పడుతోంది. పంజాబ్, హర్యానా వంటి పారిశ్రామిక రాష్ట్రాల కంటే తెలంగాణలో డిమాండ్ ఎక్కువగా ఉండటం ఇక్కడి ఆర్థిక పురోగతికి నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ చారిత్రాత్మక ఘనతపై ఉప ముఖ్యమంత్రి , ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా హ్యాండిల్ చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులను , సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రం ఎంతటి భారీ డిమాండ్‌నైనా తట్టుకునేలా సబ్-స్టేషన్ల పటిష్ఠత, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ 19,000 మెగావాట్లను దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, దానికి తగినట్లుగా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'తో ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం , అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ప్రజాపాలనలో 'ప్రజలే కేంద్రంగా' పాలన సాగాలని మంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుంటూనే, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి.అధికార యంత్రాంగం అంతా ఒక టీమ్‌లా కలిసి పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలపై పట్టు సాధించాలని ఆయన అధికారులకు సూచించారు.

## జడ్చర్ల ఆసుపత్రి ఘటనపై ప్రభుత్వం సీరియస్



- నలుగురు ఆసుపత్రి సిబ్బంది సస్పెన్షన్
- ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
- ఎమ్మెల్యే ఫిర్యాదుతో చర్యలు చేపట్టిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, మార్చి 3 (జనంసాక్షి) :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని కుక్క పీక్కుతిన్న అమానవీయ ఘటనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ ఘటనపై జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జే. అజయ్ కుమార్ మంగళవారం జడ్చర్ల ఆసుపత్రిని, మార్చురీని స్వయంగా సందర్శించి విచారణ చేపట్టారు. విచారణలో విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో నలుగురు ఆసుపత్రి సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మార్చురీ వద్ద భద్రతను పటిష్టం చేయాలని, పర్యవేక్షణలో విఫలమైన వారికి నోటీసులు ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. మానవత్వానికే మచ్చగా నిలిచిన ఈ ఘటనపై బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని మరోసారి కోరారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు ఈ అంశాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఫేస్ ఫొటో క్యాప్చర్ తిప్పలు

- పని వేళల్లో నిరీక్షించి నీరసిస్తున్న ఉపాధి హామీ కూలీలు
- ఆన్‌లైన్ అంతరాయంతో ఫేస్ ఫోటో క్యాప్చర్ కాకపోవడంతో కూలీల ఆగ్రహం
- ఉపాధిహామీ గ్రామస్థాయి ఉద్యోగులకు తప్పని తిప్పలు
- కొత్త ఫోటో క్యాప్చర్ పై గ్రామస్థాయి ఉద్యోగులకు కనీసం ట్రైనింగ్ ఇవ్వని జిల్లా అధికారులు



**హనుమకొండ ప్రతినిధి మార్చి 3 (జనం సాక్షి) :** మార్చి 1 నుండి హనుమకొండ జిల్లా పరిధిలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు "ఫోటో క్యాప్చర్" పేరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుచున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలికి పని ప్రదేశంలో ఫేస్ ఫోటో క్యాప్చర్ చేయాలని ఆదేశించడంతో మండల స్థాయి అధికారులకు గ్రామస్థాయి ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేయడంతో గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశంలో ప్రతి ఒక్క కూలికి ఫేస్ ఫోటో క్యాప్చర్ చేస్తుండగా అది ఆన్లైన్ అంతరాయంతో తీసుకోకపోవడం గంటల తరబడి ఉపాధి హామీ కూలీలు ఎండలో పడిగాపులు కాయడం జరుగుచున్నది. పనిచేసిన దానికన్నా పడిగాపులు కాయడం ఉపాధి హామీ కూలీలను తీవ్ర మనోవేదనకు గురి చేసినట్లు ఉందని అధికారులపై ఉపాధి హామీ కూలీలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఉపాధి హామీ గ్రామస్థాయి ఉద్యోగులకు కొత్త ఫోటో క్యాప్చర్ పై ట్రైనింగ్ ఇవ్వాలి

ఉపాధి హామీ జిల్లా స్థాయి అధికారులు ఉపాధి హామీ గ్రామస్థాయి ఉద్యోగులకు నూతన ఫేస్ ఫోటో క్యాప్చర్ పై ఎలాంటి ట్రైనింగ్ ఇవ్వకుండామార్చి ఒకటి నుండి ఉపాధి హామీ కూలీలకు పేస్ ఫోటో క్యాప్చర్ చేయాలని మండల స్థాయి అధికారులు ఆదేశించడంతో గ్రామాలలో ఉపాధి హామీ కూలీలను ఫేస్ ఫోటో క్యాప్చర్ లు చేసే విషయంలో ఫేస్ ఫోటో క్యాప్చర్ కాకపోవడంతో కూలీలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఉపాధి హామీ గ్రామస్థాయి ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురి చెందుతున్నారు జిల్లా స్థాయి అధికారులు గ్రామస్థాయి అధికారులకు ఫేస్ ఫోటో క్యాప్చర్ పై ట్రైనింగ్ ఇచ్చిన అనంతరం ఫేస్ ఫోటో క్యాప్చర్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు మండల స్థాయి అధికారుల వాదన అధికారులు మాత్రం అవకతవకలు అరికట్టేందుకు, నకిలీ హాజరును నివారించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫేస్ ఫోటో క్యాప్చర్ విధానం అవసరమని . పారదర్శకత కోసం ఈ విధానం తీసుకువచ్చినట్లు తెలియజేస్తున్నారు.

### ఉపాధి హామీ కూలీల డిమాండ్లు

నెట్ సమస్యలున్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ హాజరు విధానం కల్పించాలి. ఫోటో అప్‌లోడ్ లోపాల వల్ల వేతనాలు నిలిపివేయకూడదు. సాంకేతిక సహాయం కోసం గ్రామస్థాయి ఉపాధి హామీ ఉద్యోగికి ట్రైనింగ్ ఇవ్వాలిగ్రామీణ ఉపాధికి అండగా నిలవాల్సిన పథకం, సాంకేతిక సమస్యలతో కూలీలకు భారంగా మారకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కూలీలు కోరుతున్నారు. హనుమకొండ జిల్లా డిఆర్డిఓ మేన శ్రీను ను వివరణ కోసం చరవాణి ద్వారా జనం సాక్షి ప్రతినిధి సంప్రదించగా చరవాణి కి స్పందించే లేదు.

## హలో జగ్గా జీ.. హౌ ఆర్ యు

- షేక్ హ్యాండ్ ఇచ్చి పలకరించిన రాహుల్ గాంధీ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ డిసిసి అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా ఏఐసిసి అధినాయకుడు రాహుల్ గాంధీ హాజరైన విషయం తెలిసిందే. డిసిసి అధ్యక్షుల సమావేశానికి ముందు కాంగ్రెస్ పిఏసి కమిటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరయ్యారు. సమావేశం ముగించుకుని రాహుల్ గాంధీ వెళ్తున్న సందర్భం లో ఆయన కారు వద్దకు చేరుకోగానే ఏపిసిసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ అక్కడే ఉన్న జగ్గారెడ్డి ని చూసి రాహుల్ జీ.. జగ్గన్న ఈజ్ హియర్.. అంటూ రాహుల్ గాంధీకి చెప్పారు. వెంటనే రాహుల్ గాంధీ జగ్గారెడ్డివైపు చూసి చేతిని గట్టిగా పట్టుకుని హాయ్ జగ్గ జీ.. హౌ ఆర్ యు అంటూ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం కార్ లో ఎక్కి వెళ్లిపోయారు.

## నేడు జైలు నుంచి బాల్క సుమన్ విడుదల

- ర్యాలీ కోసం బిఆర్ఎస్ నేతల సన్నాహాలు



**మంచిర్యాల, మార్చి 3 (జనంసాక్షి) :** క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా కేసులతో జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బీఆర్ఎస్ నాయకులు బుధవారం విడుదల కానున్నారు. బెయిల్ పిటిషన్ పై సోమవారం వాదనలు విన్న జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే చెన్నూర్ కోర్టులో ఉన్న మరో కేసులో పీటీ వారెంట్ ఫిటిషన్‌పై విచారణను ఆ కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. బాల్కసుమన్‌కు ఈ కేసులోనూ బెయిల్ రావాల్సి ఉండటంతో ఐదో తేదీ తర్వాతే ఆయన జైలు నుంచి బయటికి వస్తారని అంతా భావించారు. ఈ నేపథ్యంలో మంగళ వారం చెన్నూర్ కోర్టులో పీటీ వారెంట్ ఫిటిషన్ పై విచారణ జరపాలని బాల్కసుమన్ అడ్వొకేట్లు మరో ఫిటిషన్ వేయ దంతో కోర్టు విచారణను స్వీకరిం చింది. బాల్క సుమన్ తరుపు న్యాయవాదులు వాదనల అనంతరం పెట్టిన కేసు బెయిలెబుల్ అఫెన్స్ కావడంతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో బాల్కసుమన్ సహా ఆయనతో పాటు అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు జైలు నుంచి విడుదల కానున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని, రేపు ఉదయం 7 గంటలకు బాల్కసుమన్ జైలు నుంచి బయటికి వస్తారని ఆయన తరుపు న్యాయవాదులు తెలిపారు. బాల్కసుమన్ బయటికి రానున్న నేపథ్యంలో చెన్నూర్ లో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన బాల్కసుమన్ సహా ఇతర బీఆర్ఎస్ నాయకు లను వందలాది వాహనాల్లో ర్యాలీగా క్యాతన్‌పల్లికి తీసుకురా నున్నారు. వచ్చే మార్గంలో మంచిర్యాల జిల్లా పరిధిలోని ప్రధాన రహదారి మార్గాల్లోని పలు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సుమన్ పూలమాల వేస్తారని అక్కడి నుంచి నేరుగా క్యాతన్‌పల్లిలోని తన నివాసానికి చేరుకుం టారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.




## హైదరాబాద్ మెట్రోకు రాపిడో అండ

- ఫస్ట్, లాస్ట్ మైల్ భాగస్వామిగా దూసుకెళ్తున్న సంస్థ

**ఖైరతాబాద్, మార్చి 03 (జనం సాక్షి) :** హైదరాబాద్ మెట్రో ప్రయాణ వ్యవస్థలో రాపిడో కీలక భాగస్వామిగా ఎదిగిందని రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడు తూ నగరంలోని ఫస్ట్ లాస్ట్ మైల్ కనెక్టివిటీకి బలమైన మద్దతు అందిస్తూ రోజూ 1.5 లక్షలకు పైగా ప్రయాణాలను మెట్రో స్టేషన్లతో అనుసం ధానం చేస్తోందని తెలిపారు. మెట్రో ప్రయాణం పూర్తి కావాలంటే ఇంటి నుంచి స్టేషన్ వరకు, స్టేషన్ నుంచి గమ్యస్థానం వరకు సౌకర్యవంతమైన రవాణా అవసరం అన్నారు. ఈ లోటును రాపిడో బైక్ లు, ఆటోలు భర్తీ చేస్తున్నాయని తెలిపారు. రోజూ సుమారు 1.5 లక్షల రాపిడో రైడ్లు మెట్రో స్టేషన్లతో అనుసంధానం అవుతున్నాయని తెలిపారు. రోజుకు సుమారు 30 వేల మెట్రో టికెట్లను ప్రయాణికులు రాపిడో యాప్ లోనే బుక్ చేస్తున్నారని తెలిపారు.

## ఎరువులపై అవగాహన పెంచుకోవాలి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రైతులు అమాయకులు కావడంతో ఎరువులపై అంత అవగాహన ఉండదని, వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని కంపెనీలు మోసం చేస్తున్నాయని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కోఠిలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మన పూర్వీకులు ఇలాంటి మందులు వాడలేదని ఇప్పుడు రసాయనాలతో కూడిన వ్యవసాయం అయిపోయిందన్నారు. మల్టీ నేషనల్ కంపెనీ వాళ్ళ కోసం ఇలాంటి మందులను తీసుకొస్తున్నారు. ఈ గడ్డి మందుతో మనుషులు ప్రాణాలు పోతున్నాయని కల్తీ ఎరువులు, మందులు వ్యవసాయ రంగం పైన తీవ్రమైన ప్రభావం చూపిస్తుందన్నారు. పారాక్వాట్‌ను ?నిషేదించేలా కేంద్ర చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ లను కలిసి వినతిపత్రం అందజేస్తానని తెలిపారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజలు ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ గడ్డి మందు నిషేధించాలని, దీనిపై పార్లమెంట్ లో కూడా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. తనకు ఈ అంశంపై ఆరు నెలలు క్రితం తెలిసిందని ఇలాంటి ప్రమాదకరమైన మందులు అమెజాన్ వంటి ఆన్‌లైన్‌లో విక్రయించడం బాధాకరంగా ఉందన్నారు. ఈ మందుతో క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిని పూర్తిగా నిషేధించేలా తన వంతు కృషి చేస్తానని కోదండరెడ్డి పేర్కొన్నారు.

## ఖమేనీ హత్య కోసం ఇజ్రాయిల్ నిరంతర నిఘా

- ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించినట్లు ప్రచారం
- కమేనీ కదలికలను గుర్తించి..పక్కాగా బాంబింగ్



**వాషింగ్టన్, మార్చి3 (జనంసాక్షి) :** ఆధునిక యుద్ధవిద్యలో ఇప్పుడు పక్కాగా సమాచార సేవకరణ, దానిని అమలు పర్చడంలో అమెరికా-ఇజ్రాయెల్ విజయం సాధించాయని విదేవీ వార్తా సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పక్కా ప్లాన్‌తో దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ అంతమొందించడం సంచలనం సృష్టించింది. ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారన్న ప్రతి విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉన్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది. మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ గురించి కూడా అంతే బాగా తెలుసు అని ఆ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందని అంటున్నారు. కొన్నేళ్లక్రితమే సుప్రీంలీడర్‌ను తమ టార్గెట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని పెస్టర్ స్ట్రీట్ సమీపంలోని సుప్రీంలీడర్‌కు చెందిన కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలను, ఖమేనీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వాహనాలను పార్క్ చేసిన ప్రదేశాలను ఒక కెమెరాతో నెతన్యాహు ప్రభుత్వం నిత్యం గుర్తించేదని ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి ఈ డేటానే ఉపయోగపడింది. ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున శనివారం తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది. ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి. దాంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పడిపోయిందని ఆ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఈ సైబర్ అటాక్ చేసినట్లు తెలుస్తోంది.

## ధర లేక రోడ్డుపై టమాట పారబోత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కూరల్లో ఉండాల్సిన టమాటా.. నేడు రోడ్డుపాలైంది. ఊహించని విధంగా దిగుబడి పెరగడంతో మార్కెట్‌లో ధరలు భారీగా పతనమయ్యాయి. దీంతో పెట్టుబడి కూడా రాక దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులు తమ ఆగ్రహాన్ని, ఆవేదనను రోడ్డుపైనే ప్రదర్శించారు. నగర శివారులోని కందుకూరు సమీపంలో గల శ్రీశైలం రహదారిపై రైతులు భారీగా టమాటాలను కుప్పలుగా పారబోసి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో 25 కిలోల టమాటా బాక్స్ కేవలం రూ.80 నుంచి రూ.100 వరకు మాత్రమే పలుకుతోంది. అంటే కిలో ధర కేవలం రూ.4కు పడిపోవడం గమనార్హం. పంటను కోయడానికి అయ్యే కూలీలు, మార్కెట్‌కు తీసుకెళ్లే రవాణా ఖర్చులు కూడా ఈ ధరతో రావడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇలా రోడ్డుపై పారబోస్తున్నామంటూ రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని లేదా తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రశ్నాపత్రం సరిగ్గా రెడీ చేయలేరా?

- ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్‌కుమార్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో విద్యావ్యవస్థలో నెలకొన్నఅవ్యవస్థ, పరిపాలనలో చోటుచేసుకుంటున్న వైఫల్యాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్‌కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా 'లా' పరీక్షల నిర్వహణలో రేవంత్ సర్కార్ ఘోర వైఫల్యం చెందిందని.. ఒకే పేపర్‌తో రెండు పరీక్షలా..? అంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన లా కోర్సుల పరీక్షల విషయంలో జరిగిన గందరగోళాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉస్మానియాలో ఐదేళ్ల లా కోర్సు (ఫిబ్రవరి 25), మూడేళ్ల హానర్స్ లా కోర్సు (ఫిబ్రవరి 27) పరీక్షలకు ఒకే ప్రశ్నాపత్రం ఇవ్వడం విద్యా శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. 'హిస్టరీ ఆఫ్ కోర్ట్స్, లెజిస్లేచర్స్ అండ్ లీగల్ ప్రొఫెషన్స్ ఇన్ ఇండియా' (5 ˆఘుతీం), 'లీగల్ అండ్ కాన్స్టిట్యూషన్ హిస్టరీ ఆఫ్ ఇండియా' (3ˆఘుతీం) పేపర్లు ఒకేలా రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 25న జరిగిన పరీక్ష అనంతరం, ఫిబ్రవరి 27న జరిగిన పరీక్షకు అదే ప్రశ్నాపత్రం ఎలా వచ్చిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం సైతం సక్రమంగా సిద్ధం చేయలేని ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎలా సమర్థంగా నడిపిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందనడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణ అని దాసోజ్ శ్రవణ్‌కుమార్ స్పష్టం చేశారు.

## జాతీయ పోలీస్ అకాడమీని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

- కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ ప్రారంభ కార్యక్రమాన్ని తిలకించిన కేంద్ర మంత్రి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర హోం శాఖ రాష్ట్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుండి అమరుల స్మారక స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం నేషనల్ పోలీస్ అకాడమీలోని మౌలిక వసతులను సందర్శించారు. సైబర్ ల్యాబ్ ు సైబర్ ఎక్స్ ల్యాబ్ ను సందర్శించిన కేంద్ర మంత్రి సైబర్ ల్యాబ్ ద్వారా ఎవరెవరికి ఎలాంటి శిక్షణను అందిస్తున్నారని, ఏయే కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్, కౌంటర్ టెర్రరిజం. డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ దాడులను ఎలా అడ్డుకోవడం వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ ప్రాజెక్ట్‌పై అధికారులు కేంద్ర మంత్రికి ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రెజెంటేషన్ అనంతరం సీపీడబ్ల్యూ అధికారులు, వర్క్స్, అవుట్‌డోర్ సిబ్బందికి స్మారక చిహ్నాలను ప్రదానం చేశారు. అకాడమీ బోర్డ్ రూమ్‌లో శిక్షణ కార్యకలాపాలపై ప్రదర్శనను తిలకించారు. కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్ కార్యక్రమం ద్వారా దేశ పోలీసు దళాల శిక్షణా మౌలిక వసతులను బలోపేతం చేయడం, ఆధునిక షూటింగ్, సైబర్ సామర్థ్యాలను పెంపొందించడం పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
4 మార్చి 2026

# పశ్చిమాసియాలో సంగ్రామ మేఘాలు

## ప్రపంచ శాంతికి కొత్త సవాళ్లు



పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. "ఆపరేషన్ ఎపిక్ ఫూరీ" పేరుతో కొనసాగుతున్న అమెరికా–ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం–ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీరాబాద్ డొల్లాహియాన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతున్నాయి.

ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా--ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది.

ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా–ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయ పడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి.

గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హార్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి.

జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది.

మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా–ఇజ్రాయిల్–యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా–చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు–ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది.

ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. మూలధన ప్రవాహాలు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి.

భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. విదేశీ మారక నిల్వల వినియోగం పెరుగుతుంది. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత ప్రశ్నార్థక మవుతుంది. అవసరమైతే వారిని సురక్షితంగా తరలించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఎరువులు, సహజ వాయువు, పెట్రో ధరలను రసాయనాల సరఫరాపై కూడా ప్రభావం పడుతుంది.

ఇరాన్ అంతర్గత పరిస్థితులు కూడా ఈ సంగ్రామ వాతావరణంతో సంక్లిష్టంగా మారుతున్నాయి. ఆర్థిక ఆంక్షలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశానికి సైనిక ఒత్తిడి మరింత భారంగా మారుతుంది. అయితే విదేశీ దాడులు దేశంలో జాతీయత భావాన్ని పెంచి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టే అవకాశమూ ఉంది. అమెరికా–ఇజ్రాయిల్ చర్యలను తమ సార్వభౌమాధికారంపై దాడిగా చిత్రీకరిస్తూ ఇరాన్ ప్రజలను సమీకరించే ప్రయత్నం జరుగుతోంది.

సమగ్రంగా పరిశీలిస్తే ఈ సంక్షోభం కేవలం ప్రాంతీయ ఘర్షణ మాత్రమే కాదు; ప్రపంచ శక్తి సమీకరణాలను ప్రభావితం చేసే పరిణామం. అణు వ్యాప్తి నిరోధక విధానాల భవిష్యత్తు, అంతర్జాతీయ దౌత్య వ్యవస్థ విశ్వసనీయత, ఇంధన భద్రత–ఈ అంశాలన్నీ దీనితో ముడిపడి ఉన్నాయి. మూడవ ప్రపంచ సంగ్రామం అనేది అత్యంత దుర్భర పరిణామం. అది జరిగితే మానవ నాగరికతకే ముప్పు. అందువల్ల ప్రపంచ నాయకులు వివేకంతో వ్యవహరించి చర్చల ద్వారానే శాశ్వత శాంతిని సాధించాలి. శక్తి ప్రదర్శన కంటే పరస్పర గౌరవం, ప్రతీకారం కంటే సంభాషణ, ఆధిపత్యం కంటే సహకారం–ఇవే స్థిరమైన శాంతికి మార్గదర్శకాలు. ప్రపంచం యుద్ధ అంచున నిలవకుండా, శాంతి మార్గంలో ముందుకు సాగాలని మానవజాతి ఆకాంక్షిస్తోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494

# ప్రపంచం అట్టుడుకుతున్నా ప్రశాంతంగా భారత్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా సవాళ్లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఇరాన్ మరియు ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి పెద్ద సవాలుగా మారాయి. ఈ పరిస్థితుల్లో అనేక దేశాలు భద్రతా పరంగా ఆందోళన చెందుతున్నాయి. అయితే, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా భారత్ ప్రశాంతంగా, స్థిరంగా నిలబడటం దేశం యొక్క పటిష్టమైన రక్షణ వ్యవస్థ, సమర్థవంతమైన విదేశాంగ విధానం మరియు బలమైన నాయకత్వానికి నిదర్శనం.

2024 మరియు 2026 మధ్య ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య దశాబ్దాల పరోక్ష యుద్ధం నేరుగా బహిరంగ సంఘర్షణగా మారింది. 2024 ఏప్రిల్ దాడులు, 2025లో తీవ్రమైన మిలిటరీ దాడులుమరియు 2026 ప్రారంభంలో అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ జరిపిన భారీ దాడులు ఇరాన్ అణు వ్యవస్థలనుసైనిక సామర్థ్యాన్ని దెబ్బతీశాయి. ఈ సంఘర్షణ మధ్యప్రాచ్య స్థిరత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

ఇజ్రాయెల్–ఇరాన్ సంఘర్షణ కీలక అంశాలు చూస్తే

నేరుగా దాడులు 2024 నుండి ఇరాన్–ఇజ్రాయెల్ నేరుగా దాడులకు పాల్పడ్డాయి. సిరియాలోని ఇరాన్ కాన్సులేట్‌పై ఇజ్రాయెల్ దాడికి ప్రతిగా ఇరాన్ క్షిపణులను ప్రయోగించగాఇజ్రాయెల్ ఇరాన్‌లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది.

ప్రధాన కారణాలు ఏమిటి అంటే ఇరాన్ అణు కార్యక్రమంఇజ్రాయెల్ ఉనికిని గుర్తించకపోవడంమరియు హమాస్హిజ్బుల్లా వంటి ఇరాన్ మద్దతు ఉన్న గ్రూపుల ద్వారా ఇజ్రాయెల్‌పై దాడులు ఈ సంఘర్షణకు ప్రధాన కారణాలు మనం చూసుకుంటే

2026 పరిణామాలు ఫిబ్రవరి 2026లో అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ జరిపిన దాడులలో ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణించినట్లు ఇరాన్‌లోని కీలక అణు మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ప్రాక్సీ యుద్ధం ఇరాన్ తన మిత్ర దేశాలైన హిజ్బుల్లా లెబనాన్, హమాస్ పాలస్తీనా, ద్వారా ఇజ్రాయెల్‌తో పోరాడుతుంటేఇజ్రాయెల్ ఇరాన్ లోపల దాడులు చేస్తోంది.

అమెరికా పాత్రను చూసుకుంటే ఇజ్రాయెల్‌కు అమెరికా బలమైన మద్దతు ఇస్తోందినిఘా మరియు సైనిక సాంకేతికతను అందజేస్తోంది.

కాల్పుల విరమణ జూన్ 2025లో ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటికీ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్ఇజ్రాయెల్‌ను శత్రువుగా ప్రకటించడంతో ఈ వైరం మొదలైంది. ఇప్పుడు అది పతాక స్థాయికి చేరింది.

రెండు దేశాలు శత్రుత్వానికి పునాదులు చూసుకుంటే

రెండో ప్రపంచ యుద్ధానికి ముందు 1979 వరకు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సత్సంబంధాలు ఉండేవి. కానీ ఇరాన్ లో జరిగిన ఇస్లామిక్ విప్లవం సమీకరణాలను మార్చేసింది. ఇరాన్ లో రాజు మహమ్మద్ రెజాషా పహ్లావీ అమెరికా మద్దతుతో దేశాధినేత పీఠాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నించారు. ఇది సంప్రదాయ ముస్లిం మత పెద్దలకు నచ్చలేదు. షా తన రహస్య పోలీసు దళంతో తనపై వ్యతిరేక స్వరాలను అణచివేసేవారు. దీంతో స్థానికంగా అసంతృప్తి పెరిగింది. దేశంలో చమురు సంపద పెరిగినప్పటికీ, అది సామాన్య ప్రజలకు చేరడం లేదని, కేవలం సంపన్నులకే లాభం చేకూరుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధాని మొసార్దైన అమెరికా తొలగించి షాను గద్దెనెక్కించడంపై ఇరానియన్లలో తీవ్ర వ్యతిరేకత ఉండేది.

భారత్ తన రక్షణ వ్యవస్థను నిరంతరం బలోపేతం చేస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైన్యాన్ని సన్నద్ధం చేస్తోంది. భారత సైన్యం, నౌకాదళం మరియు వైమానిక దళం సమన్వయంతో దేశ సరిహద్దులను కాపాడుతూ, ఎలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి. దేశ భద్రత విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి.

అంతేకాకుండా, భారత్ ఎప్పటినుంచో శాంతి, సహకారం మరియు సమతుల్య విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోంది. ప్రపంచంలోని వివిధ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ యుద్ధాలకు దూరంగా ఉండే విధానాన్ని పాటిస్తోంది. ఇరాన్ మరియు ఇజ్రాయిల్ వంటి దేశాలతో కూడా భారత్ సమతుల్య సంబంధాలను కొనసాగించడం వల్ల దేశ ప్రయోజనాలను కాపాడుకుంటోంది.

దేశానికి బలమైన నాయకత్వం ఉండటం కూడా ఒక ముఖ్యమైన అంశం. సమయోచిత నిర్ణయాలు తీసుకోవడం, దేశ భద్రతను ప్రథమ ప్రాధాన్యంగా భావించడం వల్ల భారత్ అంతర్జాతీయ వేదికపై గౌరవప్రదమైన స్థానం సంపాదించింది. సంక్షోభ సమయంలో ప్రజల్లో ధైర్యం నింపడం, దేశాన్ని సురక్షితంగా ఉంచడం నాయకత్వ లక్షణాలను ప్రతిబింబిస్తుంది.

మొత్తంగా చూస్తే, ప్రపంచంలో ఎక్కడెక్కడో యుద్ధాలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నా, భారత్ ప్రశాంతంగా ఉండటానికి ప్రధాన కారణం పటిష్టమైన రక్షణ వ్యవస్థ, సమతుల్య విదేశాంగ విధానం మరియు బలమైన నాయకత్వం. ఈ విధానాలు దేశాన్ని భద్రంగా ఉంచడమే కాకుండా, ప్రపంచానికి శాంతి మరియు స్థిరత్వానికి ప్రతీకగా నిలబెడుతున్నాయి. భవిష్యత్తులో కూడా భారత్ ఇదే మార్గంలో ముందుకు సాగి, ప్రపంచంలో శాంతి, సహకారానికి మార్గదర్శకంగా నిలవాలని ప్రతి భారతీయుడు ఆశిస్తున్నాడు.

అదే విధంగా ఇరాన్ మరియు ఇజ్రాయిల్ మధ్య యుద్ధం ప్రపంచ శాంతికి ఒక పెద్ద సవాలు. ఈ పరిస్థితి మరింత తీవ్రమవకుండా అంతర్జాతీయ సమాజం శాంతి చర్చలు జరపడం అత్యంత అవసరం.



సొప్పరి నరేందర్
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
9553958648

# ఉర్దూ విద్యను విస్మరించిన విద్యా కమిషన్

తెలంగాణ విద్యా కమిషన్ (ఛైర్మన్: ఆకునూరి మురళి) ఇటీవల సమర్పించిన "తెలంగాణ విద్యా విధానం–2026" నివేదిక రాష్ట్ర విద్యా రంగంలో సమూల మార్పులకు దారితీసే అంశాలను కలిగి ఉంది. నర్సరీ నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఇంగ్లీష్ మీడియం తప్పనిసరి చేయడం, ఒకటో తరగతి నుంచే త్రిభాషా విధానం (తెలుగు/ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ) అమలు, ఎప్‌సెట్ రద్దు, ఉపాధ్యాయుల పదోన్నతులు పనితీరు ఆధారంగా ఇవ్వడం వంటి సిఫార్సులు చర్చనీయాంశాలుగా మారాయి. కానీ ఈ నివేదికలో ఒక ముఖ్యమైన అంశం – ఉర్దూ విద్య – పూర్తిగా విస్మరణకు గురైంది. ఇది రాష్ట్రంలోని మైనారిటీ సమాజం, ముఖ్యంగా ఉర్దూ మాధ్యమ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉంది. తెలంగాణలో ఉర్దూ రాష్ట్ర అధికార భాషల్లో రెండోది. హైదరాబాద్‌తో సహా అనేక జిల్లాల్లో లక్షలాది మంది విద్యార్థులు ఉర్దూ మీడియంలో చదువుతున్నారు. ప్రభుత్వ ఉర్దూ స్కూళ్లు, మాద్రసాలు, గవర్నమెంట్ ఉర్దూ డిగ్రీ కాలేజీలు ఈ సమాజ విద్యా అవసరాలను తీరుస్తున్నాయి. కానీ కమిషన్ నివేదికలో ఉర్దూ మీడియం స్కూళ్ల అభివృద్ధి, ఉర్దూ ఉపాధ్యాయుల నియామకాలు, ఉర్దూ పాఠ్యపుస్తకాల నాణ్యత, మౌలిక సదుపాయాల పెంపు వంటి అంశాలపై ఒక్క మాట కూడా లేదు. ఇంగ్లీష్ మీడియంను బలవంతంగా తీసుకొచ్చే ప్రతిపాదనల మధ్య ఉర్దూ మాధ్యమ విద్యార్థుల భవిష్యత్ అస్పష్టంగా మిగిలిపోయింది.

త్రిభాషా విధానంలో "తెలుగు/ఉర్దూ" అని రాసినా, ఆచరణలో ఉర్దూ ఎంపికగా మాత్రమే ఉండి, దాని మీడియం స్థాయిలో ఎటువంటి బలోపేతం లేకుండా పోతుంది. ఇంగ్లీష్ మీడియం బలవంతం చేయడం వల్ల ఉర్దూ మాతృభాషగా ఉన్న పేద, మధ్య తరగతి ముస్లిం విద్యార్థులు భాషా అడ్డంకులతో ఇబ్బంది పడతారు. ఇది విద్యా అసమానతలను మరింత పెంచుతుంది. ఉర్దూ మీడియం స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లోపం, పాఠ్యాంశాల ఆధునీకరణ లేకపోవడం వంటి సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కానీ కమిషన్ దృష్టి పూర్తిగా ఇంగ్లీష్ మీడియం, పనితీరు ఆధారిత పదోన్నతులు, టెక్నాలజీ ఇంటిగ్రేషన్ వంటి అంశాలపైనే స్థిరపడింది.

ఇది కేవలం విస్మరణ కాదు – ఒక భాషా, సంస్కృతి, సమాజ విద్యా హక్కులను నిర్లక్ష్యం చేయడం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 29, 30 ప్రకారం మైనారిటీలకు తమ భాషలో విద్యా హక్కు ఉంది. ఉర్దూ విద్యా సంస్థలను బలోపేతం చేయకుండా, ఇంగ్లీష్ మీడియంను ఏకైక మార్గంగా చూపడం ఆ హక్కును దెబ్బతీస్తుంది. ఇప్పటికే ఉర్దూ స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతోంది; ఇలాంటి విధానాలతో అది మరింత తీవ్రమవుతుంది.

విద్యా కమిషన్ నివేదికను రూపొందించేముందు మైనారిటీ సంఘాలు, ఉర్దూ ఉపాధ్యాయ సంఘాలు, ఉర్దూ విద్యా సంస్థలతో సమగ్ర చర్చలు జరగలేదు. ఇది ఏకపక్ష నిర్ణయంగా మిగిలిపోయింది. ప్రభుత్వం ఈ నివేదికను అమలు చేసేముందు ఉర్దూ విద్యా అభివృద్ధికి ప్రత్యేక రోడ్‌మ్యాప్ రూపొందించాలి. ఉర్దూ మీడియం స్కూళ్లకు ఆధునిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకాలు, డిజిటల్ ఉర్దూ పాఠ్యాంశాలు, ఇంగ్లీష్ స్కిల్స్ ఇంటిగ్రేషన్ వంటివి చేపట్టాలి.

విద్య అందరికీ సమాన అవకాశం కల్పించాలి – భాషా వివక్ష లేకుండా. ఉర్దూ విద్యను విస్మరించడం అంటే లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును విస్మరించడమే. ప్రభుత్వం ఈ లోపాన్ని సరిదిద్ది, సమగ్ర, సమానత్వ విద్యా విధానాన్ని రూపొందించాలి. అప్పుడే తెలంగాణ విద్యా విధానం నిజంగా "ఇన్‌క్లూసివ్ ఎక్సలెన్స్"గా నిలుస్తుంది.



## శాంతి క్రాంతి కపోతం

ఆది పత్యం
ఆది పత్యం
అగ్ర రాజ్య అది పత్యం
అణు సంపద
ఆయుధ సంపత్తి
అణు వంతా ఉండ కూడదు
తోకాడించాలి
డాలర్ల దాద గిరికి
గంగిరెద్దుల తలలాడించాలి...
ఏ దేశ రక్షణ
ఆ దేశ అస్త్ర శస్త్ర సైనిక పాటవం
తను పచ్చగ బతకాలి
అన్నీ దేశాలను మిత్రులను కొవాలి
రాజ కాంక్ష రాక్ష కాంక్ష
ఆక్రమణ చేయడం
ఆణు భూతం చూపడం
కూటమి దేశాలు చీమలే
నియంత సర్పం
తనకు తాను చావు తెచ్చుకోవడం...
ఆరాచక రాజ్యాలు
సూర్యుడు అస్తమించని రాజ్యం
ప్రపంచ నియంత హిట్లర్
ఎవ్వరైన కానిండు
ప్రజాస్వామ్య వాంఛ ముందు
మొకరిల్లినవే...
ఎన్ని విన్నా మూర్ఖులు
ఎన్ని కన్న మూఢులు
మృత్యువు బాటను ఎన్ను కుంటారు
ఓ పీడకలగా మిగిలి పోతారు
సప్తవర్ణ మిళితమైన స్వచ్ఛమైన నీటిదే
పూల పక్షుల తో కళకళ లాడె తోటదే
మతాభి మానం తో దురాభిమానం లేక
విశ్వకల్యాణ శోభితం తో సాగే విశ్వందే
విజయం శాంతి కపోతనిదే
ఈ ప్రపంచం
ఈ ప్రపంచం

రేడియమ్
9291527757

## నా చిట్టి తల్లి

మానవ మృగమైన.
ఓ... కామాందుడి
కామానికి బలై
బతుకు ఆగమై
ఆకాశ తారలా మిగిలె
నా బిడ్డ
నా కలల కళలు
కన్నీటి పాలేయే
నా హృదయం
ప్రతి ఉదయం
ఉప్పెనే
నా జీవితం బరువై
అడుగులు కదలక
ప్రతి అడుగు
ఓ ప్రశ్నగా మిగిలే
నా హృదయం
ముక్కలై
నా కనులు జడివానై
కురిసి
కడుపు చెరువై
తరుక్కుపోబట్టే
నా ప్రాణం గిలగిల
కొట్టుకోబట్టే
వెన్నెల వాకిట
ముంగిట ముగ్గులో
పసినవ్వులు
పువ్వులై
విరబూస్తుంటే
మసక బారే నాకనులు
నిదురబోయిన
నా తలపుల
అమ్మా అమ్మా అని
పలుమార్లు పిలిచినటుల
ఆ... పిలుపులు
అటుల నా
తల దిండు
తడిసి మడులు
కదుతున్న వైనం
నా జీవితం నాకు
బండగా మారి
క్షణం క్షణం ప్రతి క్షణం
ఎగతాలి అగుచుండే
ఇదేనా సమాజంన.
ఓ... స్త్రీ జీవితం
ఇదేనా
ఓ భరతనారి భవితవ్యం
ఇంతేనా
ఓ.. ఆడ కూతురి
జీవితం
నా హృదయం
రగులుతుంది
నా కన్నీరు రక్త కన్నీరై
ఏరులై పారుతుంది
ఇలాంటి ఘటనలు
ఆగాలి
చరమగీతం పాడాలి
ప్రతి స్త్రీ అపరకాళియై
అడుగులు వేయాలి

రేణుకుంట్ల శ్రీదేవి
- 7386247757
కురవి, మహబూబాబాద్

# ఆచార్య ముదిగంటి సుజాతా రెడ్డి: తెలంగాణ సాహిత్య దీపిక



తెలుగు సాహిత్యంలో తెలంగాణ భావనను మేధోపరంగా, సామాజికంగా బలంగా ప్రతిబింబించిన ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు, పరిశోధకురాలు ఆచార్య ముదిగంటి సుజాతా రెడ్డి. గ్రామీణ తెలంగాణ జీవితాన్ని నేపథ్యంగా చేసుకుని ఆధునిక సమస్యలు, ప్రపంచీకరణ ప్రభావాలు, స్త్రీవాద దృక్పథాలను తన రచనల్లో సమర్థవంతంగా చర్చించిన ఆమె, తెలంగాణ సాహిత్య పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించారు. 1990ల నుండి సృజనాత్మక రంగంలోకి అడుగుపెట్టిన ఆమె రచనలు తెలుగు సాహిత్యంలో తెలంగాణ గొంతును బలపరిచాయి.

ముదిగంటి సుజాతా రెడ్డి జననం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మిట్టా గ్రామంలో జరిగింది. తండ్రి రాంరెడ్డి. ఆమె భర్త ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి (స్వాతంత్ర్య సమరయోధుడు, పత్రికా సంపాదకుడు, రచయిత). గ్రామీణ ఫ్యూడల్ వ్యవస్థలో పుట్టి పెరిగిన ఆమె జీవితం సామాజిక మార్పుల సాక్షిగా నిలిచి ంది. 1970ల్లో హైదరాబాద్‌లోని రెడ్డి కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా వృత్తి ప్రారంభించారు. తరువాత ఉన్నత విద్యా సంస్థ ల్లో బోధన, పరిశోధనలు కొనసాగించారు. సంస్కృతం, ఆంధ్ర భాషల్లో పండితురాలైనప్పటికీ వాడుక భాషలో సహజంగా రాయ డం ఆమె శైలికి ప్రత్యేకత. గ్రామీణ జీవిత అనుభవాలు, రైతాంగ ఉద్యమాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఆమె రచనలకు మూలాలు.

**విద్యార్హతలు:** సంస్కృతి, తెలుగు సాహిత్యంలో ఉన్నత విద్య పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ప్రాచీన కవిత్వం, తెలుగు నవల, సాహిత్య చరిత్రపై పరిశోధనలు చేశారు.

రచనలు: సుజాతా రెడ్డి రచనలు నవలలు, కథలు, విమర్శ, చరిత్ర గ్రంథాలు, ఆత్మకథతో విస్తృతమైనవి.

**ముఖ్య నవలలు:**

1. "మలుపు తిరిగిన రథచక్రాలు" (1994), తెలంగాణ రైతాంగ ఉద్యమం నేపథ్యంగా.
2."సంకెళ్ళు తెగాయి" (1994) సామాజిక మార్పులు, స్త్రీల విముక్తి.
3."ఆకాశంలో విభజన రేఖల్లేవు" (2004) లిబరల్ స్త్రీవాద దృక్పథంతో, ఆధునిక సమస్యలు.

**కథా సంపుటాలు:** 1. "విసుర్రాయి",2. "మింగుతున్న పట్నం", 3. "వ్యాపార మృగం",4 "మరో మార్పు పుట్టాలె", 5."నిత్య కల్లోలం" మొదలైనవి. ఇవి ప్రపంచీకరణ, గ్రామీణ–పట్టణ వ్యత్యాసాలు, సామాజిక అసమానతలను చర్చిస్తాయి.

**విమర్శ గ్రంథాలు:** 1."శ్రీనాథుని కవితా సౌందర్యం",2."మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన" 3."తెలుగు నవలాను శీలనం" (చారిత్రక సామాజిక నేపథ్యంలో)
4."తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర "
5. " తెలుగు సాహిత్య చరిత్ర"

**ఆత్మకథ:** "ముసురు" ఫ్యూడల్ నేపథ్యం నుండి ఆధునిక సమాజంలోకి ప్రయాణం, చారిత్రక సంధి సాక్ష్యంగా ముఖ్యమైనది.

**వృత్తి జీవితం:** తెలుగు భాషా, సాహిత్య బోధన, పరిశోధనల్లో దశాబ్దాలు గడిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఇతర సంస్థల్లో పనిచేశారు. తెలంగాణ భాష, సాహిత్య పునరుద్ధరణలో కృషి చేశారు.

**తెలుగు సాహిత్యంలో ఆమె స్థానం:**

తెలంగాణ సాహిత్యంలో తొలితరం కథకురాలిగా, మహిళా రచయిత్రిగా ప్రసిద్ధి. తెలంగాణ గ్రామీణ జీవన వాస్తవాలను, రైతాంగ సమస్యలను, స్త్రీల స్థితిగతులను, ప్రపంచీకరణ ప్రభావాలను మేధోపరంగా చిత్రీకరించారు. సంస్కృతాంధ్ర పండితత్వం, వాడుక భాషా సామర్థ్యం కలిగి స్వతంత్ర మార్గంలో సాగారు. తెలంగాణ భాషా–సాహిత్య గుర్తింపు పోరాటంలో ఆమె రచనలు, విశ్లేషణలు ముఖ్యమైనవి. స్త్రీవాద, సామాజిక విమర్శలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

పురస్కారాలు, గౌరవాలు:

1. 2016లో తెలంగాణ ప్రభుత్వం నుండి "తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారం" .
2. 2020కు సంబంధించి 2022లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి "విశిష్ట పురస్కారం" .

భర్త పేరిట స్మారక పురస్కారాలు అందజేసే సంప్రదాయం కొనసాగిస్తున్నారు.

చివరిగా...సుజాతా రెడ్డి రచనలు జీవితం, కథ మధ్య తేడా తక్కువే అన్న ఆమె మాటల్లా వాస్తవికత, సామాజిక చైతన్యం కలిగి ఉంటాయి. తెలంగాణ సాహిత్య చరిత్రలో ఆమె పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. గ్రామీణ నేపథ్యం నుండి ఆధునిక దృక్పథాల వరకు విస్తరించిన ఆమె సృజన శక్తి తెలుగు సాహిత్యానికి మార్గదర్శకం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# చేర్యాలలో అక్రమంగా మద్యం సిండికేట్ దందా

- సీసాపై స్టిక్కర్ వేసి అదనంగా బాదుడు
- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయం
- పట్టించుకోని ఆబ్కారీ శాఖ అధికారులు

**చేర్యాల, మార్చి 3 (జనంసాక్షి) :** మద్యం ప్రియులకు చేర్యాల మండలంలో భారీ షాక్ తగులుతుంది. చేర్యాలలోని వైన్స్ షాపుల యజమానులంతా సిండికేట్ గా మారి వారి వ్యాపారాన్ని అడ్డు అదుపు లేకుండా సాగిస్తున్నారు. మొన్నటి వరకు ప్రభుత్వ యంత్రాంగం మున్సిపల్ ఎన్నికల హడావిడిలో ఉంటే చేర్యాల ప్రాంతంలోని లిక్కర్ వ్యాపారులు అంతా కలిసి సిండికేట్ గా మారారు. చేర్యాల మండలంలో దాదాపు 20 గ్రామాలు ఉన్నాయి ఇందులో రెవెన్యూ గ్రామాలు 15 వరకు ఉన్నాయి. మిగతావి చిన్న గ్రామాలు. పెద్ద గ్రామాలలో 10-15 బెల్ట్ షాపులు, చిన్న గ్రామాలలో 5-10 బెల్ట్ షాపులు ఉన్నాయి. గ్రామాల్లో పగలంతా కాయ కష్టం చేసి శ్రమను మర్చిపోవడానికి మద్యాన్ని సేవించే వారికి ఒక్క కోటారు సిసాపై వైన్స్ షాపుల కంటే బెల్టు షాపులలో అదనంగా 40 నుంచి 50 రూపాయలు చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. గత కొద్ది నెలల క్రితం



సిద్దిపేట సిపిగా విజయ్ కుమార్ వచ్చిన వెంటనే ముందుగా మద్యం షాపులకు వార్నింగులు ఇవ్వడం, మద్యం అమ్ముతూ పట్టుబడిన వారికి తగిన శిక్షలు వేయడంతో గ్రామాలలో బెల్ట్ షాపులు మూసివేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఎవరైనా దొరికితే కఠిన శిక్షలు వేయడంతో చాలామంది మద్యం సేవించే వారు జాగ్రత పడటంతో వైన్ షాపులలో గిరాకి మునుపటి కంటే తక్కువగా కావడంతో మద్యం వ్యాపారులంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎప్పుడైతే సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ బదిలీ కావడంతో వెంటనే మద్యం వ్యాపారులందరికీ రెక్కలు వచ్చిన పక్షులాగా సిండికేట్ గా మారడం, మద్యం అమ్మడానికి సిండికేట్ వ్యాపారులంతా గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించే వారికి ప్రభుత్వ యంత్రాంగాన్ని మేము చూసుకుంటాము మద్యం మీరు ఎంతైనా అమ్ముకోండి అన్నట్టుగా సిండికేట్ స్టిక్కర్ వేసి ఇస్తుండడంతో పాత బెల్టు షాపులతోపాటు కొత్తవి పుట్టుకొస్తున్నాయి. మద్యం సీసాలపై స్టిక్కర్ వేస్తూ బెల్ట్ షాపులకు ఒక్క కోటర్ పై 15 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ అమ్మడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నవారు ఒక్కో కోటారు సీసాపై గ్రామాలలో 20నుండి 25 రూపాయలు వసూలు చేస్తున్నారు. వైన్స్ షాపులో కంటే బెల్టు షాపులో ఒక్క కోటారు 40 నుండి 50 రూపాయల అదనంగా చెల్లించి మద్యం కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదంతా ప్రభుత్వ అధికారులు, ఎక్సైజ్ శాఖ అండదండలతోనే సాగుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జిల్లా అధికార యంత్రాంగం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## సురంగల్ మున్సిపాలిటీలో ఉత్సాహంగా హోలీ వేడుకలు




**మొయినాబాద్, మార్చి 3 (జనంసాక్షి) :** సురంగల్ మున్సిపాలిటీ పరిధిలో హోలీ పండుగను చిన్నారులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గ్రామ వీధుల్లో రంగులు చల్లుకుంటూ, ఒకరిపై ఒకరు రంగులు వేసుకుంటూ చిన్నారులు ఉల్లాసంగా ఆడిపాడారు. సాంప్రదాయబద్ధంగా హోలీ పండుగను జరుపుకుంటూ పిల్లలు హ్యాపీ హోలీ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల సందడితో వీధులు కళకళలాడాయి. స్థానికులు కూడా చిన్నారుల ఆనందాన్ని ఆస్వాదిస్తూ పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దల పర్యవేక్షణలో వేడుకలు ప్రశాంతంగా సాగాయి. రంగుల పండుగగా పేరుగాంచిన హోలీ సందర్భంగా సురంగల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

## అంబర్‌పేట్‌లో ఆహార భద్రత తనిఖీలు

- ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



**అంబర్‌పేట్, మార్చి 3 (జనం సాక్షి) :** అంబర్‌పేట్ ప్రాంతంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పరిసరాల్లో ఉన్న తినుబండారాల దుకాణాలు, బేకరీలు, చల్లని పానీయాల విక్రయ కేంద్రాలు, హోటళ్లు తదితర ప్రదేశాలను సందర్శించి ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గడువు ముగిసిన ఉత్పత్తులు, సరైన లేబులింగ్ లేకుండా విక్రయిస్తున్న పదార్థాలు, అనుమానాస్పదంగా నిల్వ ఉంచిన వస్తువులను గుర్తించి సంబంధిత యాజమాన్యాలకు సూచనలు జారీ చేశారు. కొన్ని చోట్ల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించినట్లు తెలిసింది. అదేవిధంగా దుకాణాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని అధికారులు యజమానులకు వివరించారు. నిల్వ విధానం, ఫ్రిజ్ ఉష్ణోగ్రతలు, గడువు తేదీలు స్పష్టంగా ప్రదర్శించడం, సిబ్బంది పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు సురక్షితమైన మరియు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉండేలా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంబర్‌పేట్ ప్రాంతంలో నిర్వహించిన ఈ తనిఖీలతో స్థానిక వ్యాపారుల్లో అప్రమత్తత పెరిగింది. ప్రజలు కూడా ఆహార పదార్థాలు కొనుగోలు చేసే ముందు గడువు తేదీలు, నాణ్యత అంశాలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు.

## నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కలెక్టర్లు కృషి చేయాలి



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 3 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" అమలుపై హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జిల్లాల కలెక్టర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలి. గ్రామ సభల్లో సంక్షేమ పథకాల వారీగా ప్రభుత్వం చేకూరుస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలి. ప్రజా ప్రభుత్వంలో అందిస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధి దారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. విద్యా వ్యవస్థలో ప్రజా ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేసేందుకు సమీపంలోని మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేయాలి. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిచేలా చర్యలు తీసుకోవాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపులు కచ్చితంగా అందేలా చర్యలు చేపట్టాలి. 99 డేస్ ప్రోగ్రాం లో గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని సూచించారు.

# చిల్కానగర్ మోడల్ గ్రేవ్‌యార్డ్ పనులు వేగవంతం చేయాలి

- నిర్లక్ష్య కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**ఉప్పల్, మార్చి 3 (జనం సాక్షి) :** చిల్కానగర్ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న మోడల్ గ్రేవ్‌యార్డ్ పనులు అనవసరంగా ఆలస్యం అవుతున్న నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అధికారులను కోరారు. ఆయన ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి ఈ విషయంపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్కానగర్ మోడల్ గ్రేవ్‌యార్డ్ నిర్మాణానికి సుమారు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు ప్రారంభించి దాదాపు సంవత్సరం నర కాలం గడిచినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఒప్పంద నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ గణనీయమైన ఆలస్యం జరుగుతోందన్నారు. ఇప్పటికే బాగా చెల్లింపులు తీసుకున్న కాంట్రాక్టర్ పనులను నిర్లక్ష్యంగా సాగదీస్తున్నారని విమర్శించారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సరైన స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల పనుల్లో ఈ విధమైన నిర్లక్ష్యం అసహ్యకరమని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మోడల్ గ్రేవ్‌యార్డ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే కాంట్రాక్టర్‌ను నల్లజాబితాలో చేర్చి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, సమయపాలన తప్పనిసరి అని స్పష్టం చేశారు. జోనల్ కమిషనర్ రాధిక గుప్తా స్పందిస్తూ సమస్యను గంభీరంగా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి పనులు వేగవంతం చేయిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే కాంట్రాక్టర్‌పై తగిన శాసన చర్యలు కూడా చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, డివిజన్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఎల్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం..

- మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ఎంబీబీఎస్ చెక్కుల పంపిణీ

**ఉప్పల్, మార్చి 3 (జనంసాక్షి) :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులను ఎం బి బి ఎస్ చదివించడం అభినందనీయమని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హరీష్ రావు నివాసం లో 7 గురు ఎంబీబీఎస్ విద్యార్థులకు ఎంబీబీఎస్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ దీ= చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు చెక్కులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే మొత్తం 122 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఇది కేవలం దానంగా కాకుండా, భవిష్యత్ ఆరోగ్య వ్యవస్థలో పెట్టుబడిగా భావించాల్సిన అంశమని ఆయన తెలిపారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చే ప్రతిభావంతమైన యువతను ప్రోత్సహిస్తూ, విద్య ద్వారా సాధికారత కల్పించడమే ఈ



కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దూరదృష్టి నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల స్థాపనతో "వైట్ కోట్ విప్లవం" సాకారమైందని, దీని ద్వారా వైద్య విద్య అవకాశాలు విస్తరించి, ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం అయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి ,ప్రభుదాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్ , మహేష్ గౌడ్, వంజ రీ ప్రవీణ్ కరిపే పిల్లి నాగరాజు, బోసాని పవన్ కుమార్ ,దయాకర్ రెడ్డి, శ్రవణ్, రఘువరన్, నాని, రాజేష్ గౌడ్, కడిగే శేఖర్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోహెడలో హోళి సంబరాలు

**కోహెడ, మార్చి 3 (జనంసాక్షి) :** మండల కేంద్రంతో పాటు, అన్ని గ్రామాలలో మంగళవారం హోళి పండుగ ను పురస్కరించుకొని చిన్న పిల్లలనుండి పెద్దల వరకు అందరు సంబరంగా రంగులు చల్లుకొని హోళి పండుగను జరుపుకున్నారు. మండల కేంద్రంలో యువత, ఆటో యూనియన్ మిత్రులు కలిసి హోళి పండుగను జరుపుకున్నారు. వివిధ రకాల రంగుల మాదిరిగానే అందరి జీవితం రంగులమయం కావాలని, జీవితం లో అభివృద్ధి లోకి రావాలని ఆకాంక్షించారు. కోహెడ లో కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, రామాలయం వీది, షేర్ బజార్, ఇలా అన్ని వాడలలో ఎంతో సంబరంగా పండుగ ను జరుపుకున్నారు.



# దత్తాత్రేయ స్వామి కరుణా కటాక్షాలతో సర్వం సుభిక్షంగా ఉండాలి

- అన్ని దానాల కన్నా అన్న సమర్పణ గొప్పది
- సహజ సిద్ధ రంగులతో హోలీ పండుగ జరుపుకోవాలి
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్

**తాండూరు, మార్చి 3 (జనంసాక్షి) :** దత్తాత్రేయ స్వామి కరుణా కటాక్షాలతో సర్వంసుభిక్షంగా ఉండాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం హోళీ పౌర్ణమి సందర్భంగా ఘన్ గాపూర్ లోని త్రివేణి సంగమంలో (ఎల్ ,ఎఫ్ ,ఎల్ హెచ్ ,ఎం కోకట్ ప్రధానోపాధ్యాయురాలు వర్త్యకిష్టమ్మ విఠల్ నాయక్)దంపతులు నది స్నానం ఆచరించి శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదమంత్రో చ్ఛారణల తో ఆశీర్వదించి మరేన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని మనసారా ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేస్తూ ఘనంగా సన్మానించారు. హోళీ పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు వర్త్య విఠల్ నాయక్ దంపతులు కలిసి అన్నసమర్పణ నిర్వహించారు .ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ పౌర్ణమిరోజు చేసిన పూజలు, దానధర్మాలు, జన్మజన్మల పాపాలు తొలగిపోతాయన్నారు. అన్నసమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అన్ని దానాలకన్నా అన్నసమర్పణ గొప్పదన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చు కోవాలని సూచించారు. ప్రతి నెల పౌర్ణమి రోజు శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకో వడం



జరుగుతుందని వెల్లడించారు. సహజ సిద్ధ రంగులతో హోలీ పండుగ జరుపుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ పూజారులు రాజు , భక్తులు, తదితరులు ఉన్నారు.

# నార్సింగిలో అక్రమ నిర్మాణాలపై జాగృతి ధర్నా

- ఖమ్మం పేదలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్

**రాజేంద్రనగర్, మార్చి 3 (జనం సాక్షి) :** నార్సింగి వద్ద మూసీ నదిని ఆనుకుని శ్రీ ఆదిత్య కన్స్ట్రక్షన్స్ నిర్మాణాలను కూల్చాలని డిమాండ్ చేస్తూ జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, చట్టాలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఖమ్మంలో భూదాన్ భూముల్లో పట్టాలు పొంది, సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకున్న 600 మంది పేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేశారని ఆమె ఆరోపించారు. అదే సమయంలో హైదర్షాకోట్ డివిజన్‌లో మూసీకి 30 మీటర్ల దూరంలో 20 ఏళ్ల క్రితం హెచ్‌ఎండిఏ అనుమతులతో నిర్మించుకున్న మధు



అపార్ట్‌మెంట్‌ను అక్రమమని చెబుతుంటే, నార్సింగిలో మూసీ నదిలోనే నిర్మాణం ఎలా సక్రమమవుతుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రజలకు స్పష్టీకరించాలని డిమాండ్ చేశారు. ఈ భవనానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు నెలలు పనులు నిలిపివేసి, తర్వాత మళ్లీ ప్రారంభించారని ఆరోపించారు. హైడ్రా సంస్థలో పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం జరుగుతోందా అని ప్రశ్నించారు. ఖమ్మం బాధితులకు ఇళ్లు కేటాయించాలని, మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసులకు ఎస్‌ఎఫ్‌టికి రూ.17 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాదులో హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ధర్నా సందర్భంగా భవనం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన జాగృతి నాయకులు, కార్యకర్తలు పోలీసుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. "మూసీ నదిని కాపాడుకుందాం - తెలంగాణ వనరులను పరిరక్షించుకుందాం" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. హైడ్రా కమిషనర్ సంఘటన స్థలానికి వచ్చే వరకు అక్కడే నిరసన కొనసాగిస్తామని కవిత స్పష్టం చేయగా, రంగులోకి దిగిన పోలీసులు అదుపులోనికి తీసుకొని తరలించారు.

## గుర్లపల్లి రోడ్లుకు మహర్దశ

- 3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**మక్తల్, మార్చి 3 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీ 7వ వార్డు గుర్లపల్లి రోడ్డు లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు, వార్డు కౌన్సిలర్ శ్రీవిద్య గౌడ్ కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో సుమారు 3 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండటంతో స్థానిక ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మానస హనుమంతు, వార్డు కౌన్సిలర్ శ్రీవిద్య నీల గౌడ్, ఏఈ నాగ శివ, వర్క్ ఇన్స్పెక్టర్ సత్యం గౌడ్, మాజీ కోపషన్స్ సభ్యులు శంషుద్దీన్, సీనియరు కాంగ్రెస్ నాయకులు మందుల నరేందర్, కట్ట వెంకటేష్, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
04 మార్చి 2026

# నిమ్జ్‌లో హద్దు రాళ్ల ఏర్పాటుకు అధికారుల కసరత్తు

- అడ్డుకున్న భూ నిర్వాసితులు
- భూ సేకరణ చట్టం ప్రకారం ఆదుకుంటే
- పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తాం
- ఆర్డీఓతో అధికారులు, భూ నిర్వాసితుల చర్చల
- అనంతరం వాయిదాపడ్డ సర్వే
- మరో రెండు రోజుల్లో సర్వే చేసి హద్దు రాళ్ళను ఏర్పాటు చేస్తామన్న అధికారులు



**న్యాల్‌కల్, మార్చి 3 (జనం సాక్షి) :** జాతీయ పెట్టుబడులు ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టులో పలు పరిశ్రమల ఏర్పాటుకు ఈ పాటికే సేకరించిన భూముల్లో సర్వే చేపట్టి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలన్న స్థానిక అధికారుల కార్యాచరణాన్ని భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. సేకరించిన భూముల్లో సర్వే చేసి, హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలనీ కలెక్టర్ ప్రావిణ్య ఆదేశం మేరకు మంగళవారం న్యాల్ కల్ మండల తహసిల్దార్ ప్రభులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, రూరల్ పరిధిలోని ఎస్సైలు, పలువురు పోలీస్ సిబ్బంది, సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ప్రత్యేక పోలీసు బృందం రక్షణలో.. మండలంలోని ముంగి గిరిజన తండాలో ఈ పాటికే సేకరించిన భూముల్లో సర్వే చేపట్టి హద్దు రాళ్ళను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అధికారులు, ప్రాజెక్టు నిర్వాహకులు పోలీస్ భద్రతతో ఉదయాన్నే చేరుకొని కార్యాచరణ పట్టేందుకు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక భూ నిర్వాసితులు అధిక సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. అధికారులు, ప్రాజెక్టు నిర్వాహకులకు సమస్యలతో ప్రశ్నల వర్షం కురిపించారు. ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయనీయమని, హద్దులు వేసే ప్రసక్తే లేదని దాదాపు మూడు గంటలకు పైగా అడ్డుకున్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పట్ల భూ నిర్వాసితులు అసహనం వ్యక్తం చేశారు. ఈపాటికే ముంగి, రుక్మాపూర్, చీలపల్లి తండాలతో పాటు ఎల్గోయి గ్రామ శివారులో గల సర్వే నంబర్ 60లో 3000 ఎకరాల్లో సర్వే చేపట్టి హద్దురాళ్ళను ఏర్పాటు చేసేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు విడతల వారీగా కసరత్తును ప్రారంభించారు.

### పరిశ్రమల ఏర్పాటుకు మేము వ్యతిరేకం కాదు

ప్రజారోగ్యం, మూగజీవాలు, వాతావరణ కాలుష్యం, పాడి, పంటలకు నష్టం కలిగించని పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణంగా సహకరిస్తామని.. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు ఆదుకోవాలని భూనిర్వాసితులు అధికారుల యంత్రాంగానికి డిమాండ్ చేశారు. ప్రతి భూ నిర్వాసితుడికి ఎకరానికి రూ:15 లక్షలు, ఎకరానికి 120 గజాల ఇండ్ల స్థలం, అర్హతను బట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇండ్ల స్థలాలు, ఇండ్లను కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పించాలని, ప్రస్తుతం సర్వే నెంబర్ 60 కోర్టు పరిధిలో ఉన్నందున.. అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా తాండకు వచ్చి సర్వే, హద్దులు వేయడం ఎంత మాత్రం సరికాదని భూనిర్వాసితులు వాపోయారు.

### ఆర్డీఓతో చర్చల అనంతరం తాత్కాలికంగా వాయిదా..

పలువురు భూనిర్వాసితులు, అధికారులు జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి దేవుజాతో చరవాణిలో భూ నిర్వాసితులు తమ గోడును విన్నవించుకున్నారు. హోలీ పండుగ సందర్భంగా రెండు రోజుల అవకాశం ఇవ్వాలని, నేరుగా కార్యాలయానికి వచ్చి విన్నవిస్తామని భూ నిర్వాసితులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ భూ నిర్వాసితులు నేరుగా సమస్యలను వివరించాలని కోరారు.

## అక్రమ ఇసుక రవాణా పై పోలీసుల ఉక్కుపాదం

- టిప్పర్ 5 ట్రాక్టర్ల స్వాధీనం
- 6గురి అరెస్ట్
- ఎస్సై నవీద్



**కృష్ణ, మార్చి 3 (జనం సాక్షి) :** కృష్ణ మండలంలో అక్రమ ఇసుక రవాణా పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. అక్రమ ఇసుక రవాణాపై కట్టడి చర్యలలో భాగంగా, కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుడెబల్లూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో మంగళవారం టాస్క్ ఫోర్స్ సిబ్బంది,కృష్ణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఒక టిప్పర్, 5 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన 6 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని వారిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్ తెలిపారు.జిల్లాలో అక్రమ ఇసుక రవాణా, నిల్వలు మరియు అమ్మకాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్న అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నవిద్ హెచ్చరించారు.

## రియల్ ఎస్టేట్ మాఫియా నుండి దేవాలయ భూములను రక్షించండి

- గ్రామస్థులు మంత్రి కొండా సురేఖకు వినతి



**తూప్రాన్, మార్చి 3 (జనం సాక్షి) :** దేవాలయ భూములు కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ దేవాదాశాఖను ఆదేశించినట్లు ఆమెను కలిసిన గ్రామస్తులతో తెలిపారు. దేవాలయ భూములు చేసిన వారిని వదలమని ఆమె చెప్పారు. అక్రమాలకు అంతులేకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా దేవాదాయ శాఖ భూములను కూడా కబ్జాలకు చేసి వెంచర్లు చేసుకుంటున్నారు.ఇదంతా చూస్తున్న అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ అధికారులు కూడా నోరు మెదపడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మెదక్ జిల్లా మనోహరబాద్ మండల కేంద్రంలో దేవదాయా శాఖ కు సంబంధించిన 3 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని బారి ఎత్తున వెంచర్ కొందరు ఏర్పాటు చేస్తున్నారు.విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని అధిగించనిన అధికార పార్టీ నేతలు ప్రభుత్వ అధికారుల అండదండలతో ఎవ్వరూ ఏం చేయలేరు అనే ధోరణిలో చెలరేగిపోతున్నారు.ఈ విషయంపై గ్రామానికి చెందిన విద్యార్థి న్యాయవాది చెలిమెల మనివర్ధన్ గ్రామస్తులతో కలిసి మంగళవారం నాడు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు వినతి పత్రం అందజేశారు.

### వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అదేశాలు

దేవాదాయ భూములు కబ్జా చేసి వెంచర్ చేస్తున్న వీరిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అధికారులు అదేశాలు జారి చేసినట్టు వారు తెలిపారు.అక్రమార్కుల విషయం లో ప్రభుత్వం ఎప్పటికీ కటినంగా ఉంటుందని ఆమె అన్నారు.

## తరచూ భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు



**సంగారెడ్డి, మార్చి 3 (జనం సాక్షి) :** బీరంగూడలోని శంభు లింగేశ్వర దేవస్థానం స్థల విషయంలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేనప్పటికిని తరచుగా.. ఫిర్యాదు చేస్తూ పలు కబ్జాలకు పాల్పడి రూ: వందల కోట్ల ఆస్తులను ఆక్రమణం చేసుకున్న శ్రీనివాస్, భాస్కర్ రెడ్డిలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంగళవారం ఉదయం బీరంగూడ గ్రామానికి చెందిన పలువురు స్థానికత తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ కబ్జా చేసిన వ్యాపార భవనాన్ని కూల్చివేయాలని, శంబిని కుంటలో కబ్జా చేసి ఇండ్ల నిర్మాణం చేపట్టిన భాస్కర్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిగా నిర్మించిన భవనాలను వెంటనే కూల్చివేయాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీరంగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

# జడ్చర్ల ఘటన నాయకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

- మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, మార్చి 3 (జనంసాక్షి) :** జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం అత్యంత అమానవీయమని, ఇది పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ, నూతనంగా నిర్మించిన మార్చురీ భవనాన్ని, వంద పడకల ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. సోమవారం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో జరిగిన ఘటన ఘోరమని, ఒక దళిత సోదరుని మృతదేహానికి కనీస గౌరవం ఇవ్వకుండా స్ట్రెచర్ మీద కూడా పెట్టకుండా నేలపై పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహం రెండు చేతులను కుక్కలు పీక్కుతింటున్నా పట్టించుకోని పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని, మార్చురీలో ఫ్రీజర్లు లేకపోవడం, ఉన్న వసతులను వాడుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర మంతటా ప్రభుత్వ ఆసుపత్రులను గాలికి వదిలేశారని, మందులు, వసతులు లేక పేద ప్రజలు అల్లాడి పోతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కొత్త ఆసుపత్రిలో మార్చురీ భవనం 2024 జూన్ నాటికే పూర్తయిందని, ఆ భవనాన్ని అప్పగించి 6 నెలలు గడుస్తున్నా ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేదని ప్రశ్నించారు. కేవలం అధికారుల మీద చర్యలు తీసుకొని ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదని, మార్చురీని ఎందుకు మార్చలేదు, పాత దాంట్లో ఉన్న ఫ్రీజర్లు ఏమయ్యాయి అనే విషయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పుకుంటోంది కానీ, ఇది నిజానికి ప్రజలను నాశనం చేసే పాలన అని ఎద్దేవా చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇన్‌చార్జ్‌గా ఉన్న జిల్లాలోనే ఇలాంటి దుస్థితి ఉండటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రులను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కానీ ఈ ప్రభుత్వం వచ్చాక పాలనను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. వంద రోజుల్లో వంద పడకల ఆసుపత్రిలో అన్ని వసతులు కల్పిస్తామని చెప్పిన స్థానిక నాయకులు, ఇప్పుడు సమస్యలను చెబితే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంద పడకల ఆసుపత్రికి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే జీఎంను కలిసిన మెదక్ ఎంపీ

- అభివృద్ధి పనులపై విస్తృత చర్చ



**రామచంద్రపురం, మార్చి 3 (జనం సాక్షి) :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి పనులపై చర్చించారు. తెల్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఆర్‌యుబి పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందేలా ఎంఎంటిఎస్ సేవలను విస్తరించాలని వినతిపత్రం సమర్పించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంఎంటిఎస్ సేవలు సక్రమంగా అందడం లేదని, గతంతో పోలిస్తే సగానికి పైగా రైళ్లను రద్దు చేశారని తెలిపారు. రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. తెల్లాపూర్ - ఈదుల నాగులపల్లి, తెల్లాపూర్--ఇక్రిసాట్ మార్గాల్లో ఎంఎంటిఎస్ విస్తరణతో పాటు రైళ్ల సంఖ్య పెంచాలని కోరారు. ఈదుల నాగులపల్లిలో రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేస్తే ప్రాంతీయ అభివృద్ధికి దోహదం అవుతుందని పేర్కొన్నారు. తెల్లాపూర్ ఎంఐజి ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి డీపీఆర్ త్వరగా సిద్ధం చేయాలని సూచించారు. మెదక్ అసెంబ్లీ పరిధిలోని అక్కన్నపేట స్టేషన్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని కోరారు. సిద్దిపేట జిల్లాలో చిన్నకోడూరు రైల్వే స్టేషన్ పనులను త్వరగా ప్రారంభించాలని, పూర్తయిన కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

## బైరంపల్లి గుట్టలపై అక్రమ బ్లాస్టింగ్ కలకలం

- క్రషర్ వద్ద ఆందోళన, పోలీసులకు ఫిర్యాదు

**మిడ్జిల్, మార్చి 3 (జనం సాక్షి) :** బైరంపల్లి గ్రామ పరిసరాల్లో అక్రమంగా గుట్టలను బ్లాస్టింగ్ చేస్తూ కంకర వ్యాపారం సాగిస్తున్న ఘటన మిడ్జిల్ మండలంలో కలకలం రేపింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన పేలుళ్లతో చేదుఘాట్ తండా, బైరంపల్లి గ్రామాల్లో ఇళ్లలో ఉన్న గిన్నెలు కిందపడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆగ్రహించిన గ్రామస్తులు వెంటనే క్రషర్ వద్దకు చేరుకోగా అక్కడ ఎవరూ లేకపోవడంతో పాటు పేలుడు పదార్థాలు అక్కడే ఉంచినట్లు గుర్తించారు. దీనికి నిరసనగా మంగళవారం ఉదయం ఏఎస్ఆర్ క్రషర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాల తాళాలు స్వాధీనం చేసుకుని, ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు మాట్లాడుతూ, విషయం పై ఫిర్యాదు అందిందని, ఘటనపై విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్లాస్టింగ్ వల్ల పంటపొలాలకు నష్టం, ధూళి కాలుష్యం, రహదారుల ధ్వంసం జరుగుతోందని గ్రామస్తులు వాపోయారు. అక్రమ తవ్వకాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు తో పాటు జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్. సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



# విద్యా కమిషన్‌లోని అసంబద్ధ సిఫారసులను తొలగించాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా టీచర్స్ జేఏసీ డిమాండ్



**నాగర్‌కర్నూల్, మార్చి 3 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలోని టీచర్స్ జేఏసీ, తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన విధాన పత్రంలో ఉన్న అసంబద్ధ సిఫారసులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించిన ఆకునూరి మురళి ఆధ్వర్యంలో రూపొందించిన ప్రతిపాదనల్లో కొన్ని అంశాలు ప్రభుత్వ విధానానికి ఉపయోగకరంగా ఉన్నప్పటికీ, అనేక సూచనలు ఆచరణ సాధ్యం కానివిగా ఉన్నాయని తీవ్రంగా ఆక్షేపించారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ చైర్మన్ డి. సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కమిషన్ ప్రతిపాదించిన విధానాలపై విస్తృతంగా చర్చించారు.

### ప్రధాన అభ్యంతరాలు

మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఒక్క మండలంలో 3 లేదా 4 పాఠశాలలే ఉండాలనే ప్రతిపాదన గ్రామీణ విద్యార్థులకు విద్యను దూరం చేసే చర్యగా అభిప్రాయపడ్డారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని 45శాతం నుంచి 75శాతం కు పెంచే ప్రతిపాదన విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచి, డ్రాప్‌అవుట్‌లు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయ శిక్షణకు సంబంధించిన కొన్ని సూచనలు జాతీయస్థాయి చీˆఱశీఎˆశ్రీ జశీబఅ఼ఎఅశ్రీ టశీతీ ఎఙఎష్ట్రవతీ జుఎబఎషˆఱశీఅ (ఎన్‌సిటిఈ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వివిధ ప్రవేశ పరీక్షలను రద్దు చేయడం కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు ఊతమిచ్చే చర్యగా అభివర్ణించారు. ఒకే క్యాంపస్‌లో 1500 మందికి పైగా విద్యార్థులతో పాఠశాలలు నిర్వహించడం ఆచరణ సాధ్యం కాదన్నారు. ఉపాధ్యాయులను ఐదు సంవత్సరాల కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించి, ఆ తర్వాత పనితీరు ఆధారంగా కొనసాగింపు ఇవ్వాలనే ప్రతిపాదన అన్యాయమని విమర్శించారు. ఉపాధ్యాయుల వేతనాలు అధికమని తగ్గించాలని సూచించడం అసహేతుకమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయాలనే ప్రతిపాదన తీవ్ర అన్యాయం అవుతుందని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. విద్యా కమిషన్‌లోని పలు సిఫారసులు విద్యారంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ, అసంబద్ధ సిఫారసులను తొలగించి తెలంగాణ ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా విధానాలను పునర్విమర్శించాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు డాక్టర్ శ్రీధర్ శర్మ, బి.ఇ. విజయ్ కుమార్, బి. రాజారెడ్డి, గుడిపల్లి నిరంజన్, లక్ష్మణ్ నాయక్, సిహెచ్ వెంకట్, పచ్చిపాల సుబ్బయ్య, కూరాకుల ఆంజనేయులు, టి. రమేష్, కొంగరి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన




**నర్సాపూర్, మార్చి 3 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణంలో మంగళవారం ప్రపంచ వన్య ప్రాణి దినోత్సవం సందర్భంగా రేంజ్ అటవీ శాఖ సిబ్బంది నర్సాపూర్ ఫారెస్ట్ అర్బన్ పార్క్ లో పాఠశాల విద్యార్థులతో కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు అడవి పర్యావరణ సమతౌల్యంలో వన్యప్రాణుల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే హర్బల్ గార్డెన్‌లో ఔషధ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దివ్య డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధిరామ్ సింగ్ ఎఫ్ఎస్ఓ సాయిరామ్ ఎఫ్ఎస్ఓ కరీముద్దిన్ ఎఫ్‌బిఓ గోపాల్ ఎఫ్ఎస్ఓ శ్రీధర్ ,ఎఫ్ఎస్ఓ రాజమణి, రేంజ్ సిబ్బంది అర్బన్ పార్క్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను కాపాడుదాం.. భవిష్యత్తును రక్షిద్దాం




**గూడూరు, మార్చి3 (జనంసాక్షి):** అంతరించి పోతున్న అడవి జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహనా పెంచేందుకే ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామని ఎఫ్ఆర్ఓ సురేష్, డి ఆర్ ఓ లు మాధవి,శ్రీనివాసన్ అన్నారు.ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గూడూరు మండల కేంద్రంలో అటవీ శాఖ అధికారులు ఎంపీడీఓ కార్యాలయం,ఎమ్మార్వో కార్యాలయం నుండి పారెస్ట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ అంతరించిపోతున్న జంతువులు,మొక్కలపైన అవగాహన పెంచడానికి, వాటిని రక్షించడానికి మార్చి మూడున్న ప్రత్యేక కార్యక్రమంగా నిర్వహిస్తారని తెలిపారు.భూమి లెక్కలేనాన్ని జీవ జాతులకు నిలయమని, మనం పీల్చే గాలి,తినే ఆహారం,మనం ఉపయోగించే శక్తి వంటి అనేక ఇతర ప్రయోజనాల కోసం మొక్కలపై, జంతువులపై ఆధారపడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వెంకటేశ్వర్లు, కవిత, మహేందర్, మోహన్, బాలాజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- 6 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 3 (జనంసాక్షి) :** కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తెప్పల సమ్మిరెడ్డికి చెందిన ఇల్లు పూర్తిగా కాలి బూడిదైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఉదయం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో తెప్పల సమ్మిరెడ్డికి చెందిన ఇంట్లో రెండు కుటుంబాలు అద్దెకు ఉంటున్నారు . దూరికె శారదా (భర్త పోచన్న), అంజలి (భర్త సమ్మయ్య) అనే ఇద్దరు మహిళలు అద్దెకు ఉంటున్నారు. అద్దెకు ఉంటున్న వాళ్ళు కూలికి పనికి వెళ్లిన సమయంలో షార్ట్ సర్క్యూడితో ఇల్లుకు మంటలు అంటుకున్నాయి .అగ్నిప్రమాదంలో ఇళ్లలోని గృహోపకరణాలతో పాటు సుమారు రూ.1,00,000 నగదు, అరకిలో వెండి చెవి కమ్మలు (సుమారు 10 తులాలు), అలాగే 10 ముఖ్యమైన సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం.ఇంటి యజమాని తెప్పల సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ప్రాథమిక విచారణ ప్రకారం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దహనమై ఉంటుందని ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు .

## అనుమానస్పదంగా యువకుడి మృతి

- సూరారం గ్రామంలో విషాద ఛాయలు



**మహదేవపూర్, మార్చి 3 (జనంసాక్షి) :** అనుమానాస్పదంగా యువకుడి మృతి చెందిన సంఘటన సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులకు కుటుంబ సభ్యులుతెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ జిల్లా భూపాలపల్లి మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన పోలం రామకృష్ణ 21 వయస్సు అదివారం సాయంత్రం ఇంటి నుండి బయలుదేరి కాటారం వెళుతున్న క్రమంలో కాటారం ఊరి చివర సబ్ స్టేషన్ సమీపంలో నీటి గుంతల పడిశవమై తేలినట్టు తెలిపారు. మృతుడి తండ్రి పోలం రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

## ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ, ప్రతినిధి మార్చి3 (జనం సాక్షి) :** ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భం గా మంత్రి కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేసి, జిల్లాలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులు సమాజంపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలి



**హనుమకొండ ప్రతినిధి మార్చి 3 (జనం సాక్షి) :** హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ సమ్మయ్యనగర్ ప్రాంతంలో విస్తృత సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రజలతో అనుసంధానం పెంపొందించడం, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావం బలపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అంజన్ రావు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలోని వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని సూచించారు. యువత సమాజ సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహను పెంపొందిస్తాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగం అధికారిని డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ, స్థానిక ప్రజలతో చర్చలు నిర్వహించారు.

# రైతులకు అందని బోనస్ డబ్బులు

- రైతు ఎదురుచూపులు
- మారిన ఐఎఫ్ఎస్ఈ కోడ్
- ఇబ్బందుల్లో రైతులు





**కాటారం, మార్చి 3 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన రైతులకు ఇప్పటివరకు బోనస్ అందలేదు. రైతులు పండించిన పంటలను మధ్య దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరధాన్యాన్ని ఖరీఫ్, రబి సీజన్లో కొనుగోలు చేస్తుంది. ఈ కొనుగోలు కేంద్రాల్లో పంటలను అమ్ముకున్న రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తూ సన్న వారి పంటలను సాగు చేసిన రైతులకు 500 రూపాయల బోనస్ డబ్బులను చెల్లిస్తుంది. అధికారుల నిర్లక్ష్య వైఖరి మూలంగా ప్రభుత్వం ఆశించిన బోనస్ డబ్బులు అందకపోవడంతో సన్నాలను సాగుచేసిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తి వివరాలకు వెళితే తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో అకౌంట్ కలిగి ఉన్న రైతులకు ఖరీఫ్ సీజన్ సంబంధించిన ధాన్యం డబ్బులు అందినప్పటికీ బోనస్ డబ్బులు నాలుగు నెలలు గడిచిన అందడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం సన్నవరి పంటను వేసి ఆరు కాలాలపాడు కష్టపడితే ఆశించిన మేర దిగుబడి రాక నష్టల్లో కురుకుక్కపోయామని రైతుల పేర్కొంటున్నారు. వాణిజ్య బ్యాంకుల్లో అకౌంట్ కలిగిన రైతులకు బోనస్ వచ్చినట్లు, కేవలం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో అకౌంట్ కలిగిన రైతులకు బోనస్ డబ్బులు పడలేదని మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రైతులు ఆంధ్రప్రభ దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ వికాస్ గ్రామీణ బ్యాంక్,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లు మెర్జింగ్ కావడంతో ఐఎఫ్సి ఈ కోడు మారడం దృష్ట్యా రైతు ఖాతాల్లో డబ్బులు పడలేదని సమాచారం ఉన్నప్పటికీ అధికారులు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాలు కలిగిన రైతులకు బోనస్ డబ్బులు అందే విధంగా చూడాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

### నెలలు గడుస్తున్న బోనస్ డబ్బులు అందలేదు



ఖరీఫ్ సీజన్లో సన్న రకం పంటలు వేసి ఆశించిన మేర అత్రివృష్టి వర్షాల వల్ల తగినంత దిగుబడి రాలేదని పండిన కొద్దిపాటి పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్మినప్పటికీ ధాన్యం డబ్బులే వచ్చాయని ప్రభుత్వం ప్రకటించిన 500 బోనస్ డబ్బులు తమకు అందలేదని వాపోయారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్నందుకే బోనస్ డబ్బులు అందలేదని వాపోయారు.

**- చీరల తిరుపతి, గంగారం గ్రామ రైతు**

## ఎన్నికల కోడ్ ముగిసినా... 'ఇందిరమ్మ'కు విముక్తి లేదా?

- నిర్మల్‌లో విగ్రహాలపై ముసుగులు తొలగింపుపై అధికారుల నిర్లక్ష్యం



**నిర్మల్ బ్యూరో, మార్చి03 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ, ఇందిరమ్మ మున్సిపల్ దుకాణాల సముదాయంలో ఉన్న జాతీయ నాయకులు, విగ్రహాలపై వేసిన ముసుగులు ఇంకా తొలగించకపోవడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో అధికారులు జాగ్రత్త చర్యగా విగ్రహాలకు ముసుగులు తొడిగారు. అయితే గత నెల ఫిబ్రవరి 16తో ఎన్నికల కోడ్ ముగిసినా, ఇప్పటివరకు వాటిని తొలగించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పండుగగా భావించే ఎన్నికలు ముగిసిపోయినా, ప్రజా ప్రాతినిధ్యానికి ప్రతీకలైన జాతీయ నాయకుల విగ్రహాలు ఇంకా ముసుగుల్లోనే ఉండటం స్థానికుల్లో ఆవేదన కలిగిస్తోంది. "ఇందిరమ్మ రాజ్యం" అని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న ఈ తరుణంలో, అదే పేరుతో ఉన్న ప్రాంగణంలో విగ్రహాలపై ముసుగులు కొనసాగడం ప్రజలలో విమర్శలకు దారితీస్తోంది. ప్రతి రోజు ఆ ప్రాంతం గుండా వెళ్లే వ్యాపారులు, స్థానికులు, ప్రయాణికులు విగ్రహాన్నీ చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రజల భావోద్వేగాలకు విలువ లేకపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో చురుకుగా వ్యవహరించిన యంత్రాంగం, ఎన్నికల అనంతరం మాత్రం మొద్దు నిద్రలోకి జారుకుపోయిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రతిరోజూ మున్సిపల్ అధికారులు దుకాణాల అద్దె వసూలుకు వస్తారు కానీ ఇందిరమ్మ ముసుగు కనపడడం లేదా అని విమర్శిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి విగ్రహాలపై ఉన్న ముసుగులను తొలగించాలని, ప్రజల గౌరవానికి భంగం కలగకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



## పొంచి ఉన్న ప్రమాదం...

- స్పందించాలి అధికార గణం...

**బెల్లంపల్లి, మార్చ్ 3 (జనంసాక్షి) :** పొంచి ఉంది ప్రమాదం, స్పందించాలి అధికార గణం అని ప్రజలు కోరుతున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ వెళ్లే రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారి వెంట నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, రాత్రి వేళలో కోతకు గురైన రోడ్డు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ప్రమాదాలు జరుగకముందే స్పందించి రహదారికి మరమ్మత్తులు చేయించాలని జెండా వెంకటాపూర్ ప్రజలు కోరుతున్నారు.

## ఈత చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి





**బెల్లంపల్లి, మార్చ్ 3, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల కేంద్రంలో తమ జీవనాదారం అయిన ఈత చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం నెన్నెల మండల కేంద్ర గౌడ జన హక్కుల సంక్షేమ సంఘం నాయకులు చెన్నూర్ అబ్కారీ సీఐకి వినతిపత్రాన్ని అందజేశారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన కీసరి రాజేశం అనే వ్యక్తి అక్రమంగా ఈత చెట్లను నరికి మా జీవనాదారం అయిన గీత వృత్తిపై కత్తి కట్టాడని ఆరోపించారు. దీనికి అబ్కారీ సీఐ సానుకూలంగా స్పందించి అక్రమంగా ఈత చెట్లను నరికిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో గౌడ జన హక్కుల సంక్షేమ సంఘం నాయకులు గడ్డం సాంబమూర్తి గౌడ్, పెంటా గౌడ్, సునీల్ గౌడ్, శంకర్ గౌడ్, స్వామి గౌడ్, చంద్రమౌళి గౌడ్, నాగేశ్వర్ గౌడ్, చంద్ర గౌడ్, అంజన్న గౌడ్, వెంకన్న గౌడ్, ఉషన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి ఆటో డ్రైవర్ మృతి



**హనుమకొండ ప్రతినిధి మార్చి 3 (జనం సాక్షి) :** కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన భోయిని తిరుపతి ఆటో నడుపుతూ జీవిస్తుండేవాడు. ఆదివారం రోజున మధ్యాహ్నం ఆటో యూనియన్ సభ్యులతో కలిసి నడి కూడ మండలం కంఠాత్మకూర్ సమ్మక్క సారక్క గద్దెల వద్దకు ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఎందుకు హాజరు కావడం జరిగింది . తిరిగి తిరుపతి తన యొక్క ఏపీ 15 డబ్ల్యూ 2410 నెంబర్ గల ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా కౌకొండ గ్రామ శివారులోని గుట్టల వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడి తీవ్ర గాయాలతో మృతి చెందినాడు. మృతుని తల్లి బోయిని జానకి ఫిర్యాదు మేరకు దామెర ఎస్ఐ కొంక అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అడవులను రక్షించాలి

- వన్యప్రాణులను కాపాడుకోవాలి
- ఫారెస్ట్ అధికారుల బైక్ ర్యాలీ



**ఏటూరు నాగారం, మార్చి 03 (జనం సాక్షి) :** ఏటూరు నాగారం మండల కేంద్రంల వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో ఫారెస్ట్ ఆఫీసు నుంచి ఏటూరు నాగారం బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రహమాన్, మాట్లాడుతూ మార్చి 3 ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవ సందర్భంగా అడవులను రక్షిస్తూ అడివిలో ఉండే వన్యప్రాణులను కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉన్నదని అలాగే అడివిలో పెరిగే ఔషధ మొక్కలను ప్రకృతి ప్రసాదించిన ఔషధ మొక్కలు మానవులకు వరమని వాటిని మనం ఇప్పటికీ కాపాడుకుంటూ అడవిలో నిప్పు వన్యప్రాణుల వేట అడవుల నరికివేత లాంటి అసంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుని రాబోయే తరానికి అడవులు వన్యప్రాణులు ఔషధ మొక్కలు వారికి మనం అందించే విధంగా బాధ్యత తీసుకోవాలని ఈ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రహమాన్, అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## కాల్వపల్లి ఆదివాసీలపై అటవీ శాఖ దౌర్జన్యాలు ఆపాలి

- అటవీశాఖ అధికారులకు గిరిజనుల మధ్య పోడు భూముల వివాదం
- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్





**ఏటూరునాగారం-తాడ్వాయి, మార్చి 3(జనంసాక్షి) :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామ పరిధిలో తరతరాలుగా పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు సాగిస్తున్న అరాచకాలను బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు మరియు ప్రభుత్వానికి మంత్రి సీతక్కకు విన్నపం చేస్తూ కాల్వపల్లి ఆదివాసీల జోలికి రావద్దని కాల్వపల్లి గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లోకి అటవీ శాఖ అధికారులు చొరబడి వారిని భయభ్రాంతులకు గురి చేయడం అత్యంత దుర్మార్గం తక్షణమే ఈ దాడులు నిలిపివేయాలి. లేనిపక్షంలో బాధితుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది. మంత్రి సీతక్క ఇలాకాలో ఈ అన్యాయమా? స్వయంగా గిరిజన బిడ్డగా, ఆదివాసీల కష్టాలు తెలిసిన మంత్రి సీతక్క సొంత జిల్లాలోనే ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే అడవి బిడ్డలపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత బాధాకరం. గిరిజనుల ఓట్లతో గెలిచి వారి హక్కులను కాపాడలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం, హక్కులు కాలరాయడం తగదు అని అన్నారు. ఎన్నికల ముందు పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అటవీ శాఖ అధికారులను ఉసిగొల్పి దాడులు చేయించడం ఆదివాసీలను వంచించడమే, కాల్వపల్లి గిరిజనులకు వారి భూములపై ఉన్న సాగు హక్కును ప్రభుత్వం గుర్తించాలని వారికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఆదివాసీల కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని అధికారుల దౌర్జన్యాలు ఇలాగే కొనసాగితే బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని, భూమి ఆదివాసీలది - హక్కు కాల్వపల్లి బిడ్డలది, అధికారులు తక్షణమే తమ వైఖరి మార్చుకుని, గిరిజనులకు ఆందోళన కలిగించకుండా వారి భూములు వారికి సాగు చేసుకునే అవకాశం కల్పించాలని లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.

# గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

- **టిపిసిసి అధికార ప్రతినిధి, అన్నపర్తి జ్ఞాన సుందర్**

**తుంగతుర్తి, మార్చి 3 (జనం సాక్షి) :** గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని టిపిసిసి అధికార ప్రతినిధి అన్నపర్తి జ్ఞాన సుందర్ అన్నారు, ఆదివారం హైదరాబాదులో తెలంగాణ ప్రదేశ్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామీణ వైద్యుల పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించి మాట్లాడారు, స్వర్గీయ మాజి ముఖ్య మంత్రి రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం గతంలో జివో నంబర్ 1274 విడుదల చేసి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇచ్చుటకు నిర్ణయించారని అన్నారు, అంతేకాక



104,108 అంబులెన్సు సిబ్బందికి కూడా ప్రాక్టికల్స్ పూర్తి చేయించారని వారికి కూడా శిక్షణ పూర్తి అయిన అనంతరం పరీక్షలు నిర్వహించి. కమ్యూటి. పారా మెడికల్ సర్టిఫికెట్స్ ఇస్తామన్నారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం వల్ల శిక్షణ ఆగిపోయింది అన్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఎన్నికల మానిఫెస్టోలో పెట్టినారని అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామీణ వైద్యులు కాంగ్రెస్ పార్టీ ని బలపరిచారని అన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామీణ వైద్యులకు పరీక్షలు నిర్వహించి కమ్యూనిటీ పారా మెడికల్ సర్టిఫికెట్స్ ఇప్పిఃచాలని కోరారు, ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుల నుండి సానుకూలంగా స్పందన వచ్చిందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు. జెరిపోతుల లక్మణ్ గౌడ్ డాంగే. రాజేందర్ తదతరులు పాల్గొన్నారు

## రాయల్ రిడ్జ్ సంస్థలో డిప్యూటీ డైరెక్టర్‌గా దినేశ్ మిరియాల నియామకం



**మధిర, మార్చి 3 (జనంసాక్షి) :** ప్రఖ్యాత సామాజిక సేవా నాయకుడు, ఏపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్యవైశ్యా చైర్మన్‌గా సేవలందిస్తున్న కుప్పం ప్రసాద్ మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమైన ప్రకటన చేశారు.ఆయన ఆధ్వర్యంలో ప్రముఖ సంస్థ రాయల్ రిడ్జ్ లో డిప్యూటీ డైరెక్టర్‌గా దినేశ్ మిరియాలని అధికారికంగా నియమించినట్లు వెల్లడించారు.సంస్థ విస్తరణ, వ్యాపార అభివృద్ధి భవిష్యత్ వ్యూహాత్మక ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో తెలిపారు. నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం, సంస్థాభివృద్ధిపై ఉన్న నిబద్ధతను పరిగణలోకి తీసుకుని ఈ బాధ్యతలను దినేశ్ మిరియాలకి అప్పగించినట్లు పేర్కొన్నారు.డిప్యూటీ డైరెక్టర్‌గా ఆయన సంస్థ పరిపాలన, వ్యూహాత్మక నిర్ణయాలు, వ్యాపార విస్తరణ, కొత్త ప్రాజెక్టుల అమలులో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు,సభ్యులు అభినందనలు తెలియజేశారు.ఈ నియామకం రాయల్ రిడ్జ్ సంస్థ భవిష్యత్ అభివృద్ధి దిశలో ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

## వంకమామిడిలో సుజాత హార్డ్‌వేర్ షాప్ దగ్ధం

- **రూ.6 లక్షల నష్టం**



**భూదాన్ పోచంపల్లి, మార్చి 3 (జనం సాక్షి) :** మండల పరిధిలోని వంకమామిడి గ్రామంలో ఉన్న సుజాత హార్డ్‌వేర్ షాప్ మంగళవారం ఉదయం అగ్నికి ఆహుతైంది. షాప్ యజమాని కె. దామోదర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, షాప్ బంద్ ఉన్న సమయంలో ఉదయం సుమారు 10.30 గంటలకు షాప్ నుంచి పొగలు రావడం స్థానికులు గమనించారు. వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అవి వేగంగా వ్యాపించాయి. మంటలు తీవ్రరూపం దాల్చడంతో షాప్ పూర్తిగా దగ్ధమైంది. షాప్‌లో ఉన్న ఎలక్ట్రికల్ సామానులు, ఇంజనీరింగ్ కరెంట్ మోటార్లు, హార్డ్‌వేర్, సానిటరీ సామాన్లు, ఐరన్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ. 6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## పులిమామిడి యువకుడికి డాక్టరేట్ ప్రదానం

**హాలియా, మార్చి 3 (జనం సాక్షి) :** పులిమామిడి గ్రామానికి చెందిన చినపాక కరుణాకర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. భూగర్భ శాస్త్రంలో నిర్వహించిన పరిశోధనకు గాను ఈ గౌరవం లభించింది. కరుణాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఖమ్మం, సమీప ప్రాంతాలలోని నెఫిలైన్ శిలల నిర్మాణం, ఉద్భవం, రసాయన లక్షణాలపై సమగ్ర పరిశోధన చేపట్టారు. ఆయా ప్రాంతాల శిలల స్వరూపం, ఏర్పాటుకు కారణమైన భౌగోళిక పరిస్థితులను విశ్లేషిస్తూ రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం పరిశీలించి డాక్టరేట్‌ను ప్రకటించింది. చినపాక కృష్ణయ్య, రేణుక దంపతుల రెండవ కుమారుడైన కరుణాకర్ సాధారణ కుటుంబానికి చెందినవారు. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి చూపుతూ కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించారు. పదో తరగతి వరకు పులిమామిడి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన ఆయన, అనంతరం నల్లగొండలోని ప్రభుత్వ కళాశాలల్లో మధ్యంతర, డిగ్రీ విద్య పూర్తి చేశారు. రెండువేల పదిహేనులో భూగర్భ శాస్త్రంలో పీజీ పూర్తి చేసి, తరువాతి సంవత్సరం పరిశోధన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారు. తదుపరి జాతీయ స్థాయి పరీక్షల్లోనూ ప్రతిభ కనబరచి అర్హత పొందారు. రెండువేల పదెనిమిదిలో



పరిశోధనలో ప్రవేశించి క్రమంగా తన పరిశోధనను పూర్తి చేశారు. రెండువేల పందొమ్మిదిలో రాష్ట్ర అర్హత పరీక్షలో, రెండువేల ఇరవై ఒక్కటిలో జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. కరుణాకర్ డాక్టరేట్ సాధించిన సందర్భంగా ప్రొఫెసర్లు, పరిశోధకులు, గ్రామస్తులు, మిత్రులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తన పరిశోధన పూర్తి చేయడంలో సహకరించిన గురువు ప్రొఫెసర్ ఎం. శ్రీనివాస్‌తో పాటు ఇతర అధ్యాపకులు, తల్లిదండ్రులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను కాపాడండి మహా ప్రభూ..!

- **ఆవాసాల మధ్య ఉన్న పాత బావిని పూడ్చాలి**



**నాంపల్లి, మార్చి 3 (జనం సాక్షి) :** నాంపల్లి మండల పరిధిలో గల పస్నూర్ గ్రామపంచాయతీలో పాత గ్రామపంచాయితీ భవన సమీపంలో గల పాడుపడిన వ్యవసాయ బావి చాలా ప్రమాదకరంగా మారింది.ఇండ్ల మధ్యలో పాత బావి ఉండడం వలన వందల కొద్ది పాములు ఇండ్లలోకి వస్తునాయి,ఇండ్లలో చిన్న పిల్లలు ఉండడం. ప్రక్కనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉండడం వలన ఈ కాలనీలోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు, చనిపోయిన మూగజీవాలను కూడా ఆ బావిలో వేయడం ద్వారా భరించలేని, దుర్వాసన వస్తుంది. వాంతులు విరోచనాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.గ్రామపంచాయతీ పాలకవర్గం కానీ,అధికారులు కానీ తక్షణమే ఈ సమస్యని పరిష్కరించి ప్రజల ఆరోగ్యాలను,ప్రాణాలను కాపాడాలి అని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కారేపల్లిలో అగ్నిప్రమాదం

- **పూరిల్లు దగ్ధం**



**కారేపల్లి, మార్చి 3 (జనంసాక్షి) :** అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన కారేపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. కారేపల్లి ఇమ్మడిబజార్‌లోని రెడ్డిబోయిన వీరయ్యకు కుటుంబం చేనుపనులకు వెళ్ళిన సమయంలో పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ఇంటి నుండి ఒకసారే మంటలు వ్యాపించటంతో చుట్టుపక్కల వారు స్పందించి గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను తెచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ లోపు ఇల్లందు నుండి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేసింది. ఈ ప్రమాదంలో గ హెూపకరణాలు పూర్తి ధ్వంసమైనాయి. సంఘటన స్థలాన్ని సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ) సందర్శించిన బాధితునిక ప్రభుత్వం ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## రంజాన్ ప్యాకేజ్ పంపిణీకి ఈద్గా కమిటీ ఏర్పాట్లు

**దేవరకొండ, మార్చి 3 (జనం సాక్షి) :** దేవరకొండ ఈద్గా ఽ మక్కా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పురస్కరించుకొని ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రంజాన్ ప్యాకేజ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈద్గా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ అజీమోద్దీన్, ఎండి ఇలియాస్ పటేల్ లు పేర్కొన్నారు. మంగళవారం వారు ఓ ప్రకటనలో మాట్లాడుతూ రంజాన్ పండుగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాలనుండి రంజాన్



ప్యాకేజి పంపిణి చేస్తున్నామని, ప్రతి సంవత్సరం వితంతువులకు, వికలాంగులకు, అర్హులైన వారికోసం రంజాన్ ప్యాకేజ్ అందిస్తున్నామన్నారు ఈ ఒక్కో ప్యాకేజీ విలువ 1400 రూపాయలు ఉంటుందని, ఇందులో 16 రకాల పండుగ సామాగ్రి ఉంటుందని నగర వ్యాప్తంగా దాదాపు 500 కుటుంబాలకు ఈ ప్యాకేజీ అందిస్తామన్నారు. నగరంలో ఈ యొక్క ప్యాకేజీకి జకాత్ రూపంలో పలువురు ఆర్థికంగా సహకరిస్తున్నారని వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు. ఈ నెల 15 లేదా 16 న స్థానిక మక్కా మస్జీద్ లో ప్యాకేజీ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో గౌరవ అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, అబ్దుల్ ఖదీర్, యండి ఖుద్రతుల్లా, ఖాజా మైనోద్దీన్, షబ్బీర్, సయ్యద్ దస్తగిర్, యండి సలీమ్, ఎండి షకీల్, ఎస్ కె బురాన్, యండి ముజీబ్, మహ్మద్ అఫ్రోజ్, జాఫర్ ఖాన్, ఇల్యాస్ బాబా, యండి ఖైసర్, షఫీ ఉల్లా, ఇస్మాయిల్ అజ్మత్, జాకిర్, తదితరులు ఉన్నారు.

## హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల బ్యూరో, మార్చి 3 (జనం సాక్షి) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పోలీస్ అధికారులు సిబ్బంది తో ఉత్సహంగా, సంతోషంగా హోలీ వేడుకలు నిర్వహించడం జరిగింది. హోలీ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ రంగుల పండుగ హోలీ అందరికీ సంతోషం కలగాలని, మీ జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని, వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. జగిత్యాల పట్టణ ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐల్నేని వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ సంబరాల కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా తొలి జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రతీక హోలీ అని, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసే వేడుక,ఈ రంగుల పండుగ హోలీ, ప్రజల జీవితాలను సప్తవర్ణ శోభితం చేయాలని ఆకాంక్షిస్తూ జగిత్యాల జిల్లా మరియు నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## చెరువులో పడి గురుకుల విద్యార్థి గల్లంతు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 3 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో చదువును కొనసాగిస్తున్న రాజు అనే విద్యార్థి ఫరూక్ నగర్ మండలం రాయికల్ శివారులో ఉన్న చెరువులోకి ఈత కొట్టడానికి వెళ్లి గల్లంతయ్యాడు గద్వాల జిల్లా ఐజ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజు షాద్ నగర్ పరిధిలోని నేషనల్ హైవే పక్కనే ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల వసతి గృహంలో చదువును కొనసాగిస్తున్నాడు మంగళవారం నాడు హోలీ సందర్భంగా సెలవు ఉండడంతో నలుగురు విద్యార్థులతో కలిసి చెరువులో ఈత కొట్టడానికి వెళ్లిన రాజు తిరిగి బయటకు రాలేదు దీంతో పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టారు.

## అడవుల రక్షణ ప్రజల భాగస్వామ్యంతో సాధ్యం

- **కారేపల్లిలో వన్యప్రాణి దినోత్సవం**

**కారేపల్లి, మార్చి 3 (జనంసాక్షి) :** మానవ మనుగడకు చెట్లు, అడవుల రక్షణ ఎంతో అవసరమని వాటి సంరక్షణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని కారేపల్లి రేంజ్ అధికారి అన్నారు. మంగళవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా కారేపల్లి రేంజ్ కార్యాలయంలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారి మాట్లాడుతూ ఆరోగ్యం, వారసత్వం, జీవనోపాధిని సంరక్షించటం అనే నినాదంతో వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యవరణ సమతూల్యత కాపాడటంలో, మానవ జీవనానికి మద్దతు ఇవ్వటంలో వన్యప్రాణుల పాత్ర ఎంతో ఉందన్నారు. వన్య ప్రాణుల సంరక్షణలో ప్రజలు స్వచ్ఛంధంగా భాగస్వాములు కావాలని కోరారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించి, మెరుగైన భవిష్యత్తు కోసం ప్రక తిని, వన్యప్రాణులకు రక్షించుకుందాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఎఫఆర్వో



పీ.ఏపాప్రోడిటస్, డీఆర్వో అయేషా కుదూసియా, ఎఫఎస్వో లు డీ.చక్రవరి, పీ.కిషోర్‌కుమార్, ఎఫ్‌బీవో లు ఉష, వీరన్న ,పద్మ ,సైదా, గాంధీ, పుష్పలత, నాగరాజు, సిద్ధారావు బాపయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా నిధులతో గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు



**మధిర, మార్చి 3 (జనంసాక్షి) :** మాజీ కేంద్ర మంత్రివర్యులు రేణుక చౌదరి ఎంపీ (ఆర్ఎస్) నిధులతో అతి తక్కువ విద్యుత్‌తో అధునాతన ాజుణ దీపాల ఏర్పాటు దిగ్విజయంగా జరుగుతోంది. ఈ నిధుల సాధనలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జవ్వాజి ఆనంద రావు చూపిన చొరవ పట్టుదల అమోఘం. తొలి విడతలో భాగంగా మధిర మండలం,ఇల్లూరు గ్రామంలో సుమారు 100 వీధి దీపాలను ఏర్పాటు చేశారు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ముస్లిం కాలనీ నుండి వ్రీణూ బి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్పంచ్ శ చేకూరి ఆదిలక్ష్మి అధ్యక్షతన ముఖ్య అతిథిగా ఎం.పి.ఓ. టి.వి.ఎల్.ఎన్. శాస్త్రి విచ్చేసిూజుణ దీపాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్, సెక్రటరీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ముస్లిం కాలనీ నివాసితులు ఇల్లూరు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం నిధులను మంజూరు చేసినందుకు వారందరూ కలిసి రేణుక చౌదరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు మాతృ వియోగం

**తలకొండపల్లి, మార్చి 3 (జనంసాక్షి) :** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ గుర్క జైపాల్ యాదవ్ కు మాతృ వియోగం కలిగింది.వృద్ధాప్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమె కడ్తాల్ మండలం స్వగ్రామం చల్లంపల్లి లోని స్వగృహంలో నివాసంలో ఉంటున్నారు.ఆయన తల్లి మంగమ్మ (93) మంగళవారం ఉదయం మరణించారు.మంగళవారం మధ్యాహ్నం చల్లంపల్లి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. మంగమ్మ మృతికి మాజీ సీఎం కేసీఆర్,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం ప్రకటించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని కెసిఆర్,కేటీఆర్ ప్రార్థించారు.కన్నతల్లి మరణంతో శోకతప్తులైన జైపాల్ యాదవ్,కు వారి కుటుంబ సభ్యులకు ఓదార్పునిస్తూ మాజీ సీఎం కేసీఆర్,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్,పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్,ఏఎంసీ చైర్మన్ యాట గీత నరసింహా,ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్,మాజీ జెడ్పిటిసిలు దశరథ్ నాయక్,విజితా రెడ్డి,మాజీ ఎంపీపీ లు సివిల్ శ్రీనివాస్ యాదవ్,నిర్మల శ్రీశైలం గౌడ్,ఆమనగల్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి,కడ్తాల్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పరమేష్, ఆమనగల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్జున్ రావు,తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుమ్మరి శంకర్,వివిధ గ్రామాల



సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు.




# రూ.3.12 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు

## 10 లక్షలకు పైగా ఉద్యోగాలు: హైసియా

హైదరాబాద్: 'హైదరాబాద్ కేవలం టెక్నాలజీ సేవలు అందించే స్థాయి నుంచి, ప్రపంచస్థాయి ఆవిష్కరణలు సృష్టించే కేంద్రంగా (గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్) మారుతోంది. జీసీసీల ఏర్పాటులోనూ నగరం ఎంతో కీలకంగా ఉంటోంది' అని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) వెల్లడించింది. ఇక్కడి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3.12 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. 10 లక్షలకు మించి ఉద్యోగులు ఐటీ రంగంలో సేవలు అందిస్తున్నారని వివరించింది. అంకురాలు, ఇతర చిన్న సంస్థల్లోని సిబ్బందినీ కలిపితే, ఇంకా ఎక్కువగానే ఉంటారని వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం, ఎస్‌టీపీఐ భాగస్వామ్యంతో హైసియా 33వ వార్షిక సదస్సును ఈ నెల 5న నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నందెళ్ల సోమవారం తెలిపారు. 'ఇంటెలిజెన్స్ ఎవ్రీవేర్: లీడింగ్ ది న్యూ ఎరా ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్' ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ ఐటీ ప్రస్థానాన్ని వివరించే 'మేకింగ్ ఐటీ హ్యాపెన్' టేబుల్ బుక్, 'స్కేల్ అట్ హైదరాబాద్' నివేదికలనూ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఐటీ కంపెనీలు, స్టార్టప్‌లకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. అంకురాల అవార్డుల కోసం 294 దరఖాస్తులు రాగా, తుది జాబితా కోసం 40 సంస్థలను ఎంపిక చేశామని.. 10 సంస్థలకు అవార్డులు ఇస్తామని హైసియా ఉపాధ్యక్షుడు బిపిన్ పెండ్యాల వివరించారు. ఎంపికైన వాటిలో 36% స్టార్టప్‌లు సిరీస్ ఏ, బీ రౌండ్ల ద్వారా నిధులు సమీకరించాయని పేర్కొన్నారు. 12% స్టార్టప్‌లు ఏటా రూ.9 కోట్ల వార్షిక ఆదాయాన్ని మించినట్లు తెలిపారు. ఈ సదస్సులో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కృష్ణ ఎల్ల, అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు సుబ్బారావు పావులూరి సహా పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ప్రసంగించనున్నట్లు తెలిపారు.




# మండుతున్న ముడి చమురు

- బ్యారెల్ 77 డాలర్లకు చేరువ
- డాలర్ రూ.91.49
- రూ.6.59 లక్షల కోట్ల సంపద ఆవిరి
- ఎఫ్ఐఐ విక్రయాలు రూ.3,229.65 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు రూ.7,940.53 కోట్లు



న్యూఢిల్లీ:పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమై, ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడంతో మదుపర్ల సెంటిమెంటు తీవ్రంగా దెబ్బతింది. దీంతో అమ్మకాలకు దిగారు. ఫలితంగా మన సూచీలు భారీగా నష్టపోయాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 41 పైసలు నష్టపోయి 91.49 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 6% పెరిగి 77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టపోగా, షాంఘై సూచీ లాభపడింది. దక్షిణ కొరియా మార్కెట్లు పని చేయలేదు. ఐరోపా మార్కెట్లూ ప్రతికూలంగా కదలాడాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.59 లక్షల కోట్లు తగ్గి, రూ.456.90 లక్షల కోట్ల (5 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 2743.46 పాయింట్ల భారీ నష్టంతో, 78,543.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,287.19) ప్రతికూలంగా ప్రారంభమైంది. సూచీకి ఇదే కనిష్ఠ స్థాయి కూడా. 80,632.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, రోజంతా నష్టాల్లోనే కొనసాగి చివరకు 1048.34 పాయింట్లు కోల్పోయి 80,238.85 పాయింట్ల వద్ద ముగిసింది. తక్కువ విలువల వద్ద కొనుగోళ్లు రావడం వల్లే, నష్టాలు తగ్గాయి. నిఫ్టీ 50 సైతం 312.95 పాయింట్లు నష్టపోయి 24,865.70 పాయింట్ల వద్ద స్థిరపడింది.

# జీఎస్‌టీ నిబంధనలు పాటించాం

## బెట్టింగ్‌లను ప్రోత్సహించలేదు
## ఫినో పేమెంట్స్ బ్యాంక్ వెల్లడి

**న్యూఢిల్లీ:**వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఎగవేత, బెట్టింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం వంటి ఆరోపణలను ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఖండించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రిషి గుప్తాను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అరెస్టు చేసిన నేపథ్యంలో బ్యాంక్ స్పందిస్తూ, తాము నిబంధనలన్నింటినీ పాటిస్తున్నామని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ద్వారా వచ్చిన అక్రమ నిధులను మళ్లించడానికి షెల్ కంపెనీలు, పేమెంట్ అగ్రిగేటర్ల వినియోగంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇది కేవలం వివిధ బ్యాంకులతో సంబంధం ఉన్న ప్రోగ్రామ్ మేనేజర్ల వ్యవహారాలపైనే జరుగుతోందని, జీఎస్‌టీ నిబంధనలను బ్యాంక్ పాటించలేదనడంతో దీనికి సంబంధం లేదని ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో వెల్లడించింది. సంబంధిత ప్రోగ్రామ్ మేనేజర్ల వ్యాపారాలు, చర్యలతో తమకు, తమ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది.

Fino
Fino Payments Bank

# ఎస్కార్ట్స్ కుబోటా కొత్త 'సౌత్ స్పెషల్'

**పవర్ ట్రాక్ బ్రాండ్ కింద వరి సాగు • ప్రత్యేకంగా రూపొందించిన మొట్టమొదటి 'శౌర్య' శ్రేణి**




**ఫరీదాబాద్(జనంసాక్షి):** వ్యవసాయ యంత్రాలు, నిర్మాణ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థ అయిన ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్, పవర్ ట్రాక్ శౌర్య పేరుతో కొత్త 'సౌత్ స్పెషల్' వరి ట్రాక్టర్ సిరీస్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ సిరీస్‌లో 39 హెచ్‌పి నుండి 52 హెచ్‌పీ విభాగాలలో ఐదు వేర్వేరు రకాలను అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలలోని వరి సాగు ప్రాంతాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొట్టమొదటి వరి, మాగాణి ప్రత్యేక సిరీస్ ఇది. పవర్ ట్రాక్ బ్రాండ్ ద్వారా ఈ రకమైన ప్రత్యేక శ్రేణిని పరిచయం చేయడం ఇదే తొలిసారి. దీని ద్వారా కీలకమైన వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో కంపెనీ తన ఉనికిని మరింత బలోపేతం చేసుకుంటోంది.భారతదేశంలో ఎస్కార్ట్స్ కుబోటా సంస్థ.. కుబోటా, ఫామ్‌ట్రాక్, పవర్‌ట్రాక్ అనే మూడు బ్రాండ్‌ల పేరుతో ట్రాక్టర్లను విక్రయిస్తోంది. ఇవి వరుసగా ప్రీమియం, ఎంట్రీ-ప్రీమియం, వాల్యూ విభాగాల అవసరాలను తీరుస్తున్నాయి. వీటిలో పవర్‌ట్రాక్ బ్రాండ్ అనేది తక్కువ ఖర్చుతో కూడిన వాల్యూ, మాస్ సెగ్మెంట్ విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ బ్రాండ్ కింద వివిధ రకాల వ్యవసాయ పనులకు ఉపయోగపడే ట్రాక్టర్లను కంపెనీ అందిస్తోంది. వరి సాగు అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ శౌర్య సిరీస్ ట్రాక్టర్లు బురద, నీరు నిలిచిన మాగాణి పొలాల్లో ఎంతో సమర్థవంతంగా పనిచేస్తాయి. వీటిలోని కీలక భాగాలకు క్యాసెట్ రకం సీలింగ్ ఉండటం వల్ల పని సమయంలో నీరు లేదా బురద లోపలికి వెళ్లకుండా రక్షణ ఉంటుంది. కేవలం 3.1 మీటర్ల తక్కువ టర్నింగ్ రేడియస్ కారణంగా వీటిని చిన్న, మధ్య తరహా పొలాల్లో కూడా సులభంగా తిప్పవచ్చు. సాంకేతిక పరంగా చూస్తే ఇందులో 8 ఫార్వర్డ్, 2 రివర్స్ గేర్లతో కూడిన ఫుల్లీ కాన్స్టెంట్.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

## బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,54,650 (22 క్యారెట్లు) | ₹ 1,70,020 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 3,15,000

# యుద్ధం తీవ్రమైతే రూపాయి విలవిలే..

## అక్కడ యుద్ధం.. ఇక్కడ నష్టం

- ఒక్కో కంటైనర్ రవాణాపై 2000-4000 డాలర్లు అదనం - పొద్దుతిరుగుడు పువ్వు నూనెపైనా ప్రభావం
- బిస్కట్లు, డిటర్జంట్లు, టూత్‌పేస్టులు, సబ్బులు, షాంపూలపైనా మోతే..
- చమురు బ్యారెల్ ధర డాలరు పెరిగితే, దిగుమతి బిల్లుపై ఏడాదికి రూ.13000 కోట్ల భారం
- మధ్యప్రాచ్య ప్రయాణాలు ఆపిన టీసీఎస్, విప్రో



**న్యూఢిల్లీ:**అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేస్తోంటే.. ప్రతిగా ఇరాన్ సైతం అమెరికా స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలోనే చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి (ఇరాన్ పక్కనే ఉంటుంది)లో రవాణాకు ఆటంకాలు ఏర్పడటం వల్ల, మనతో సహా ప్రపంచ దేశాలపైనా ప్రభావం పడకతప్పదు. చమురు ధర పెరుగుతుండటంతో, దానితో సంబంధం ఉన్న ఎరువులకు ఉపయోగించే ముడిపదార్థాలతో పాటు రోజువారీ వినియోగించే బిస్కట్లు, తలనూనె, వంటింట్లో వాడే పొద్దుతిరుగుడు పువ్వు నూనె, సబ్బు, షాంపూల ధరలపై ప్రభావం పడుతుంది. అంటే అక్కడెక్కడో జరుగుతున్న యుద్ధం కాస్తా.. మన ఇళ్లలో ధరల అలజడికి కారణం కానుంది.మనదేశ ముడి చమురు అవసరాల్లో 88% దిగుమతులే తీరుస్తున్నాయి. బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్ 80 డాలర్లకు చేరువైంది. హార్ముజ్ జలసంధిలో రవాణా ఆగడం ఇందుకు కారణం. దీంతో మన చమురు దిగుమతి బిల్లుపై భారీ ఒత్తిడి పడనుంది. రోజువారీ వినియోగించే కొన్ని ఉత్పత్తుల ధరలపై ప్రభావం పడనుంది. ఉద్రిక్తతలు వారానికి మించితే, ఆ ప్రభావం కొన్ని ఉత్పత్తుల ధరలపై పడొచ్చని పార్లే ప్రోడక్ట్స్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుతానికి వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలిపారు. మారికో, డాబర్ ఈ అంశంపై వ్యాఖ్యానించలేదు.

**ఎరువులకు ఇబ్బంది తప్పదా!**

జూన్‌లో ఖరీఫ్ సీజను ప్రారంభం కావడానికి ముందు డీఏపీ, ఎస్ఎస్‌పీ ఎరువుల తయారీలో కీలకమైన సల్ఫర్, సల్ఫ్యూరిక్ యాసిడ్ సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.భారత సల్ఫర్ దిగుమతుల్లో ఖతార్, యూఏఈ, ఒమన్‌కు 76% వాటా ఉంది.

**వంటనూనె.. మసులుతుందా?**

16 మిలియన్ టన్నుల వంట నూనె దిగుమతుల్లో పొద్దుతిరుగుడు పువ్వు నూనె వాటా 20%. రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా నుంచి ఈ దిగుమతులు ఎర్రసముద్రం ఆవల నుంచి తీసుకురావాలంటే ఎక్కువ వ్యయాలు అవుతాయి.

**13 దేశాల నుంచి వచ్చే సరకుపై అదనపు భారం**

13 దేశాల నుంచి జరిగే అన్ని బుకింగ్‌లపై, ఒక్కో కంటైనర్ రవాణాకు 2000-4000 డాలర్ల (రూ.1.80-3.60 లక్షల) మేర అత్యవసర సర్‌ఛార్జీ విధిస్తున్నట్లు ఫ్రెంచి కంటైనర్ సంస్థ సీఎమ్ఏ సీజీఎమ్ వెల్లడించింది. ఆ జాబితాలో యూఏఈ, సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, ఒమన్, ఖతర్, యెమన్, బెహ్రెయిన్, జోర్డాన్, ఈజిప్ట్ పోర్ట్ ఆఫ్ ఆయిన్ సొఖ్నా, సూడాన్ తదితర దేశాలున్నాయి. దీంతో దిగుమతిదార్ల వ్యయాలు పెరుగుతున్నాయని సొల్యూబుల్ ఫెర్టిలైజర్ ఇండస్ట్రీ అసోసియేషన్(ఎస్ఎఫ్ఐఏ) ప్రెసిడెంట్ రాజీబ్ చక్రవోర్తి పేర్కొన్నారు.

చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు

ఫ్యూచర్స్‌లో బ్రెంట్ ముడిచమురు ధర 13% పెరిగి 82.37 డాలర్లకు పెరిగింది. 2025 జనవరి తర్వాత ఇదే అధికం. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి ప్రపంచం వినియోగిస్తున్న చమురులో 20%, ఎల్ఎన్‌జీలో 20% హార్ముజ్ జలసంధి మీదుగానే దిగుమతి అవుతోంది. ఈ రవాణాకు ఏర్పడిన ఆటంకమే ఇబ్బంది పెడుతోంది.మనదేశం రోజుకు 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురు వినియోగిస్తోంది. అందులో 1.5-2 మిలియన్ బ్యారెళ్లు ఈ జలసంధి నుంచే సరఫరా అవుతోంది. అమెరికా ఆంక్షల తరవాత రష్యా నుంచి చమురు కొనుగోలును మనదేశం తగ్గించి, పశ్చిమాసియా నుంచే కొంటోంది. ఇప్పుడు ఈ రవాణాకు ఆటంకం ఏర్పడుతోంది.బ్రెంట్ క్రూడ్ ధర ఒక డాలరు పెరిగినా.. ఒక ఏడాదికి మన ప్రభుత్వం రూ.13,000 కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది 160 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 14.40 లక్షల కోట్ల) చమురును మనదేశం దిగుమతి చేసుకుంది.యుద్ధం కొనసాగితే ఎల్ఎన్‌జీ (ద్రవీకృత సహజవాయువు) ఉత్పత్తి నిలిపేస్తామని సోమవారం ఖతార్ ఎనర్జీ పేర్కొంది. ప్రపంచ అగ్రగామి సరఫరాదార్లలో ఇదీ ఒకటి. ఐరోపా సహజవాయువు ఫ్యూచర్స్ ధర ఒక్కసారిగా 42% పెరిగింది. యుద్ధ ప్రదేశాలకు ఉద్యోగుల్ని పంపొద్దంటూ ఐటీ కంపెనీలకు పరిశ్రమ సంఘం నాస్కామ్ సూచించింది. ఇంటి నుంచి పని ప్రోటోకాల్స్ మొదలుపెట్టాలని తెలిపింది. యుద్ధ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు, ఉద్యోగుల భద్రతే పరిశ్రమకు 'అత్యంత ప్రాధాన్య' విషయమని పేర్కొంది. ఆయా దేశాలకు తమ ఉద్యోగుల ప్రయాణాలు రద్దు చేసినట్లు టీసీఎస్, విప్రో సంస్థలు ప్రకటించాయి. ట్రాన్సిట్ సహా అన్ని ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ ప్రయాణాలను రద్దు చేసినట్లు టీసీఎస్ తెలిపింది. ఈ కంపెనీ ఉద్యోగులు 9000 మందికి పైగా మధ్యప్రాచ్యం, ఆఫ్రికా(ఎమ్ఈఏ) ప్రాంతంలో ఉన్నారు. విప్రో సైతం 10-11 ప్రభావిత దేశాలకు నో-ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. అక్కడ వందలమంది ఉద్యోగులు కంపెనీకి ఉన్నట్లు సమాచారం.

**డాలర్ రూ.95కి చేరుతుందా?**

యుద్ధం ఇలాగే కొనసాగితే, డాలరు విలువ రూ.92 స్థాయికి మించుతుందని విశ్లేషకులు అంటున్నారు. సమీప కాలంలో డాలర్ విలువ రూ.91-93 మధ్య చలిస్తుందనీ, 2026 చివరకు రూ.95 స్థాయికీ చేరొచ్చని చెబుతున్నారు. ఇప్పటివరకు చూస్తే, జనవరి 30 నాటి 91.9950 విలువే రూపాయి కనిష్ఠస్థాయి.

**ఎయిర్ కార్గో ఛార్జీలను మినహాయించండి దుస్తుల ఎగుమతిదార్ల విజ్ఞప్తి**

విమానాశ్రయాల్లో ఎక్కువ కాలం పాటు సరకు ఉంచినందుకు గాను విధిస్తున్న డెమరిజ్ ఛార్జీలను మినహాయించాలని, పౌర విమానయాన శాఖను దుస్తుల ఎగుమతిదార్ల మండలి ఏఈపీసీ కోరుతోంది. ప్రస్తుత ఆలస్యాలు ఎగుమతిదార్లు, కస్టమ్స్ బ్రోకర్లు, ఫ్రైట్ ఫార్వర్డర్స్, ఎయిర్ కార్గో ఏజెంట్ల నియంత్రణలో లేవని ఏఈపీసీ ఛైర్మన్ ఎ శక్తివేల్ పేర్కొన్నారు. నిర్దిష్ట ఉచిత గడువుకు మించి టర్మినళ్లలో సరకు ఉంటే, రుసుము విధిస్తుంటారు.

**కార్ల ఎగుమతులపై ప్రభావం తక్కువే**

మారుతీ సుజుకీ 2025-26 ఏప్రిల్-ఫిబ్రవరిలో మొత్తం 4 లక్షల కార్లను ఎగుమతి చేసింది. పశ్చిమాసియాకు తమ ఎగుమతుల్లో 12.5% వరకు వాటా ఉండొచ్చని మారుతీ పేర్కొంది. ఆ ప్రాంతానికి కార్ల ఎగుమతులను తాము చేయడం లేదని టాటా మోటార్స్ ప్రతినిధి తెలిపారు. వాణిజ్య వాహనాల ఎగుమతులున్నా అవి పెద్ద లెక్కలోకి రావన్నారు.

**20-25 శాతం విమాన టికెట్ల రద్దు**

ఉద్రిక్తతలు నెలకొన్న మార్గాల్లో 20-25% మేర విమాన టికెట్ల రద్దు, రీ షెడ్యూలింగ్ జరుగుతోందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఏటీఓ) పేర్కొంది. సమీప భవిష్యత్తులో ఆ ప్రాంతానికి తమ పర్యటన ప్రణాళికలను అధికులు వాయిదా వేసుకుంటారని మేక్‌మైట్రిప్ అంచనా వేస్తోంది.

చమురు, ఎల్ఎన్‌జీ సరఫరాకు తీవ్ర ఇబ్బందులు

ఫ్యూచర్స్‌లో బ్రెంట్ ముడిచమురు ధర 6% పెరిగి 77 డాలర్లకు చేరింది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి ప్రపంచం వినియోగిస్తున్న చమురులో 20%, ఎల్ఎన్‌జీలో 20% హార్ముజ్ జలసంధి మీదుగానే దిగుమతి అవుతోంది. ఈ రవాణాకు ఏర్పడిన ఆటంకమే ఇబ్బంది పెడుతోంది. మనదేశం రోజుకు 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురు వినియోగిస్తోంది. అందులో 1.5-2 మిలియన్ బ్యారెళ్లు ఈ జలసంధి నుంచే సరఫరా అవుతోంది. అమెరికా ఆంక్షల తరవాత రష్యా నుంచి చమురు కొనుగోలును మనదేశం తగ్గించి, పశ్చిమాసియా నుంచే కొంటోంది. ఇప్పుడు ఈ రవాణాకు ఆటంకం ఏర్పడుతోంది. బ్రెంట్ క్రూడ్ ధర ఒక డాలరు పెరిగినా.. ఒక ఏడాదికి మన ప్రభుత్వం రూ.13,000 కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. యుద్ధం కొనసాగితే ఎల్ఎన్‌జీ (ద్రవీకృత సహజవాయువు) ఉత్పత్తి నిలిపేస్తామని ఖతార్ ఎనర్జీ పేర్కొంది. ప్రపంచ అగ్రగామి సరఫరాదార్లలో ఇదీ ఒకటి. ఐరోపా సహజవాయువు ఫ్యూచర్స్ ధర 42% పెరిగింది.

ఎయిర్ కార్గో ఛార్జీలు మినహాయించండి

విమానాశ్రయాల్లో ఎక్కువ కాలం పాటు సరకు ఉంచినందుకు గాను విధిస్తున్న డెమరిజ్ ఛార్జీలను మినహాయించాలని, పౌర విమానయాన శాఖను దుస్తుల ఎగుమతిదార్ల మండలి ఏఈపీసీ కోరుతోంది.

కార్ల ఎగుమతులపై ప్రభావం తక్కువే

మారుతీ 2025-26 ఏప్రిల్-ఫిబ్రవరిలో 4 లక్షల కార్లను ఎగుమతి చేసింది. పశ్చిమాసియాకు తమ ఎగుమతుల్లో 12.5% వాటా ఉండొచ్చని మారుతీ పేర్కొంది. ఆ ప్రాంతానికి కార్ల ఎగుమతులను తాము చేయడం లేదని టాటా మోటార్స్ ప్రతినిధి తెలిపారు. వాణిజ్య వాహనాల ఎగుమతులున్నా అవి పెద్ద లెక్కలోకి రావన్నారు.

# కరెంటు ఖాతా లోటు పెరిగింది

**న్యూఢిల్లీ:**దేశ కరెంటు ఖాతా లోటు డిసెంబరు త్రైమాసికంలో 13.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.19 లక్షల కోట్లు)గా నమోదైంది. ఇది జీడీపీలో 1.3 శాతానికి సమానం. 2024-25 ఇదే త్రైమాసిక కరెంటు ఖాతా లోటు 11.3 బి.డా. కంటే ఇది అధికం. అప్పటి జీడీపీలో 1.1 శాతమిది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-డిసెంబరు కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, కరెంటు ఖాతా లోటు 30.1 బి.డా. (రూ.2.71 లక్షల కోట్ల)కు పరిమితమైంది. జీడీపీలో 1 శాతానికి సమానం. 2024-25 ఇదే కాలంలో ఇది 36.6 బి.డా. కాగా, జీడీపీలో 1.3 శాతంగా నమోదైంది. 2025 అక్టోబరు-డిసెంబరులో వస్తువుల వాణిజ్య లోటు 93.6 బి.డా.గా నమోదైంది. ఏడాది క్రితం ఇది 79.3 బి.డా.సేవల లావాదేవీల నికర ఆదాయం 51.2 బి.డా. నుంచి 57.5 బి.డా.కుపెరిగింది. కంప్యూటర్ సేవలు, వ్యాపార సేవల ఎగుమతులు రాణించడం కలిసొచ్చింది. పెట్టుబడుల రీత్యా ఆదాయం మాత్రం 16.4 బి.డా. నుంచి 12.2 బి.డా.కు తగ్గింది. తరలి పోయిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 2.8 బి.డా. నుంచి 3.7 బి.డా.కు చేరాయి.

# హార్ముజ్ మూసివేశాక.. ఇవీ ఆప్షన్లు!

**న్యూఢిల్లీ:**ఇరాన్-ఇజ్రాయెల్,అమెరికా యుద్ధంతో గల్ఫ్‌దేశాలను అంతర్జాతీయ వాణిజ్యంతో అనుసంధానించే హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో పెట్రోలియం, గ్యాస్ రవాణాకు పెద్ద ఆటంకం ఏర్పడుతుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. అయితే దీనికి ప్రత్యామ్నాయ మార్గాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

సౌదీ అరేబియా: తూర్పు-పశ్చిమంగా పెద్ద పైప్‌లైన్ ఉంది. దీన్నే పెట్రోలైన్ అంటారు. ఎర్రసముద్ర తీరంలోని యంబు నౌకాశ్రయానికి ఇది వెళుతుంది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఐరోపా, అమెరికాలకు చమురు సరఫరా చేయవచ్చు.

యూఏఈ: అబుదాబీ నుంచి ఒమన్ లోని ఫుజైరా వరకు పైప్‌లైన్ ఉంది. దీంతో ఒమన్ వరకు పైప్‌లో సరఫరాచేసి అక్కడ నుంచి నౌకాశ్రయాల ద్వారా చమురును ఆసియాలోని ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశముంది.

ఇరాక్: కిర్కుక్ నుంచి తుర్కియేలోని సీహన్ వరకు పెద్ద పైప్‌లైన్ ఉంది. కొన్ని చోట్ల మరమ్మతులు నిర్వహిస్తే తుర్కియేకు పెట్రోలియం అందుతుంది. అక్కడ నుంచి పశ్చిమదేశాలకు సరఫరా చేసే సౌలభ్యం ఉంది. ఇవే కాకుండా అమెరికా ఇతర దేశాల రక్షణతో చమురు ట్యాంకర్లు హార్ముజ్ గుండా ప్రయాణించవచ్చు. ఇక ఈ మార్గం ద్వారానే చైనాకు అధికంగా చమురు సరఫరా జరుగుతుంటుంది. బీజింగ్‌కు టెహ్రాన్ మిత్రపక్షం. దీంతో ఈ జలసంధిని ఎక్కువ కాలం మూసివేయదన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.







# క్రమశిక్షణ తప్పిన ఖమ్మం విద్యా వ్యవస్థ

- పేరుకే సిన్సియర్ లోపలంతా కమర్షియల్
- ముగ్గురు మంత్రుల పర్యవేక్షణలో ఇన్ డిసిప్లిన్
- ఇష్టారీతిన వార్డెన్లు, అధికారుల తీరు

**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఖమ్మంలో విద్యా వ్యవస్థతో పాటుగా విద్యా వ్యవస్థతో అనుసంధానం అయ్యి ఉన్నా వ్యవస్థలన్నీ గాడి తప్పాయి. పర్యవేక్షణ లోపంతో పాటుగా నిఘా వ్యవస్థ లేకపోవడంతో ఆయా శాఖలన్ని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ముగ్గురు మంత్రులు, రాష్ట్ర డిప్యూటీ సిఎం జిల్లాలో ఉన్నారనే భయం లేకుం డా పోయింది. టేబుల్ కింద చేతులు పెట్టి కొందరు సరి పెట్టుకుంటే మరి కొందరేమో తదుపరి పోస్టింగు పైరవీలు చేసే వ్యక్తులకు, అధికార పార్టీలో ఉన్న కొందరు బ్రోకర్ల మాటలకు తలొగ్గుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం తాము కూర్చున్న సీటుని కాపాడుకోవడం కోసం ఏ తప్పునైనా ఉపేక్షించే పరిస్థితి ఏర్పడింది. దాంతో తప్పు చేసిన వారు తప్పించుకోవడంతో పాటుగా దర్జాగా తిరిగేస్తున్నారు.

ఈ మధ్య కాలంలో వీడియోస్ కాలనీలోని రెసోనెన్స్ హస్టల్ లో 7వ తరగతి చదువుతున్న భార్గవ్ అనే విద్యార్థిని ముగ్గురు వార్డెన్లు కలిసి వీపుపై చర్మం లేచి వచ్చేలా కొట్టారు. గదిలో నిర్బంధించి ఒక్కడిని చేసి గొడ్డును బాదినట్లు బాది రాక్షసుల్లాగా ప్రవర్తించారు. శివ, రాకేష్, కిరణ్ వార్డెన్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురు పసివాడిపై ప్రతాపం చూపారు. వీళ్లపై కఠిన చర్యలు తీసుకుని జువెనైల్ జస్టిస్ చేయాల్సిన విద్యా శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విద్యాశాఖ నుంచి ఎలాంటి స్పందన లేదు. రెసోనెన్స్ హస్టల్ యాజమాన్యంపై చర్యలు ఎందుకు తీసుకోలేదో తెలియాల్సి ఉంది. విద్యా శాఖపై అంత ఒత్తిడి తీసుకువచ్చి చిన్నారికి న్యాయం చేయడంలో ఆటంకాలు సృష్టించిన వ్యక్తి ఎవరో అర్థం కాకుండా ఉంది. చిన్నారులు, మహిళల విషయంలో దాదాపుగా ఎవ్వరు జోక్యం చేసుకోరు. ఆ ముగ్గురిని ఉద్యోగం నుంచి తొలగించామని యాజమాన్యం చెప్పడంతో విద్యా శాఖ తదుపరి చర్యలు తీసుకోకుండా మమ అనిపించింది. రేపటి రోజున ఇంకోచోట మరో విద్యార్థిపై ఇలాంటి ఘటన జరగదని చెప్పే గ్యారంటీ ఉందా..?

**మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా..**

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో బాలికల హస్టల్ వార్డెన్ గా ఉంటూ మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం పెద్ద దుమారాన్ని లేపింది. ఏకంగా జీతభత్యాలు ఇచ్చే రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుబడుతూ, ముఖ్యమంత్రి వైఖరిని ప్రశ్నిస్తూ, కించపరుస్తూ సోషల్ మీడియాలో స్టేటస్ పెడుతూ విమర్శలు చేసింది. ఆమెపై చర్యలు తీసుకోవాల్సిన బిసి సంక్షేమ అధికారి ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. మెమో ఇచ్చి మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించి వదిలేసారు. దాంతో సదరు వార్డెన్ ఫోన్ నంబర్ మార్చేసి, ఇన్స్టాగ్రామ్ ఐడి మార్చేసుకుని తనకు ఎలాంటి ఇబ్బంది లేనట్లుగా విధులు నిర్వర్తిస్తుంది. పొంగులేటి ఇలాఖాలో ఇంతగా క్రమ శిక్షణ తప్పిన అధికారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. బిసి సంక్షేమ అధికారి ఇక్కడే తిష్టవేసి ఏండ్లు గడుస్తున్నా ఇంతవరకు ఆమెకు స్థాన చలనం లేదు. అందరికి బదిలీలు అవుతున్నాయి. సదరు అధికారికి బదిలీ కాకపోవడంతో అనేక అనుమానాలు కలిగిస్తుంది. రాష్ట్రంలో కీలకమైన శాఖలు కలిగిన ముగ్గురు మంత్రులున్నచోట ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్న అధికారులను రిమోట్ ఏరియాలకు బదిలీ చేయడం బెటర్ అని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

# నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

## హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్ నాథ్



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో రూ.70 కోట్ల అవినీతి జరిగిందంటూ తనపై వస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదని హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్ నాథ్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్ నాథ్ మాట్లాడుతూ..తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అన్నారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎలాంటి చెక్కులపై సంతకాలు చేయలేదని వివరించారు. హెచ్‌సీఏ నుంచి విశాఖ కంపెనీకి రూ.70 కోట్లు చెల్లించడంలో తన ప్రమేయం లేదన్నారు. తాను ఛార్జ్ తీసుకునే ముందే ఆ ప్రక్రియ ప్రారంభమైందని స్పష్టం చేశారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు చెల్లింపులు కోర్టు ఆదేశాల మేరకే జరిగాయని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మీడియా సమావేశం జరుగుతున్న సమయంలో అక్కడికి చేరుకున్న కొందరు స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

మంత్రి వివేక్‌కు చెందిన విశాఖ ఇండస్ట్రీస్ కు రూ.70 కోట్లు అక్రమంగా విడుదల చేశారంటూ ఆరోపించాయి. మంత్రి ఆదేశాల మేరకు హెచ్‌సీఏలో ఉన్న పెద్దలు ఈ మొత్తాన్ని విడుదల చేశారని వారు పేర్కొన్నారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు.

# దొంగలకు దేహశుద్ధి.. పట్టుకొని పోలీసులకు అప్పగింత



**నారాయణఖేడ్: ఫిబ్రవరి 03 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్ గిద్ద మండలం కరస్ గుత్తి గ్రామం ఇరాక్ పల్లి రోడ్డులో దారి కాచి దొంగతన పాల్పడుతున్న ముగ్గురిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉంది... కర్ణాటకకు ఐదుగురు దొంగలు దారిలో వచ్చే ప్రజల కోసం నాగల్ గిద్ద మండలం గోవింద తాండ రోడ్డు పక్కన కూర్చున్నారు. దారి పొడుగునా ఒక వ్యక్తి వస్తుండగా అతని వద్ద నగదు, బంగారం బంగారం తీసుకుందామని దొంగలు ప్రయత్నించారు. అంతలోనే అక్కడ నుంచి ఆ వ్యక్తి పారిపోవడం జరిగింది. తండావాసులు సమాచారం ఇవ్వడంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాలు ,తండాలకు అందరికీ సమాచారం అందించి వెంటనే అందరూ దొంగను పట్టుకోవడానికి వెంబడించారు. ఇద్దరు పారిపోగా... ముగ్గురిని కరస్ గుత్తి గ్రామంలో పట్టుకుని దేహశుద్ధి చేశారు. వారి వద్ద ఉన్న ద్వి చక్ర వాహనాలను దహనం చేశారు. గ్రామంలో దొంగలను బంధించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ముగ్గురిని అదుపులోనికి నారాయణఖేడ్ నియోజకవర్గం లో ఉన్న పోలీస్ సిబ్బందిని నారాయణ ఖేడ్ ఎస్సై శ్రీశైలం, కంగ్టి సీఐ వెంకటరెడ్డి, మనూర్ ఎస్సై, సిర్గపూర్ ఎస్సై, 30 మంది పోలీస్ సిబ్బందితో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను అక్కడ నుంచి లాటి చార్జ్ చేసి దొంగలను నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లినట్లు తెలిపారు.



# శివకళ్యాణోత్సవం ఏర్పాట్లపై ఈవో సమీక్ష సమావేశం

**వేములవాడ (జనంసాక్షి):** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో జరగబోయే స్వామివారి శివకళ్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి ఇంజనీరింగ్ విభాగం అధికా రులు, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సంబంధిత విభాగాల సిబ్బందితో కలిసి మంగళవారం రోజు తన చాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సమయంలో ఆలయానికి భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఈవో ఆదేశించారు. భీమేశ్వరస్వామి ఆలయం లో దర్శన ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయం, తాగునీరు, పారిశుధ్య పనులు,విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శివకళ్యా ణోత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంపొందించేలా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఈవో రమాదేవి స్పష్టం చేశారు.

# ఉప్పల్ భగాయత్‌కు రూ.13.30 కోట్ల నిధులు మంజూరు

- ఆధునిక కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లతో రూపురేఖలు మారనున్నాయి
- రేవంత్ రెడ్డి కృషి, మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో సాధ్యమైంది
- వర్షాకాల సమస్యలకు తెరపడుతుంది.. ఆదర్శ కాలనీ దిశగా అడుగులు



**ఉప్పల్, మార్చి 3 (జనంసాక్షి) :** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్ అభివృద్ధికి మరోసారి భారీగా నిధులు మంజూరవడంతో ప్రాంత ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. రూ.13 కోట్ల 30 లక్షల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులు భగాయత్ రూపురేఖలను పూర్తిగా మార్చేసేలా ఉన్నాయి. గత కొంత కాలంగా దశలవారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఇది మరింత బలం చేకూర్చనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవ, మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి సమన్వయంతో ఈ నిధులు మంజూరయ్యాయని నాయకులు వెల్లడించారు. భగాయత్‌ను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసి, మౌలిక వసతులను విస్తరించాలనే లక్ష్యంతో ఈ నిధులు వినియోగించనున్నారు.

**మంజూరైన ప్రధాన పనుల వివరాలు:**

రూ.3 కోట్ల 50 లక్షలతో ఆధునిక సదుపాయాలతో కూడిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం. ఇది ప్రాంతీయ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు శక్తివంతమైన వేదికగా నిలుస్తుంది.

రూ.9 కోట్ల 80 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణం, సీసీ రోడ్ల అభివృద్ధి పనులు. పాతబడిన, గుంతలతో నిండిన రోడ్ల స్థానంలో బలమైన సీసీ రోడ్లు వేయనున్నారు.

ప్రస్తుతం భగాయత్ ప్రాంతంలో వర్షాకాలంలో నీటి నిల్వ, రోడ్ల దెబ్బతినడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కొత్త రహదారి పనులతో ఈ ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. రవాణా సౌలభ్యం పెరిగి, అత్యవసర సేవలకు సులభ మార్గం ఏర్పడుతుంది.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూపుతున్న చొరవ, స్థానిక నాయకుల సమన్వయంతోనే ఈ భారీ నిధులు సాధ్యమయ్యాయి. భగాయత్‌కు ఇది స్వర్ణయుగం ప్రారంభం" అంటూ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ భగాయత్‌ను ఆదర్శ కాలనిగా తీర్చిదిద్దే దిశగా నాయకత్వం అడుగులు వేస్తోందని స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మరిన్ని అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని నాయకులు సంకేతాలు ఇచ్చారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం



**నిర్మల్ రూరల్, మార్చ్ 3(జనం సాక్షి) :**

ఈ నెల మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రణాళిక శాఖ నోడల్ విభాగంగా వ్యవహరించే ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఐదు దశల్లో నిర్వహించనున్నాట్లు తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి సమావేశాలను నిర్వహించాలని,జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలతో ఈ కార్యక్రమం ముగియనున్నట్లు వివరించారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రభుత్వం ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ ఆరోగ్యం, రోడ్డు భద్రత(అరైవ్-అలైవ్), సంక్షేమం,పిల్లల భద్రత ఓ డ్రగ్స్ నిర్మూలన,రైతు సంక్షేమం,విద్య,క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి 10 ప్రత్యేక అంశాలపై శాఖల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను ప్రభుత్వం వినియోగించనుందనీ, క్షేత్రస్థాయిలో పనులు పారదర్శకంగా వేగంగా జరిగేలా చూడటమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు మాతృ వియోగం



**తలకొండపల్లి మార్చి 03(జనంసాక్షి):**

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ గుర్క జైపాల్ యాదవ్ కు మాతృ వియోగం కలిగింది. వృద్ధాప్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమె కడ్తాల్ మండలం స్వగ్రామం చల్లంపల్లి లోని స్వగృహంలో నివాసంలో ఉంటున్నారు. ఆయన తల్లి మంగమ్మ (93) మంగళవారం ఉదయం మరణించారు. మంగళవారం మధ్యాహ్నం చల్లంపల్లి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ సీఎం కెసిఆర్,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,సంతాపం మంగమ్మ మృతికి మాజీ సీఎం కేసీఆర్,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కెసిఆర్,కేటీఆర్ ప్రార్థించారు. కన్నతల్లి మరణంతో శోకతప్తులైన జైపాల్ యాదవ్,కు వారి కుటుంబ సభ్యులకు ఓదార్పునిస్తూ మాజీ సీఎం కేసీఆర్,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్,రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్,పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్,ఏఎంసీ చైర్మన్ యాట గీత నరసింహా,ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్,మాజీ జెడ్పిటిసిలు దశరథ్ నాయక్,విజితా రెడ్డి,మాజీ ఎంపీపీ లు సిఎల్ శ్రీనివాస్ యాదవ్,నిర్మల శ్రీశైలం గౌడ్,ఆమనగల్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి,కడ్తాల్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పరమేష్,ఆమనగల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్జున్ రావు,తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుమ్మరి శంకర్,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు.



# హోలీ సంబరాల్లో జగిత్యాల పోలీసులు

- శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా హోలీ : ఎస్పీ అశోక్ కుమార్
- జీవితాల్లో కొత్త ఉత్సాహం, వెలుగులు నింపాలని ఆకాంక్ష

జగిత్యాల, మార్చి 3: జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా, ఉత్సాహంగా జరిగాయి. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది రంగులతో ముద్దాడుకుంటూ సంతోషంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరికీ, పోలీసు సిబ్బందికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. "రంగుల పండుగ హోలీ అందరి జీవితాల్లో సంతోషాన్ని, కొత్త ఉత్సాహాన్ని, వెలుగులను నింపాలి. ఈ పండుగ మనసులను రంగులతో నింపి, ప్రేమ, సామరస్యాన్ని పెంచాలి" అని ఆకాంక్షించారు.

వేడుకల్లో డీఎస్పీలు వెంకటరమణ, రఘు చందర్, రాములు, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అదే సమయంలో జగిత్యాల పట్టణ ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐల్నేని వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ సంబరాల్లో జిల్లా తొలి జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. "హోలీ శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రతీక. అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసే ఈ రంగుల పండుగ ప్రజల జీవితాలను సప్తవర్ణ శోభితం చేయాలి" అని కోరారు. జగిత్యాల జిల్లా, నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ సందర్భంగా జిల్లా అంతటా శాంతి, సౌజన్యం నెలకొని ఉండాలని అందరూ ఆశిస్తున్నారు.

# జగిత్యాల జిల్లాలో అక్రమ వసూళ్లు

## ప్రజావాణిలో బాధితుడి ఫిర్యాదు

- ట్రాక్టర్ ఓనర్ల నుంచి 30 వేలు చొప్పున భారీగా డబ్బులు
- బెదిరింపులు, బ్లాక్‌మెయిల్.. ట్రాక్టర్ల సీజ్ చేసి మళ్లీ డిమాండ్
- పాఠశాల పక్కనే మద్యం టెండర్.. పిల్లలకు తీవ్ర ఇబ్బంది

**జగిత్యాల, మార్చి 3 (జనంసాక్షి) :**

జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ శంకర్ నాయక్ అక్రమ వసూళ్లు, బెదిరింపులు, అవినీతి గురించి ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన గుగ్లావత్ రాజేందర్, కనుముల వెంకటేష్, తోట గంగారెడ్డి, వేంపల్లి వెంకట్రావుపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో కలిసి సమీకృత కలెక్టరేట్ భవనంలో ఈ ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదుదారుల ప్రకారం.. పాలగవర్ధాలు విడిసి పేరుతో బినామీగా పనిచేస్తూ గత నెలలో ఇసుక తరలించే ట్రాక్టర్ల నుంచి భారీగా అక్రమ వసూళ్లు చేశారని ఆరోపించారు. ఒక్కో ట్రాక్టర్‌కు 30 వేల రూపాయల చొప్పున రైకల్, కొత్తపేట, వేంపల్లి, వెంకటరావుపేట, మల్లాపూర్, గొర్రెపల్లి, చింతలూరు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ ఓనర్ల నుంచి సుమారు 8 లక్షల రూపాయలు వసూలు చేశారని తెలిపారు.

ఇస్లావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. తాను మొదట 20 వేల రూపాయలు నగదుగా ఇచ్చానని, మరో 15 రోజుల తర్వాత 30 వేలు ఇవ్వాలని బెదిరింపులకు దిగారని, లేకపోతే ట్రాక్టర్‌ను పట్టిస్తామని హెచ్చరించారని వాపోయారు. కొంతమంది కలిసి ట్రాక్టర్ ఫోటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేశారని, బ్రిడ్జి కోసం ఇసుక జమ చేసిన ఫోటోలు తీసి అధికారులకు చూపి ట్రాక్టర్లను సీజ్ చేయించారని ఆరోపించారు.

ఎంత బ్రతిమలాడినా అధికారులు, ప్రజాప్రతినిధులు వినిపించుకోలేదని, తహసీల్దార్ ఆదేశాల మేరకు ఒక్కో ట్రాక్టర్‌కు 15 వేలు డిడి చెల్లించాలని మళ్లీ డిమాండ్ చేశారని, చివరికి 8 వేలు డిడి ఇచ్చానని తెలిపారు. ఇప్పుడు బూతులు తిడుతూ, నాపై అక్రమ కేసులు పెడుతున్నారని, సంబంధిత ప్రజాప్రతినిధులు పోలీస్ స్టేషన్‌లో నాపై ఫిర్యాదు చేశారని బాధపడ్డారు.

అంతేకాకుండా.. సమీప పాఠశాల పక్కనే మద్యం టెండర్ ఉండటంతో పిల్లలు తీవ్ర మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని, చికెన్ సెంటర్లు, కూల్‌డ్రింకులు, పెట్రోల్, నిత్యవసర వస్తువులకు ఉరకై టెండర్లు వేసి అక్రమంగా పైసలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ టెండర్లు, అవినీతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిగా ఉంచాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి వేదికగా డిమాండ్ చేశారు.

# పశు వైద్యశాల సబ్ సెంటర్‌కు నిధులు మంజూరు

- మంత్రికి ధన్యవాదాలు.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ
- పాడి రైతులకు ఇబ్బందులు తప్పయన్న ఠాకూర్ నరేందర్ సింగ్



**చిగురుమామిడి మార్చి 3 (జనంసాక్షి):** మండలంలోని నవాబుపేట గ్రామానికి పశు వైద్యశాల సబ్ సెంటర్ భవనం నిర్మాణానికి 10లక్షల 23వేల రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు,పాల కేంద్రం అధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్ ఆధ్వర్యంలో నవాబుపేట చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఠాకూర్ నరేందర్ సింగ్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధిక పాల ఉత్పత్తిని చేస్తూ పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు పశు వైద్యశాల లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. గతంలో పాడిపశువులు అనారోగ్యాలకు గురైతే హుస్నాబాద్,ఇందుర్తి, చిగురుమామిడి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని,దింతో రైతులు చాలా ఇబ్బందులు పడేవారని వారు గుర్తు చేశారు. సబ్ సెంటర్ ఏర్పాటుతో పశువుల రోగాల నిర్ధారణ,టీకాలు,చిన్నపాటి శస్త్రచికిత్సలు,గర్భధారణ సేవలు అన్ని రకాల సేవలు నవాబుపేటలోనే అందుబాటులో ఉంటాయని అన్నారు. గ్రామ స్థాయిలో పశువుల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా రైతులు మరింత ఆర్థిక అభివృద్ధి చెందుతారని ఠాకూర్ నరేంద్ర సింగ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట పాలకేంద్రం అధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్,డైరెక్టర్లు కాశవేణి రాజయ్య,మర్రి ఐలేష్ యాదవ్,పిల్లి ప్రశాంత్,పాడి రైతులు మర్రి బాలయ్య,పోతరవేణి నరసయ్య, పాలవేణి సంపత్ బత్తిని రాజు మేకల రాజేందర్,పిల్లి స్వామి, గూళ్ళ సంతోష్,గూళ్ల మధు,ఠాకూర్ ధర్మేందర్ సింగ్, గుళ్ల మొగిలి, పోతారవేణి సంపత్,తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
4 మార్చి 2026

# చెల్పూర్ వాసికి జాతీయ స్థాయి 'ఉత్తమ డిఫేండర్' అవార్డు

- ఈ నెల 8న హర్యానా మాజీ గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న రాకేష్ రెడ్డి
- ఆరె రాకేష్ రెడ్డికి వెల్లువెత్తుతున్న అభినందనలు



**హుజూరాబాద్, మార్చి 3 (జనం సాక్షి ):** సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలంది స్తున్న చెల్పూర్ గ్రామ వాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆరె రాకేష్ రెడ్డికి జాతీయ స్థాయి ఉత్తమ డిఫెండర్ అవార్డు లభించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, భూపాలపల్లి జిల్లా పీఆర్టీయు అధ్యక్షులుగా పని చేస్తున్న ఆరె రాకేష్ రెడ్డి సామాజిక సేవలను గుర్తించి జాతీయ స్థాయి ఉత్తమ డిఫెండర్ అవార్డును ప్రముఖ పాన్ ఇండియా సంస్థ ప్రకటించింది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ ఆడిటోరియంలో జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ప్రముఖ సినీనటి ఆమనిల చేతుల మీదుగా రాకేష్ రెడ్డికి పాన్ ఇండియా సంస్థ ఉత్తమ డిఫెండర్ అవార్డును అందించ బోతుంది. గత కొన్నేళ్లుగా సామాజిక సేవలు అందిస్తున్న రాకేష్ రెడ్డి అత్యధిక సార్లు రక్తదానం చేయడం, రక్తదానం చేయడంలో ఇతరులను ప్రోత్సహించడం. యువనేతాజీ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం, సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలతో ముందుకెళ్తున్నారు. జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు రావడం పట్ల చెల్పూర్ గ్రామస్తులు, స్నేహితులు, ఉపాధ్యాయులు, పీఆర్టీయు నాయకుల నుంచి రాకేష్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తాను చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయి ఉత్తమ డిఫెండర్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, అవార్డు ప్రకటించిన పాన్ ఇండియా సంస్థకు ఆరె రాకేష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్తానని అన్నారు.

# మియాపూర్‌లో ప్రేమ వ్యవహారంతో యువతి ఆత్మహత్య



**శేరిలింగంపల్లి, మార్చి 3 (జనం సాక్షి) :** ప్రేమలో మనసు చెరిగిపోయి మియాపూర్ పేయింగ్ గెస్ట్ హాస్టల్‌లో 20 ఏళ్ల యువతి హృదయవిదారకంగా ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన మేఘావత్ సోని బాయి గత ఏడాది నుంచి ఫస్ట్ హెల్త్ ల్యాబ్స్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. సోమవారం విధులకు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయింది. మంగళవారం రాత్రి 10 గంటలకు సహచరులు తిరిగి వచ్చేసరికి తలుపు లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికీ గుండా చూస్తే.. సోని పైకప్పు హుక్కుకు చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతోంది. తలుపు బద్దలు కొట్టి ఆమెను కిందికి దించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. తన సొంతూరి యువకుడితో ప్రేమ వ్యవహారంలో వచ్చిన గొడవలు, మనస్థాపాలే ఈ దారుణ నిర్ణయానికి కారణమని స్నేహితులు భావిస్తున్నారు. మియాపూర్ పోలీసులు కుటుంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ ఆర్థిక దుస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ.. హామీల అమలు నుంచి తప్పుకోవద్దు
- కేంద్రం నుంచి రూ.12 లక్షల కోట్ల సాయం.. రాష్ట్రం ఋణాలపైనే ఆధారం
- ఖజానా ఖాళీ అంటూ హామీలు తప్పించుకోవడం సరికాదు



**ముషీరాబాద్, మార్చి 3 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి కేంద్ర హోంశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు ఖజానా ఖాళీ అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని, ఇటీవల సభలో సోనియా గాంధీ-రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి రూ.1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పిన తీరును చూస్తుంటే రాష్ట్ర ఖజానా నిల్.. కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతోందని మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 6 గ్యారంటీలతోపాటు 420 హామీలు ఇచ్చి ప్రజల నమ్మకం సంపాదించి అధికారం చేపట్టిందని, కానీ ఇప్పుడు ఆ హామీల అమలు నుంచి తప్పుకోవడానికి ఖజానా ఖాళీ అని చెప్పడం సరికాదని అన్నారు. 2014 నుంచి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి గత 12 సంవత్సరాల్లో దాదాపు రూ.12 లక్షల కోట్ల నిధులను అందించిందని, ఇందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా, రూ.1.85 లక్షల కోట్ల రహదారుల నిర్మాణం, రూ.36 వేల కోట్ల రైల్వే బడ్జెట్, రూ.50 వేల కోట్ల రైల్వే పనులు, రూ.40 వేల కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50 వేల కోట్ల ఉచిత రేషన్ బియ్యం, రూ.40 వేల కోట్ల స్థానిక సంస్థల నిధులు, రూ.12 వేల కోట్ల విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14 వేల కోట్ల పీఎం కిసాన్, రూ.80 వేల కోట్ల ఎరువుల సబ్సిడీ, రూ.21 వేల కోట్ల విద్యా క్రీడల నిధులు, రూ.9 వేల కోట్ల ఆరోగ్య సంరక్షణ నిధులు ఉన్నాయని వివరించారు. అంతేకాకుండా రూ.2 లక్షల కోట్ల వరి ధాన్యం, రూ.60 వేల కోట్ల పత్తి కనీస మద్దతు ధర చెల్లించి సేకరించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా రూ.10 లక్షల కోట్ల ఋణాలు, SASCI పథకం కింద 2020-21 నుంచి రూ.10 వేల కోట్ల వడ్డీ రహిత ఋణాలు అందించారని, వీటితో మురుగునీటి నాళాలు, రోడ్లు, రైల్వేలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, కాలేజీలు, హాస్టళ్లు, పర్యాటక సదుపాయాలు, ORR-RRR రేడియల్ రోడ్లు, మూసీ సుందరీకరణ, స్మార్ట్ సిటీలు, వీమీా ఫేజ్-II, పీఎం గ్రామ సడక్ యోజన వంటి వందలాది ప్రాజెక్టులు అమలయ్యాయని వివరించారు.

అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు కూడా ఈ వడ్డీ రహిత ఋణాలపైనే ఆధారపడుతుందని, గత బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక దుస్థితి స్పష్టమవుతోందని మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రాష్ట్రం ఋణాలు తీసుకుని వడ్డీలు చెల్లించడానికి మళ్లీ ఋణాలు, జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాలకు ఋణాలు తీసుకుంటున్న పరిస్థితి ఉందని, 2014లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రం ఇప్పుడు ఋణాలపైనే నడుస్తోందని, ప్రతి సంవత్సరం పెరుగుతున్న తలసరి అప్పు ఆర్థిక దుస్థితిని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని, మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలకు ముందుగా పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరపున కోరుతున్నానని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# ఆర్టీసీకి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**సర్కార్ స్పందించకుంటే 13న సమ్మె నోటీసు ఇస్తాం : టిజిఎస్ ఆర్టిసి జేఏసీ**

**ముషీరాబాద్, మార్చ్ 03 (జనం సాక్షి):** ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చని యెడల మార్చ్13 న జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు ఇస్తామని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో. కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, యాదగిరి లు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 న కని విని ఎరుగని రీతిలో చేపట్టిన ఛలో సెక్రటరియేట్ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికుల అక్రంధనలు, కష్టాలు భాదలు చూసినాక ప్రభుత్వం స్పందిస్తుందనే నమ్మకం ఉందన్నారు. ఇంకా 10 రోజుల సమయం ఉందని ఈ లోపు ప్రభుత్వం పంతాలు పట్టింపులు విడనాడి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రధానంగా ఆర్టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, 2021 వేతన సవరణ, 30% ఫిట్మెంట్ తో చేయాలనీ, 2025 పిఆర్సి అమలు, ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. ప్రవేటు ఎలక్ట్రిక్ బస్సుల స్థానంలో ఆర్టీసీ బస్సులు ప్రవేశ పెట్టాలన్నారు. ప్రవేటు బస్సులకు ఆర్టీసీ డిపో స్థలాలు ఇవ్వకూడదనీ, బ్రెడ్ విన్నర్ స్కిం వారిని రెగ్యులర్ చేయాలనీ, ఈ ఉద్యోగాలను రెగ్యులర్ పోస్ట్‌ల్లో నియమించాలనీ, తదితర పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలనీ డిమాండ్ చేశారు. రెండున్నర సంవత్సరాల నుండి ఓపిక పట్టమని, ఓపిక నశించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చ్13 న జేఏసీ సమ్మె నోటిస్ ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్నీ జేఏసీ లో లేని సంఘాలకు తెలియపరిచి సమ్మె లో భాగస్వామ్యం కావాలని కోరుతూ వారికి జేఏసీ లేఖలు వ్రాయడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె వైపు కు వెళ్లకుండా ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. ప్రభుత్వం కార్మికులను దూరం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

# హోలీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ అది



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 3 (జనంసాక్షి) :** రంగుల పండుగగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే హోలీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగ సాంప్రదాయాలు మన సంస్కృతిలో ఐక్యత, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని ప్రతిబింబిస్తాయన్నారు.హోలీ అనేది చెడుపై మేలుకు గెలుపును సూచించే పర్వదినమని, ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, సుఖశాంతులు నింపాలని విప్ ఆకాంక్షించారు.రంగులతో ఒకరినొకరు ఆహ్వానించుకుంటూ స్నేహభావాన్ని పంచుకునే ఈ వేడుక సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుందన్నారు.హోలీ కంటే ఒక రోజు ముందు మన ప్రాంతంలో కామ దహనం పురాణాల ప్రకారం హోలీక అనే రాక్షసి మరణించడం వలన పలు ప్రాంతంలో హోలీకా దహనమని మన ప్రాంతంలో కామ దహనం ను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.ప్రజలు పర్యావరణ హితంగా హోలీ వేడుకలను జరుపుకోవాలన్నారు.ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# వేములవాడలో పిచ్చి కుక్క బీభత్సం

**పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తాం : మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిది మార్చి 3(జనంసాక్షి) :** వేములవాడలో మంగళవారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి సుమారు 25 మందికి పైగా ప్రజలను కరిచి గాయపరిచిన ఘటన కలకలం రేపింది. పలు కాలనీలు, ప్రధాన వీధుల్లో సంచరించిన కుక్క దాడితో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.గాయపడిన వారిలో రాజన్న భక్తులు కూడా ఉన్నారు.గాయపడిన వారిని వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారికి రేబీస్ నిరోధక టీకాలు మరియు అవసరమైన చికిత్స అందిస్తున్నారు.కొందరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,వైస్ చేర్మెన్ నరాల శేఖర్ కౌన్సిలర్లు మమత అజయ్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని,మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ బాధితులకు పూర్తి స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నమన్నారు. మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను తగ్గించేందుకు గత 15 రోజుల క్రితమే 40 కుక్కలను ఏబిసి కేంద్రానికి తరలించామన్నారు. మరిన్ని కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించమని,ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.ఈ ఘటనతో చైర్మన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కుక్కల నియంత్రణ చర్యలను వేగవంతం చేశారు.

# నేడు లక్ష్మీనరసింహస్వామి జాతర

**అధిక సంఖ్యలో పాల్గొననున్న భక్తులు**

**చిగురుమామిడి మార్చి 3 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం,రేకొండ గ్రామంలో ఊరగుట్టకు స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించబడునని చైర్మన్, కొలిపాక వెను,అర్చకులు వెంకటేశ్వర్లు తెలిపారు.వారు మాట్లాడుతూ, బుధవారం ఉదయం నుండి జాతర ప్రారంభం అవుతధని, విశ్వేషణ ఆరాధన పుణ్యాహవచనం,రక్షబంధన, స్వామివారికి పువ్వులు, పంచామృత అభిషేకం,తీర్థ ప్రసాద వితరణ,ఆశీర్వచనం, అనంతరం అన్న ప్రసాదమ్ , గుడి గుట్ట బండ్లు తిరుగుతాయనీ,వారు తెలియజేశారు.భక్తులకు నీటి సౌకర్యంతో, అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ చేసిందని వారు తెలిపారు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని,వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొలిపాక వేణు,కోశాధికారి అరిగెల రమేష్,కార్యదర్శి కాసాని సతీష్,అర్చకులు వెంకటేశ్వర్లు,ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరిలో ఎన్ఎండిసి అత్యుత్తమ ఫలితాలు

- ఎఫ్ వై26లో సంచిత ఉత్పత్తి 18%, అమ్మకాలు 10%
- ఫిబ్రవరి నెలలో రికార్డు స్థాయిలో ఎన్ఎండీసీ ఉత్పత్తి





**హైదరాబాద్, మార్చి 3(జనంసాక్షి) :** దేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు అయిన ఎన్ఎండిసి, ఫిబ్రవరి 2026 నెలలో ఉత్పత్తి, అమ్మకాల పనితీరులో సీపీఎల్ వై గణాంకాల కంటే అద్భుతమైన వృద్ధిని సాధించింది. ఫిబ్రవరి 2026తో ముగిసిన నెలలో, ఎన్ఎండిసి ఏ ఫిబ్రవరి నెలలోనూ రికార్డు స్థాయిలో అత్యుత్తమ నెలవారీ పనితీరును అందించింది. ఉత్పత్తి 5.35 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇది ఫిబ్రవరి 2025లో 4.62 మిలియన్ టన్నుల నుండి సంవత్సరానికి 16% పెరిగింది. అమ్మకాలు నెలవారీగా 15.6% పెరుగుదలను నమోదు చేశాయి. ఇది 3.98 మిలియన్ టన్నుల నుండి 4.60 మిలియన్ టన్నులకు పెరిగింది. ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఇది మైనింగ్ సామర్థ్యం సమర్థవంతమైన వినియోగాన్ని మరియు కంపెనీ ఆస్తులలో మెరుగైన కార్యాచరణ లయను ప్రతిబింబిస్తుంది. ఎఫ్ వై26లో ఎన్ఎండిసి బలమైన ఊపును కొనసాగించింది. ఏప్రిల్-ఫిబ్రవరిలో రికార్డు స్థాయిలో ఉత్పత్తిని నమోదు చేసింది. ఉత్పత్తి గత సంవత్సరం ఇదే కాలంలో 40.49 మిలియన్ టన్నుల నుండి 18% పెరిగి 47.79 మిలియన్ టన్నులకు చేరుకుంది. అయితే అమ్మకాలు ఎఫ్ వై25లో ఇదే కాలంలో 40.20 మిలియన్ టన్నుల నుండి 10% పెరిగి 44.34 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. ఈ పనితీరుపై వ్యాఖ్యానిస్తూ ఎన్ఎండి అమితవ ముఖర్జీ ఇలా అన్నారు. "ఈ పనితీరు మా అన్ని మైనింగ్ కాంప్లెక్స్‌లలో మా బృందాల క్రమశిక్షణ, అంకితభావం, సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది. మేము ఉత్పత్తి చేసే ప్రతి టన్ను భారతదేశ ఉక్కు విలువ గొలుసును బలోపేతం చేస్తుంది. దేశ మౌలిక సదుపా యాల వృద్ధికి దోహదం చేస్తుంది. ఎఫ్ వై27వైపు మేము ముందుకు సాగుతు న్నప్పుడు, మా దృష్టి స్పష్టంగా ఉంటుంది. బాధ్యతాయుతంగా సామర్థ్యాన్ని పెంచడం, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, దేశానికి నమ్మకమైన ముడి పదార్థాల భద్రతను నిర్ధారించడం. ఈ ఘనత నిజంగా ప్రతిరోజూ ఎన్ఎండిసి పురోగతిని నడిపించే నిబద్ధత కలిగిన మా ఉద్యోగులకు చెందుతుంది." అదనంగా, ఎన్ఎండిసి మూడు ఉత్పత్తి యూనిట్లు సమిష్టిగా రికార్డు ఉత్పత్తిని అందించాయి. ఉక్కు మంత్రిత్వ శాఖ కింద నవరత్న సీపీఎస్సీగా, ఎన్ఎండిసి దాని మైనింగ్ కార్యకలాపాలలో ఉత్పాదకత, సామర్థ్యం, వ్యయ పోటీతత్వాన్ని బలోపేతం చేయడం ద్వారా భారతదేశం పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌కు మద్దతు ఇవ్వడంపై దృష్టి సారించింది.

# ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై విజిలెన్స్

- ఫిర్యాదుల ఆధారంగా అంతర్గత విచారణ
- క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించి నివేదికలు
- జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఆర్టీఏ డిపార్ట్మెంట్లపైనే ఎక్కువ కంప్లైంట్స్

**ముషీరాబాద్, మార్చ్ 03 (జనం సాక్షి):** ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై విజిలెన్స్ డిపార్ట్మెంట్ అంతర్గత విచారణ జరుపుతోంది. జీహెచ్ఎంసీ సహా వివిధ శాఖలపై వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా వివరాలు సేకరిస్తూ సంబంధిత డిపార్ట్మెంట్లతో కూడిన చిట్టాను సిద్ధం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే నమోదైన ఏసీబీ కేసులు సహా బాధితుల నుంచి అందుతున్న సమా చారంతో సోదాలు నిర్వహిస్తోంది. వీటితో పాటు వార్తాపత్రికల్లో ప్రచురితమవుతున్న న్యూస్ ఆధారంగా ఆయా శాఖలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ, అంతర్గతంగా విచారణ జరుపుతూ నివేదికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్స్ సోదాలు జరపడంతో పాటు ఇసుక అక్రమ రవాణాకు సంబంధించిన రిపోర్టులను ప్రభుత్వానికి అందించింది. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటోంది.

**ఆ మూడు డిపార్ట్మెంట్ల పైనే విజిలెన్స్ గురి :**

రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ శాఖలపై గత కొంత కాలంగా విజిలెన్స్ డిపార్ట్మెంట్కు అనేక ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఇలాంటి ఫిర్యాదుల పై విజిలెన్స్ అధికారులు అత్యంత రహస్యంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రశ్నావళిని రూపొందించారు. డిపార్ట్మెంట్ల వారీగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నారు. స్థానిక అధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా వివరాలు సేకరిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై నిఘా పెడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల గురించి అంతర్గత విచారణ జరుపుతున్నా రు. ఇందుకు సంబంధించిన పలు ప్రభుత్వ శాఖల రిపోర్టులను ఇటీవల ప్రభుత్వానికి అందించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అంతరాష్ట్ర ముఠా అరెస్ట్

- నిజామాబాద్‌లో ఏడుగురు అరెస్టు, ముగ్గురు పరారీలో
- పాత నేరస్తులతో కలిసి వరుస చోరీలు
- 1.20 క్వింటాల్ కాపర్, రూ.2.75 లక్షల నగదు స్వాధీనం
- నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ నష్టం




**నిజామాబాద్, మార్చి 3(జనంసాక్షి) :** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్‌ను టార్గెట్ చేసుకొని నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గతంలో రోడ్లపై ఆవులు, వాహనాల దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించిన పాత నేరస్తులు జైలులో పరిచయమైన ఇతరులతో కలిసి ఈ ముఠాను ఏర్పాటు చేసుకున్నారు.

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య బుధవారం కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ ముఠా సభ్యులు దొంగిలించిన బైక్‌లపై తిరుగుతూ పగటిపూట ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, రాత్రి సమయంలో వచ్చి వాటిని ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించేవారని సీపీ తెలిపారు.

నిర్మల్ జిల్లాలో బైంసా, బాసర, కుంటాల, నర్సాపూర్ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్, నవీపేట్, బోధన్ రూరల్, ఎడపల్లి, నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ చోరీలు జరిగాయి. ఈ ముఠా సభ్యులు అఫ్జల్ ఖాన్, అర్బాజ్ ఖాన్, అన్సార్, షేక్ తాహెర్, సిద్ధిక్ ఖాన్, మమ్మద్ అప్సర్, మహెబూబ్ ఖాన్, షేక్ ఆరిఫ్, మహమ్మద్ రాజా, బొర్గే బాలాజీ అనే 10 మందిని గుర్తించినట్లు సీపీ వెల్లడించారు.

ప్రస్తుతం ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, అన్సార్, షేక్ తాహెర్, సిద్ధిక్ ఖాన్ అనే ముగ్గురు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 1.20 క్వింటాల్ కాపర్ కాయిల్స్, రూ.2 లక్షల 75 వేల నగదు, రెండు దొంగిలించిన ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోరిక్షా, చోరీలకు వాడిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ పర్యవేక్షణలో నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పడి విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. నవీపేట్ ఎస్సై శ్రీకాంత్, మాక్లూర్ ఎస్సైలు యాదగిరి గౌడ్, రాజశేఖర్, నిజామాబాద్ ఐదవ టౌన్ ఎస్సై గంగాధర్ తమ సిబ్బందితో కలిసి ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య ఏఎస్ఐలు గఫార్, హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, కానిస్టేబుళ్లు రాజారెడ్డి, సందీప్, అబ్బులు, శ్రీకాంత్ గౌడ్, దత్తాత్రేగౌడ్, నాగరాజు, శంకర్, సాయిలు, రామకృష్ణ, సచిన్‌లను అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు.

# అయ్యా రేవంత్ రెడ్డి హ్యాపీ హోలీ.. మాకెందుకీ రక్త కేళి

**ఓట్లేసిన పాపనికి రక్తం కళ్ళ చూస్తారా**

- మొహంపై రంగు చల్లుకుని రహదారిపై వినూత్న నిరసన
- డబుల్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వీడండి.
- ప్రాణాలు పోతే గాని రోడ్డు పూర్తి చేయరా?
- ఇది మాలేషియనో, మహారాష్ట్రనో కాదు..మానకొండూరు
- నడి రోడ్డు పై నిరసన తెలిపిన ముత్యాల జగన్ రెడ్డి



**గన్నేరువరం మార్చి 03 (జనంసాక్షి):** హ్యాపీ హోలీ అంటూ రంగుల పండుగ జరుపుకుంటున్న పాలకులు, గన్నేరువరం మండలంలో డబుల్ రోడ్డు పై రక్త హోలీ జరుగుతుందని, రోడ్డు పై కూర్చొని మొహం పై రంగు చల్లుకుని హోలీ పండుగ సందర్భంగా వినూత్న నిరసన తెలిపారు బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుండ్లపల్లి - పొత్తూరు రహదారి దుస్థితిని నిరసిస్తూ నడి రోడ్డుపై ఆందోళనకు దిగిన ఆయన, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు. గుండ్లపల్లి నుండి పొత్తూరు వరకు ఉన్న ఈ డబుల్ రోడ్డు కోసం దశాబ్దాలుగా ప్రజలు వేచిచూస్తున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో హామీలు... ప్రతి ప్రభుత్వంలో శంకుస్థాపనలు... కానీ ప్రజలకు మాత్రం గాయాలు, ప్రమాదాలే మిగిలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం 71 కోట్ల రూపాయల జి.ఓ. తీసుకొచ్చి శంకుస్థాపన చేసి ప్రచారంతో సరిపెట్టుకుందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే "100 రోజుల్లో రోడ్డు నిర్మిస్తా" అని హామీ ఇచ్చి, ఉన్న రహదారినే చెడగొట్టి కంకర పోసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నిత్యం ఆ కంకర రాళు ఎగిరిపడి చిన్నారులు, వృద్ధులు గాయపడుతున్నారని. తన మొఖంపై ఉన్న హోలీ రంగులా ప్రజల ముఖాలపై రక్తపు మచ్చలు పడుతున్నాయి. ఓట్లేసిన పాపానికి ప్రజలు రక్తం కళ్లతో చూడాలా?" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. వర్షాకాలం వస్తే మండలం మొత్తం జలదిగ్బంధనానికి గురవుతుందని, అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. ఈ రహదారి కేవలం అసౌకర్యం కాదు- ఇది ప్రాణహాని అని, ప్రతి రోజు ప్రమాదాల అంచున ప్రజలు జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజల ప్రాణాలు కూడా విలువైనవేనని, వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
4 మార్చి 2026

# ప్రాణం తీసిన స్పోర్ట్స్ బైక్ రైడ్ సరదా

- స్నేహితుడితో కలసి రైడ్ చేస్తుండగా ప్రమాదం

**హైదరాబాద్, మార్చి3 (జనంసాక్షి) :** స్పోర్ట్స్ బైక్‌పై మోజు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. నాగోల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు స్నేహితుల సరదా బైక్ రైడ్ విషాదంగా ముగిసింది. స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మృతుడు విష్ణువర్ధన్, గాయపడిన విద్యార్థి ఉషాకిరణ్ (16)గా గుర్తించారు. విద్యార్థులిద్దరూ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం మ్యాథ్స్ పరీక్ష రాసిన అనంతరం ఎన్జీవోస్ కాలనీ నుంచి కేటీఎం స్పోర్ట్స్ బైక్ ను అద్దెకు తీసుకున్న ఉషాకిరణ్ (16).. దానిపై రైడింగ్ చేయగా, విష్ణువర్ధన్ వెనక కూర్చున్నట్లు తెలుస్తోంది. ఫొటో సెషన్ కోసం శివారులో రైడ్ చేస్తూ అతివేగంతో వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు కాలు, చేయి విరిగినట్లు తెలుస్తోంది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫత్తుల్లాగూడ 100 ఫీట్ రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. ఇదే సమయంలో వారి మరో స్నేహితుడు మణిదీప్ ఫోన్ చేయడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విష్ణువర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన ఉషాకిరణ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

# స్థిరంగా బంగారం ధరలు



**న్యూఢిల్లీ, మార్చి 3 (జనంసాక్షి) :** అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కాస్త స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఒక్కసారిగా పెరిగాయి. యుద్ధం కారణంగా మరింత భారీగా పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. మార్చి 3న మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,70,500 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,290 దగ్గర ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,70,650కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,56,440కి చేరుకుంది. మరోవైపు వెండి ధర కూడా స్థిరంగా కొనసాగుతోంది. మూడు లక్షల రూపాయల మార్క్‌ను దాటేసింది.

# కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**భువనగిరి, మార్చి3 (జనంసాక్షి) :** కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# దేశానికి రాహుల్ నాయకత్వం అవసరం

- ఎంపీ మల్లు రవి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని, ఆయన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధానిని చేయాలని ఎంపీ మల్లు రవి అన్నారు. రెండుసార్లు రాహుల్ గాంధీకి ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నా కూడా ఆసక్తి చూపలేదని, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలు తెలుసుకొని తర్వాతనే పాలకుడిగా రావాలని ఆయన అనుకున్నారని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి చెప్పారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ లో అనేక సమస్యలపై చేస్తున్న పోరాటాన్ని దగ్గర ఉండి చూస్తున్నాం. ఇప్పుడు ఆయన మొదటిసారి ప్రధానమంత్రి అయ్యేందుకు అంగీకారం తెలిపారని మల్లు రవి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశానికి రాహుల్ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందని, ఆయన దేశంలోని సామాజిక సమస్యలపై పూర్తి అవగాహన తెచ్చుకున్నారని, భారత్ జోడో, న్యాయ యాత్రలతో దేశం అంత పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారని మల్లు రవి చెప్పారు. లీడర్ ఆఫ్ అపొజిషన్ రాహుల్ దేశ సమస్యలపై అద్భుతమైన పోరాటం చేస్తున్నారని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రిని చేయడానికి రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనను రాహుల్ అంగీకరించడం హర్షణీయమని మల్లు రవి చెప్పారు.

# ఎస్‌హెచ్‌జీలకు రక్షణ కవచంలా బీమా భరోసా

- ప్రమాద బీమా, లోన్ బీమా కింద ఇప్పటి వరకు రూ. 246 కోట్లు చెల్లింపు
- బీమా భరోసాతో ధైర్యంగా వ్యాపార విస్తరణలో మహిళలు ముందుకు వస్తున్నారు
- పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రమాద బీమా, లోన్ బీమా పథకాలు ఆర్థిక రక్షణ కవచంలా నిలుస్తున్నాయని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మహిళల కుటుంబాలకు భరోసా కల్పించడం, వారి ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ)లోని మహిళలు ఎవరైనా అనుకోని సందర్భంలో మరణిస్తే వారు తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడేవని మంత్రి గుర్తుచేశారు. కుటుంబ సభ్యులు చెల్లించలేని పరిస్థితి ఉంటే ఇతర గ్రూపు సభ్యులే ఆ రుణభారం మోయాల్సి వచ్చేదని చెప్పారు. ఏదేని కారణంతో సభ్యురాలు బ్యాంకు రుణం చెల్లించకపోతే ఆ భారం ఇతర సభ్యులపై పడుతూ వారు కూడా చెల్లించలేని పక్షంలో బ్యాంకులు ఆయా సంఘాలను 'బ్లాక్ లిస్ట్'లో పెట్టేవని వివరించారు. దీని వల్ల కొత్త రుణాలు మంజూరు కాక చాలా సంఘాలు ఇనాక్టివ్‌గా మారాయన్నారు. ఈ అవస్థలకు చెక్ పెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణ బీమాను వర్తింపజేయాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇందులో భాగంగా మహిళలకు జీవిత బీమాతోపాటు వారు పొందిన రుణాలపైనా బీమా వర్తింపజేసేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత బ్యాంకు రుణం తీసుకున్న మహిళ మరణిస్తే సంబంధిత రుణాన్ని ప్రభుత్వమే చెల్లించే విధంగా వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా పథకం కింద ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి ప్రమాద మరణం సంభవించిన పక్షంలో రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. బీమా పథకం అమల్లోకి వచ్చిన 2024 నుంచి ఇప్పటివరకు 231 క్లెయిమ్స్ ను పరిష్కరించి, మొత్తం రూ. 23.1 కోట్లు లబ్ధిదారుల కుటుంబాలకు అందించినట్టు మంత్రి చెప్పారు. అనుకోని ప్రమాదాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా ఈ పథకం పెద్ద ఊరటనిస్తోందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా లోన్ బీమా పథకం ద్వారా మహిళా సంఘ సభ్యులు బ్యాంకుల వద్ద తీసుకున్న బకాయి రుణాలకు గరిష్టంగా రూ. 2 లక్షల వరకు బీమా కవరేజీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 2,993 క్లెయిమ్స్ ను ప్రాసెస్ చేసి మొత్తం రూ. 223.7 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. లోన్ బీమా, ప్రమాద బీమా అమలులోకి వచ్చిన తర్వాత అనేక మహిళా సంఘాలు మళ్లీ క్రియాశీలకంగా మారినట్లు మంత్రి సీతక్క తెలిపారు. కొత్త సభ్యులు సంఘాలలో చేరుతున్నారని, బీమా భరోసాతో మహిళలు ధైర్యంగా వ్యాపారాలు విస్తరించుకుంటున్నారని చెప్పారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# భూదాన్ భూముల్లో బలవంతంగా ఇండ్ల కూల్చివేత

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలకు ఖండన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణంలోని వెలుగుమట్ల గ్రామంలో దాదాపు 700 కుటుంబాలు 10 ఏళ్లుగా భూదాన్ భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని నివసిస్తుంటే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మంది పోలీసులతో, బుల్డోజర్లతో బలవంతంగా కుటుంబాలను బయటకు పంపించి ఇండ్లను కూల్చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. ఖమ్మం ఘటనలో కేరళ సీఎం విజయన్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇదంతా అవాస్తవమని, కేరళ ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర రాజకీయాలు, ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతున్నారనడం సరైంది కాదన్నారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఖండించారు. వాస్తవంగా వెలుగుమట్లలో ఎంత విధ్వంసం జరిగిందో, కుటుంబాలు ఎన్ని ఇబ్బందుల పాలవుతున్నారో రాష్ట్ర ప్రజానీకానికి తెలుసన్నారు. శిబిరాల్లో ఉన్న వారికి కనీస సౌకర్యాలు కూడా లేవనే విషయం మీడియాలో, పత్రికల్లో వస్తున్నది.. అక్కడ వెళ్ళిన మీడియా ప్రతినిధుల కూడా అరెస్టు చేసి, నిర్బంధిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నది వాస్తవం కాదా? ఆ ఎంపీకి ఆ పోరాటాలు కనపడటం లేదా? వినపడటం లేదా? ఊహాగానాలతో మాట్లాడటం సమంజసం కాదు.. అని మండిపడ్డారు. అవాస్తవాలను మాట్లాడటం సరైంది కాదు.. ఇప్పటికైనా అక్కడున్నటువంటి పేదలకు అక్కడే ఇండ్లు నిర్మించి, స్థిర నివాసం ఏర్పాటు చేయాలి.. అని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఇలాంటి అవాస్తవాలను మాట్లాడి ప్రజలను మభ్య పెట్టదలచుకుంటే తప్పకుండా ప్రజలు తెలంగాణ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# జింఖానా గ్రౌండ్స్ వద్ద ధర్నా

**హైదరాబాద్, మార్చి 3 (జనంసాక్షి) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్స్ వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్ పెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. క్రీడాకారులకు అన్యాయం చేసి, ప్రైవేటు వ్యక్తులు డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. విశాక ఇండస్ట్రీస్‌కు బదిలీ చేసిన రూ.68.73 కోట్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్నాథ్ ఖండించారు. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏ చెక్కులపైనా సంతకాలు చేయలేదన్నారు. రూ.68.73 కోట్లు హెచ్‌సీఏ నుంచి కంపెనీకి చెల్లింపులో తన ప్రమేయం లేదన్నారు. తాను బాధ్యతలు తీసుకోకముందే చెల్లింపుల ప్రాసెస్ జరిగిందని చెప్పారు. డబ్బులు చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు అమర్నాథ్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో రూ.70 కోట్ల అవినీతి!

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. హెచ్‌సీఏలో రూ.70 కోట్ల అవినీతి జరిగిందంటూ క్రికెట్ సంఘాలు ఆరోపిస్తున్నాయి. విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.70 కోట్లు చెల్లించారని మండిపడుతున్నాయి. తాజాగా ఈ అంశంపై హెచ్‌సీఏ ప్రెసిడెంట్ స్పందించి.. చెల్లింపుల వెనుక తన ప్రమేయం ఏమీ లేదని చెప్పుకొచ్చారు. దీంతో మంగళవారం సికింద్రబాద్‌లోని జింఖానా మైదానంలో గందరగోళం చోటుచేసుకుంది. రూ.70 కోట్ల కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో హెచ్‌సీఏ ప్రెస్‌మీట్‌ను క్రికెట్ సంఘాలు అడ్డుకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన జింఖానా మైదానికి చేరుకుని ఆందోళన కారులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను వరుస వివాదాలు వెంటాడున్నాయి.

# సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

- నేడు వేకువ జామున తిరిగి దర్శనాలు

**హైదరాబాద్/తిరుపతి, మార్చి3 (జనంసాక్షి) :** సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఆలయాలు మూతపడ్డాయి. సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసేశారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాల తర్వాత మాత్రమే భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. చంద్రగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోని దాదాపు ఆలయాలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు మూసివేసారు. అనంతరం ఆలయ శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. చంద్రగ్రహణం కారణంగా దర్శన సమయాల్లో మార్పులు చోటుచేసుకున్నందున, భక్తులు ముందస్తుగా సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల అత్యంత ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలతో సహా పలు ఆలయాలు మూసివేశారు. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా తెలంగాణలోని పలు ప్రముఖ ఆలయాలను తాత్కాలికంగా మూసేశారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసేశారు. తిరిగి బుధవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. నిర్మల్ జిల్లా బాసర ఆలయాన్ని కూడా మూసివేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు ఉదయం 6.15 నుంచి సాయంత్రం 7.15 వరకు మూసివేసారు. అనంతరం పుణ్యాహవాచనం, సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం అనుమతిస్తారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలు కూడా మూసివేసారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరిచి శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి, అనంతరం నిత్యపూజల తర్వాత దర్శనాలు ప్రారంభిస్తారు. ఓదెల మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని గ్రహణం కారణంగా మూసి వేసారు. ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల అనంతరం భక్తులకు అనుమతి ఇస్తారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7.30 వరకు మూసివేసారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తులు ఆలయ సమయాలను గమనించి దర్శనానికి రావాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఇరాన్ అధినేతను హత్య చేసినా నోరు మెదపరా?

- ఇదెక్కడి విదేశాంగ విధానమో మోడీ చెప్పాలి
- కూటమి నేతలు కూడా ఖండించక పోవడం దారుణం
- మీడియా సమావేశంలో బివి రాఘవులు, శ్రీనివాసరావు



**విజయవాడ, మార్చి 3 (జనంసాక్షి) :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి కేవలం ఇరాన్ కే పరిమితం కాకుండా ప్రపంచాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేసే స్థాయికి చేరుకుంటుందని సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు అన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బివి.రాఘవులు మాట్లాడుతూ వెంటనే ఈ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నేడు అమెరికా పలు అబద్దాలను చెప్పి ప్రపంచ ప్రజానీకాన్ని మభ్యపెట్టి యుద్దాన్ని మారణహోమాన్ని సమర్థించుకుంటుందని, ట్రంప్ ప్రయత్నాన్ని ప్రపంచ ప్రజలంతా, శాంతి కాముకులంతా ఖండించాలని కోరారు. అన్ని సందర్భాలలో భారతదేశానికి గట్టి మిత్రుడిగా ఉన్న ఇరాన్ పై మరో దేశం దాడి చేసి ధ్వంసం చేస్తుంటే దాన్ని ఖండించాల్సిందిపోయి ఇంతవరకు భారత ప్రధాని నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంగా జరుపుతున్న దాడిని కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి, ప్రతిపక్ష వైసిపి ఖండించాలని బి.వి.రాఘవులు కోరారు. ప్రధాని మోడీ ఇజ్రాయిల్ నాయకత్వంతో మాట్లాడి వచ్చిన తరువాతే ఇరాన్‌పై దాడి జరిగిందని, దాడి గురించి ముందే మోడీకి తెలిసి ఉండాలని అన్నారు. బలమైన నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్న కేంద్రం దీన్ని ఎందుకు పసిగట్టలేకపోయిందో చెప్పాలన్నారు. లేక దాడి విషయం ముందే తెలిసి ఇజ్రాయిల్ ప్రధానిని కలిశారా? అదైనా బయటపెట్టాలన్నారు. ఇరాన్ అన్ని సందర్భాల్లోనూ భారత దేశానికి మంచి మిత్రుడిగా ఉందని, అయినా ఆ దేశ అధినాయకుడిని చంపేస్తే స్పందించకుండా యుఏఈలో అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశారనే అంశంపై మాత్రమే స్పందించడం అన్యాయమని తెలిపారు. ఇరాన్‌పై దాడితో ప్రపంచ ఆర్థిక పరిస్థితి ముఖ్యంగా ఇండియా పరిస్థితి దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడిని నిలిపేయాలని అన్ని దేశాలూ డిమాండు చేయాలని అన్నారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, సఫలమవుతున్నాయని అనుకున్న సమయంలోనే అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసి చర్చలకు విఘాతం కలిగించాయని అన్నారు. అప్రజాస్వామికంగా స్కూళ్లపై దాడిచేసి విద్యార్థులను చంపేసిందని తెలిపారు. తమపై దాడి చేస్తారనే ఉద్దేశంతోనే తాము దాడిచేశామని ట్రంప్ చెబుతున్న మాటలు అబద్దాలని, ఇరాన్ అటువంటి ఆలోచనలు చేయడం లేదని పెంటగాన్ నివేదిక తెలిపినా దాడి చేశారని తెలిపారు.

# కనువిందు చేసిన చంద్రగ్రహణం

- ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వీక్షణం



**న్యూఢిల్లీ, మార్చి 3 (జనంసాక్షి) :** ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం కనువిందు చేసింది. చంద్రగ్రహణం సందర్భంగా చందమామ పూర్తి రక్తవర్ణంలో ప్రకాశవంతంగా మెరిసిపోయింది. భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు.. ఉత్తర అమెరికా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, కాలిఫోర్నియాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం స్పష్టంగా కనిపించింది. ఆయా దేశాల్లో రక్తవర్ణంలో కనువిందు చేసిన చంద్రుడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రగ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలు ప్రారంభమయ్యింది. సాయంత్రం 4.34 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. 5.33 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం వీడింది. అయితే, 6.47 గంటలకు గ్రహణం వీడుతుందని తెలిపారు.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కనిపించిన ఈ సంపూర్ణ చంద్రగ్రహణం మన దేశంలో మాత్రం కొన్ని చోట్ల మాత్రమే కనిపించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370